Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

మంగళవారం, మే 05, 2026 | సంపుటి - 20 | సంచిక 229 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# తెలంగాణలోనూ ఇక బిజెపి ఖాయం

## ఇండియా కూటమికి ఈ ఫలితాలు చెంపపెట్టి
## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు



హైదరాబాద్ : తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇండియా కూటమికి బుద్ధి చెప్పారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఈ ఫలితాలను చూస్తే తెలంగాణలోనూ భాజపా అధికారంలోకి వస్తుందనేది స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. గత 33 ఏళ్లు కమ్యూనిస్టులు, 15 ఏళ్లు తృణమూల్ పాలించిన బెంగాల్ కోటలో భాజపా విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

తరువాయి 2లో

# దేశమంతా డబుల్ ఇంజన్
# సర్కార్ ఖాయం

## స్థానిక వ్యతిరేకతతోనే కేరళలో కాంగ్రెస్ విజయం
## కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్య



కరీంనగర్ : దేశమంతా ఇక డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. పశ్చిమబెంగాల్‌లో ఎన్నో అరాచకాలు జరిగాయని.. బంగ్లా చొరబాటు దారులకు దారులు మూసుకుపోయాయని సంజయ్ కుమార్ పేర్కొన్నారు. దేశం అంతా బీజేపీని కోరుకుంటోందని ఉద్ఘాటించారు. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కలలు కంటున్నారని అన్నారు. సీఎం ఎక్కడికి వెళ్తే.. అక్కడ కాంగ్రెస్‌కు ఓటమినేనని ఎద్దేవా చేశారు. కేరళంలో వ్యతిరేకత ఉండటంతోనే.. ఈ ఫలితాలు కాంగ్రెస్‌కు కొంత అనుకూలంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు.

2లో



# ఓఆర్ఆర్‌పై వాహనాలు
# నిలపడం నేరం

## సెల్ఫీలు, విశ్రాంతి కోసం ఆపడం సరికాదు
## బ్రేక్‌డౌన్ అయినప్పుడు 14449కు ఫోన్ చేయండి
## వాహనదారులకు కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక

హైదరాబాద్ : హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ కీలక సూచన చేశారు. ఇటీవల కాలంలో ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొట్టడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి పలు సూచనలు చేశారు. ఈ మేరకు సజ్జనార్ ఓ ప్రకటన విడుదల చేశారు. వాహనాల బ్రేక్ డౌన్, మెడికల్ ఎమర్జెన్సీ వంటి బలమైన కారణాలు ఉంటే తప్ప, సెల్ఫీలు దిగడానికి లేదా విశ్రాంతి తీసుకోవడానికి

2లో

# తమిళనాట విజయ్ పార్టీ విజయం ఖాయం

## ఏడాది క్రితమే జోస్యం చెప్పిన ప్రశాంత్ కిషోర్
## ఆనాటి వీడియో సోషల్ మీడియాలో వైరల్




న్యూఢిల్లీ : తమిళనాడులో విజయ్ టీవీకే 98 నుంచి 120 సీట్లు గెలుస్తుందని గత ఏడాది మార్చిలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ముందే జోస్యం చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ తాజాగా సునామీ సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన గెలుపు ఖాయమని ఏడాది క్రితమే ప్రశాంత్ కిషోర్ చెప్పిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

2లో

# ఐదు రాష్ట్రాల
# ఎన్నికల ఫలితాలు


## అసోం, పుదుచ్చేరిల్లో అధికారం నిలబెట్టుకున్న బిజెపి
## బెంగాల్లో పాగా వేసిన బిజెపి..మట్టి కరిచిన మమతా బెనర్జీ
## కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం
## తమిళనాట విజయ్ కొత్త కెరటం

న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా వచ్చాయి. అసోం, పుదుచ్చేరిలో అధికారం నిలుపుకున్న బిజెపి, బెంగాల్లోనూ విజయభేరి మోగించింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం సాదించింది. తమిళనాట విజయ్ నేతృత్వంలోని టివికె అనూహ్యంగా దూసుకుని వచ్చింది. యావత్ దేశం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ హవా కొనసాగింది. డీఎంకే, అన్నాడీఎంకేను దాటి ఆధిక్యంలో కొనసాగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి షాకిస్తూ భాజపా దూసుకెళ్లింది. కేరళలో యూడీఎఫ్ కూటమి ఆధిక్యంలో కొనసాగుతోంది.

2లో

# తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతం

## ద్రవిడ పార్టీల పాలనకు చరమగీతం
## అనూహ్యంగా దూసుకు వచ్చిన విజయ్ పార్టీ
## మ్యాజిక్ ఫిగర్‌కు చేరువగా టివికె
## ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందు చేసిన ఫలితాలు
## తమిళనాడు సిఎం స్టాలిన్ ఘోర పరాజయం
## ఆయన బాటలోనే అత్యధిక మంత్రులు ఓటమి
## పెద్దగా ప్రభావం చూపని బిజెపి నేతలు



చెన్నై : తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతమయ్యింది. అనూహ్యంగా దూసుకు వచ్చిన నటుడు విజయ్ పార్టీ తమిళనాట జెండా పాతింది. ఎగ్జిట్ పోల్ అంచనాలను తలకిందులు చేస్తూ ద్రవిడ పార్టీలను మట్టి కరిపించింది. అధికార డిఎంకెను ఓ కుమ్ము కుమ్మింది. తమిళనాట హిందీ వ్యతిరేకత, దక్షిణాదికి అన్యాయం అంటూ హుంకరించిన సిఎం స్టాలిన్ పార్టీ ఓడడమే గాకుండా స్వయంగా ఆయన కూడా ఓడిపోయారు. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళసై సైతం వరుసగా రెండోసారి ఓటమిదిశలో ఉన్నారు. ఒకప్పటి తన అనుచరుడు, డిఎంకె పార్టీ నేత చేతిలో దారుణంగా ఓటమి చెందారు. ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం విజయం దిశగా ఉన్నారు. మంత్రులు చాలామంది ఇంటి ముఖం పట్టారు.

2లో



# బెంగాల్‌లో పాగా వేసిన
# బిజెపి

## 205 సీట్లతో భారీ విజయం నమోదు
## మట్టి కరిచిన మమతా బెనర్జీ టిఎంసి
## వ్యూహాత్మక ప్రణాళికతో కాషాయదళం విజయం

కోల్‌కతా : బెంగాల్ దంగల్‌లో బిజెపి గెలిచింది. అనుకున్నట్లుగానే మమతను మట్టి కరిపించింది. టీఎంసీ కంచుకోటను భాజపా బద్దలు కొట్టింది. 15 ఏళ్లుగా ఎదురులేకుండా బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీకి గట్టి షాకిచ్చింది. గత రెండు దఫాల్లో సాధ్యంకాని విజయం ఈసారి కమలనాథుల వశమైంది. పశ్చిమబెంగాల్ లో అనుసరించిన పదునైన వ్యూహం ఈసారి పార్టీకి కచ్చితమైన ఫలితాన్ని తీసుకొచ్చింది. భాజపా అగ్రనేత అమిత్‌షా అన్నీ తానై ఈ ఎన్నికల్లో పార్టీని నడిపించారు. మొత్తం 293 స్థానాల్లో 205 స్థానాల్లో బిజెపి ఘన విజయం సాధించింది. మమతా బెనర్జీ పార్టీ 85 స్థానాలకు పరిమితం అయ్యింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అంచనాలను తలకిందులు చేస్తూ మమతా బెనర్జీ సత్తా చాటారు.

2లో

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్



## కొనుగోళ్లు లేక అన్నదాతల ఆగమాగం
## శనగ పంట చేతికి వచ్చినా కొనుగోళ్లు ఏవీ
## సదాశివపేటలో రైతులను పరామర్శించిన కెటిఆర్

సంగారెడ్డి : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుని చచ్చే వరకు వేధిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శనగ పంట వచ్చి.. నెల రోజులైనా ఇప్పటి వరకు ఆ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఇప్పటి వరకు సరిగా ఇవ్వలేదన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని పంటలు కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను ఈ ప్రభుత్వంలోని నేతలు వచ్చి మోసం చేశారని విమర్శించారు.

2లో

# కేరళంలో యూడిఎఫ్‌కు పూర్తి ఆధిక్యం


## కేరళ కాంగ్రెస్ కార్యాలయంలో సంబరాలు
## కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిన కెసి వేణుగోపాల్
## ప్రజలు మార్పు కోరుకున్నారన్న శశిథరూర్

తిరువనంతపురం : కేరళం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యం కనబర్చింది. ప్రస్తుతం యూడీఎఫ్ 97 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, అధికార ఎల్‌డీఎఫ్ 42 సీట్లలో లీడింగ్‌లో ఉంది.

2లో

# మోడీ నాయకత్వానికి
# ప్రజల మద్దతు

## ఎన్నికల ఫలతాలపై చంద్రబాబు నాయుడు



అమరావతి : ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీఏ అభ్యర్థులు ముందంజలో కొనసాగుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతున్నారని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల ట్రెండ్‌ను పరిశీలిస్తే ఎన్డీఏ అభ్యర్థుల ప్రదర్శన స్పష్టంగా కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. ప్రజల్లో మోదీపై విశ్వాసం తగ్గలేదని, మరింతగా పెరిగిందని అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి దిశగా కేంద్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల కు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే 'వికసిత భారత్' లక్ష్యానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ దిశగా కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని తెలిపారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదం కేవలం

2లో

# తిరుపతి జిల్లాలో
# ఘోర రోడ్డు ప్రమాదం

## ఆగివున్న లారీని ఢీకొన్న అంబులెన్స్
## రోగి సహా నలుగురు దుర్మరణం

శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాళహస్తి సమీపంలోని ఊరందూరు హైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలు కాగా..

2లో

# నెల్లూరు జిల్లాలో మహానాడు

## మహానాడు కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు
## జిల్లా పర్యటనలో మంత్రి నారాయణ వెల్లడి



నెల్లూరు : తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది నిర్వహించే మహానాడును ఈ సారి నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ వెల్లడించారు. మహానాడును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహానాడును ఇఫ్కోసెజ్‌లో నిర్వహించాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. అక్కడ రెండు వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు.

తరువాయి 2లో

## తెలంగాణలోనూ ఇక బిజెపి ఖాయం

అస్సాంలో మూడోసారి భాజపా కూటమి అధికారంలోకి వస్తోందన్నారు. కుటుంబ రహిత, అవినీతి రహిత పాలన అందించాం కాబట్టే.. అస్సాంలో మళ్లీ తమ పార్టీ విజయం సాధించిందని తెలిపారు. ఉత్తరాది, దక్షిణాది వైషమ్యాలు సృష్టించిన ఇండియా కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ తుడిచి పెట్టుకుపోతుందన్నారు. కూకట్‌పల్లి నుంచి మైనార్టీలు భాజపాలో చేరారని.. ముస్లిం మహిళలు మోదీని పెద్దన్నగా భావిస్తున్నారన్నారు. మే 10న పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు పెద్దఎత్తున జనం తరలిరావాలని పిలుపునిచ్చారు.

# దేశమంతా డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ రావాలని ప్రజలు కోరుకున్నారని అన్నారు.బీజేపీకి అసలు ప్రచారకర్త రాహుల్ గాంధీనేనని బండి సంజయ్ సెటైర్లు గుప్పించారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేసేందుకు ప్రయత్నించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్‌కు ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని బండి సంజయ్ అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లోనూ మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ దుకాణంలో జరిగిన కాల్పుల ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సింది పోయి.. ఈ ఘటనను రాజకీయ కోణంలో చూస్తున్నారని విమర్శించారు. దుకాణం యాజమాన్యంతో మాట్లాడానని, బాధితులకు అండగా నిలవాలని కోరానని అన్నారు.

# ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలపడం నేరం

వాహనాలను రోడ్డు పక్కన నిలపడం చట్టరీత్యా నేరమని.. అత్యంత ప్రమాదకరమని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఒకవేళ మీ వాహనం ఆగిపోతే, తక్షణమే 14449 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. వీరు మీకు తగిన సహాయం అందించడమే కాకుండా, ఇతర వాహనదారులను అప్రమత్తం చేసే ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో వాహనాన్ని నిలపాల్సి వస్తే, వేగంగా వచ్చే ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఎడమ వైపు ఉన్న లైన్‌లో మాత్రమే నిలపాలని సీపీ సజ్జనార్ సూచించారు. వాహనం ఆపినప్పుడు, వెనుక నుంచి వచ్చే వారికి కనీసం 50 నుంచి 100 మీటర్ల దూరం నుంచే తెలిసేలా 'రిఫ్లెక్టివ్ ట్రయాంగిల్స్' లేదా ఇతర హెచ్చరిక గుర్తులను ఏర్పాటు చేయాలని తెలిపారు. వాహనం ఆపి ఉన్నంత సేపు హజార్డ్ లైట్లను (నాలుగు ఇండికేటర్లు) ఆన్ చేసి ఉంచడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని అన్నారు. క్షఖీఖీపై వాహనాల వేగ పరిమితి గంటకు 120 కిలోమీటర్ల వరకు పెంచిన నేపథ్యంలో, ఒక్క చిన్న పొరపాటు కూడా భారీ ప్రాణ నష్టానికి దారితీసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నిబంధనలను పాటించి మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడాలని సీపీ సజ్జనార్ సూచించారు.

## ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

తమిళనాడులో మొత్తం 234 స్థానాలు ఉండగా.. టీవీకే 104 చోట్ల ఆధిక్యంలో ఉంది. డీఎంకే 62, అన్నాడీఎంకే 68 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 293 స్థానాలకు గానూ.. భాజపా దాదాపు 205 చోట్ల ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 85 చోట్ల ముందంజలో కొనసాగుతోంది. కేరళలో 140 స్థానాలుండగా.. యూడీఎఫ్ 100 సీట్లను గెల్చుకుంది.. ఎల్‌డీఎఫ్ 32 స్థానాల్లో, ఎన్డీయే 3చోట్ల గెలుపొందింది. అస్సాంలో 126 స్థానాలుండగా.. భాజపా 100కు పైగా సీట్లతో హ్యాట్రిక విజయాన్ని నమోదు చేసింది. స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ 26 చోట్ల ముందంజలో ఉంది. పుదుచ్చేరీలో 30 స్థానాలకు గానూ ఎన్నార్ కాంగ్రెస్9 చోట్ల గెలిచి 11 చోట్ల ఆధిక్యంలో ఉంది. కాంగ్రెస్ 2 చోట్ల గెలిచి.. 5 స్థానాల్లో ముందంజలో ఉంది. మొత్తంగా బిజెపి తనకున్న రెండు రాష్ట్రాలకు తోడు బెంగాల్లో పాగా వేసింది. కేరళలో పదేళ్ల తరవాత మళ్లీ కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. తమిళనాట ద్రవిడ పార్టీలకు పరాభవం తప్పలేదు.

# తమిళనాట విజయ్ పార్టీ విజయం ఖాయం

'ఈ వీడియో దాచి పెట్టుకోండి. ఫలితాల తరువాత ప్లే చేయండి' అని ఆ వీడియోలో ప్రశాంత్ కిషోర్ సవాలు విసిరారు. ప్రశాంత్ కిషోర్ గత ఏడాది మార్చిలో తంతి టీవీ కి ఇంటర్వ్యూ ఇచ్చారు. టీవీకే ఆవిర్భావం జరిగి అప్పటికి ఏడాది అయింది. తమిళ సూపర్‌స్టార్, టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ విజయావకాశాలపై అడిగిన ప్రశ్నకు ప్రశాంత్ కిషోర్ సూటిగా సమాధానమిచ్చారు. విజయ్ ఒంటరిగా ఎన్నికల బరిలోకి వెళ్లాలని పట్టుదలగా ఉన్నారని, అందులో మార్పు ఉంటుందని తాను అనుకోనని చెప్పారు. ఒంటిరిగా ఎన్నికల్లోకి వెళ్తే తమిళనాడులో ఆయన విజయం సాధిస్తారని అన్నారు. విజయానికి అవసరమైన 118 సీట్ల కంటే ఎక్కువే సాధిస్తారని పేర్కొన్నారు. 'ఈ వీడియాను దాచిపెట్టుకోండి... ఫలితాల తరువాత ప్లే చేయండి' అని కూడా ఆయన ధంకా బజాయించారు. ప్రశాంత్ కిషోర్ 'ఐ-ప్యాక్' పొలిటికల్ స్ట్రాటజీ సంస్థ తమిళనాడులో టీవీకేతో కలిసి పనిచేసిందనే వార్తలు కూడా వచ్చాయి. విజయ్‌తో ఉన్న అసోసియేషన్‌ను ఆ ఇంటర్వ్యూలో ప్రశ్నించినప్పుడు, తాము రాజకీయ సహచరుల కంటే మంచి మిత్రులమని అన్నారు. ఐదేళ్ల క్రితం తొలిసారి తాము మాట్లాడుకున్నామని, ఆయనకు తాను రాజకీయ సలహాదారు కాదని, సిద్ధాంతాలు, విలువలపై అభిప్రాయాలు పంచుకుంటూ ఉంటామని చెప్పారు.

# నెల్లూరు జిల్లాలో మహానాడు

ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నామని.. ఈ నెల 6వ తేదీన పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రం, ప్రజల భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయాలను మహానాడులో తీసుకుంటామని.. ప్రజలకు పలు హామీలు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది మహానాడుకు రానున్నారని చెప్పుకొచ్చారు.ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి నారాయణ మరోసారి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) ఉదయం నెల్లూరు జిల్లాలోని దస్తగిరి నగర్‌లో రూ.1.43 కోట్లతో చేపట్టబోయే సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంపై గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపి వెళ్లిందని... పరిశ్రమలు వెళ్లిపోయాయని.. రియల్ ఎస్టేట్ పడిపోయిందని విమర్శించారు. అప్పులు తీరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. సీఎం చంద్రబాబు అనుభవంతో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని తెలిపారు. యువనేత లోకేశ్ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. ఈ ఏడాది దేశంలో వచ్చిన పరిశ్రమల్లో 25 శాతం ఏపీకి వచ్చాయని తెలిపారు. పరిశ్రమలు వస్తే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుందని చెప్పుకొచ్చారు. 'మహానాడు ఎక్కడ పెట్టాలో చెప్పటానికి వైసీపీ నేతలు ఎవరు? మా పార్టీ అధినేత నిర్ణయిస్తారు' అని అన్నారు. వైసీపీ తీరు మార్చుకోకపోతే ఆ పదకొండు సీట్లు కూడా ఈసారి రావని.. జనం గుండు సున్నా పెడతారంటూ మంత్రి నారాయణ హెచ్చరించారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

రాష్ట్రంలో ఏ పంట కూడా సరిగ్గా కొనుగోలు చేయడం లేదంటూ ప్రభుత్వ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. 95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా.. కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారని తెలిపారు.కొనుగోలు కేంద్రాలు ఇప్పటికి ప్రారంభించ లేదన్నారు. ధాన్యం దళారుల పాలు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కేటీఆర్ కుండ బద్దలు కొట్టారు. సీఎం కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతు బంధు వేశారని కేటీఆర్ గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేయవద్దని ఈ ప్రభుత్వం ఆలోచన అని చెప్పారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపించారు. అందుకే ఈ ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని వివరించారు. సీఎం, మంత్రులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడైనా సందర్శించారా..? అని ఈ సందర్భంగా రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎంకి భూముల కొనుగోళ్లు, రియల్ ఎస్టేట్‌పై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బ, పిడుగులు, గుండెపోటు తదితర కారణాలతో రైతులు చనిపోతుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ రాసిన లేఖతో రైతులపై ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. రాబోయే వారం రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలు తిరిగి రైతులకు ధైర్యం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరం అయితే తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామన్నారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ఆ క్రమంలో ఈ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇకపోతే సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై కెటిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకుండా గోస పుచ్చుకుంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులకు సమయానికి రైతుబంధు వేసిన చరిత్ర కేసీఆర్‌ది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకుండా అన్నదాతలను వేధిస్తోందని అన్నారు. ఆంక్షలు లేకుండా పంటలు కొన్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరి, జొన్నలు, శనగ పంటలకు మద్దతు ధర ఇవ్వడం లేదని తెలిపారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ కదం తొక్కుతుందని పేర్కొన్నారు. రాబోయే వారం రోజుల పాటు కొనుగోలు కేంద్రాలను పరిశీలిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా కొనుగోలు కేంద్రాల వద్ద నిరసన తెలియజేయాలన్నారు. తహశీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీద్దామని అన్నారు.

# తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతం

ఇక టీవీకే చీఫ్ విజయ్.. పెరంబూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తాజా సమాచారం ప్రకారం టివికె 108 స్థానాల్లో, 59 స్థానాల్లో డిఎంకె, 44 స్థానాల్లో అన్నాడీఎంకే అభ్యర్థులు లీడింగ్‌లో ఉన్నారు. చెన్నై, చంగల్‌పట్టు, కంచీపురం, తిరువల్లూరులో టివికె విజయ కేతనం ఎగురవేసింది.వాస్తవానికి ఈ ప్రాంతాల్లో ద్రావిడ్ పార్టీల ఆధిపత్యం ఉండేది. సెంట్రల్ తమిళనాడులోనూ టీవీకే మంచి పోటీ ఇచ్చింది. తిరుచిరాపల్లి, తాంజావురు, కరూర్, పెరంబలూరు, అరియాలూరు, నాగపట్టణం, తిరువరూరు, పుదుకొట్టై, మలదుతరై జిల్లాలో టివికె గట్టి పోటీనిచ్చింది. దీంతో దళపతి ఇక కొత్త సిఎంగా కావడం అనివార్యం అయ్యింది. చిన్నా చితక పార్టీలు లేదా అన్నడిఎంకెతో పొత్తు కుదిరితే సరిపోతుంది. మొత్తంగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో దళపతి విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. తన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కళగం ద్వారా ఎన్నికల బరిలోకి దిగిన ఆయన, దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న ద్రావిడ పార్టీలను విస్మయానికి గురిచేశారు. తాజా ట్రెండ్స్ ప్రకారం, విజయ్ నేతృత్వంలోని టీవీకే ఏకంగా 109 స్థానాల్లో ముందంజలో ఉండి, రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించే దిశగా దూసుకుపోతోంది. సినిమా స్టార్‌లు రాజకీయాల్లో రాణించలేరన్న అపవాదును చెరిపివేస్తూ, విజయ్ తన సినీ పాపులారిటీని ఓట్లుగా మార్చుకోవడంలో సఫలమయ్యారు. తద్వారా దివంగత నేతలు ఎన్టీ రామారావు, ఎంజీ రామచంద్రన్, జయలలిత వంటి దిగ్గజాల సరసన ఆయన నిలిచారు. 1977 తర్వాత తమిళనాడులో డీఎంకే, ఏఐఏడీఎంకే కాకుండా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయడం ఇదే తొలిసారి.పార్టీ అధికార ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ.. 'ఇది కుటుంబ రాజకీయాలకు, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు. ఎవరి మద్దతు లేకుండానే మేము సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు. విజయ్ నివాసం వద్ద ఆయన కుటుంబ సభ్యులు పార్టీ గుర్తు అయిన 'విజిల్' సాంగ్‌తో సంబరాలు చేసుకున్నారు. మెజారిటీ మార్కు 118కి టీవీకే చేరువలో ఉంది. చిన్న పార్టీల మద్దతుతో లేదా స్వతంత్రంగా విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయం వద్ద కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ, జెండాలు ఊపుతూ పండుగ చేసుకున్నారు. ఇకపోతే ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఓడిపోయారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన..టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో 9వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. కొళత్తూరు నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన సీఎం ఈ ఎన్నికల్లో విజయం సాధించలేక పోయారు. 1996 తర్వాత స్టాలిన్ ఓడిపోవడం ఇదే తొలిసారి. ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ టీవీకే గెలుపు దిశగా దూసుకుపోతోంది. స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం ఆధిక్యంలో కొనసాగుతున్నారు. వీఎస్ బాబుకు 82 వేల పైచిలుకు ఓట్లు రాగా, స్టాలిన్‌కు దాదాపు 73 వేల ఓట్లు పోలయ్యాయి. అన్నాడీఎమ్‌కేకు చెందిన సంతానకృష్ణన్ దాదాపు 14 వేల ఓట్లతో మూడవ స్థానానికి పరిమితమయ్యారు. 1996 తరువాత డీఎమ్‌కే అధినేతకు ఓటమి ఎదురు కావడం ఇదే తొలిసారి. వీఎస్ బాబు గతంలో డీఎమ్‌కే, ఏఐఏడీఎమ్‌కే పార్టీల్లో సేవలందించారు. 2006-11 మధ్య పురసవల్కం ఎమ్మెల్యేగా పనిచేశారు. 2011 వరకూ డీఎమ్‌కే ఉత్తర చెన్నై డిస్ట్రిక్ట్ సెక్రటరీగా కూడా ఉన్నారు. 2011 నాటి ఎన్నికల్లో కొళత్తూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా కూడా ఉన్నారు. ఆ ఎన్నికల్లో సీఎం స్టాలిన్‌కు మెజారిటీ తగ్గడంతో విమర్శల పాలయ్యారు. అనంతరం అన్నాడీఎమ్‌కేలో చేరారు. ఈ ఏడాది నటుడు విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీలో చేరారు. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో అడుగుపెట్టిన విజయ్ సారథ్యంలోని టీవీకే విజయపథంలోకి దూసుకెళ్తోంది. అయితే మెజారిటీకి 118 సీట్లు అవసరమవుతాయి. మెజారిటీ తగ్గిన పక్షంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఏయే పార్టీలతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉందనే దానిపై తాజాగా సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకునేది లేదని టీవీకే ఇంతకుముందే ప్రకటించింది. అయితే టీవీకే మెజారిటీకి అతి దగ్గరలో ఆగిపోయిన పక్షంలో ఆ పార్టీ మద్దతు తీసుకునే అవకాశాలను తోసిపుచ్చలేమని అంటున్నారు. కాగా, సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్‌లో భాగంగా డీఎంకేతో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకున్నాయి. ట్రెండ్స్ ప్రకారం కాంగ్రెస్ 5 స్థానాల్లో, సీపీఐ రెండు స్థానాల్లో, సీపీఎం ఒక స్థానంలో గెలుపునకు చేరువలో ఉన్నాయి. డీఎంకేతో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్నప్పటికీ ఆ పార్టీలోని కొందరు టీవీకే పట్ల సానుకూలంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్‌లోని ఒక వర్గం మొదట్నించీ పట్టుపడుతోంది. అయితే చివరి నిమిషంలో డీఎంకేతోనే కలిసి పోటీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు తీసుకునే అవకాశాలు బలంగా ఉన్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా ప్రభుత్వం ఏర్పాటులో భాగంగా టీవీకే ఇటు కాంగ్రెస్‌తో పాటు ఐయూఎంఎల్, డీఎండీకే, లెఫ్ట్ పార్టీల సాయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. డాక్టర్ అన్బుమణి రామదాస్ సారథ్యంలోని పీఎంకే మద్దతును కూడా టీవీకే కూడగట్టవచ్చని చెబుతున్నారు. ఏదిఏమైనా పూర్తి ఫలితాలు వెలువడిన తర్వాతే టీఎంకే వ్యూహరచన ఉంటుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

# బెంగాల్‌లో పాగా వేసిన బిజెపి

నాడు భాజపా 10,000 కంటే తక్కువ ఓట్ల తేడాతో 40 స్థానాలు, 5,000 కంటే తక్కువ ఓట్లతో 20 స్థానాలు కోల్పోయి 77 స్థానాలకే పరిమితమైంది. దీంతో దీదీని ఓడించడం అంత సులువు కాదని గ్రహించిన భాజపా వ్యూహాన్ని మార్చుకొంది. సునీల్ భన్సల్ పార్టీ ఇన్‌ఛార్జిగా.. వ్యవస్థీకృత మార్పులు తీసుకొచ్చారు. అమిత్‌షాకు భన్సల్ నమ్మకస్తుడని పేరు. టికెట్ల పంపిణీ విషయంలో సెలబ్రిటీలు, ఫిరాయింపుదార్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీ నాయకులకు భాజపా పెద్దపీట వేసింది. ప్రతి బూత్‌స్థాయిలో 300 ఓట్లను సమీకరించగల వారికే టికెట్లు కేటాయించింది. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల పుంజుకోవడానికి బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌కు తెరతీసింది. పోలింగ్ కేంద్రాల్లో బలమైనవి, దృష్టిపెట్టాల్సినవి, బలహీనమైనవి అంటూ మూడు వర్గీకరణలు చేసింది. ఇక్కడే 'పన్నా ప్రముఖ్' వ్యవస్థ పనిచేసింది. ప్రతి కార్యకర్త 10-15 కుటుంబాలతో సత్సంబంధాలు నెరిపి 30-60 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. దీంతోపాటు భాజపా 'శక్తికేంద్రాలు'గా వర్గీకరించుకొన్న క్లస్టర్ల నుంచి అధిక పోలింగ్ ఉండేలా నిర్దేశించారు. ఇక అమిత్‌షానే స్వయంగా 152కు పైగా నియోజకవర్గాల్లోని 44,000 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సమావేశాలను పర్యవేక్షించారంటే భాజపా ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. పన్నా ప్రముఖ్ నెట్‌వర్క్‌ను సునీల్ భన్సల్ చూసుకోగా.. బూత్ స్థాయి సమన్వయ బాధ్యతలను భూపేంద్ర యాదవ్ స్వీకరించారు. ఫలితంగా బెంగాల్‌లో రికార్డ్ స్థాయిలో దాదాపు 92శాతం పోలింగ్ నమోదైంది. ఇది భాజపాకు కచ్చితంగా కలిసొచ్చింది. బూత్ స్థాయి సమావేశాల్లో కార్యకర్తలు మమత సర్కారు వైఫల్యం, శాంతి భద్రతల పరిస్థితి, బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు, ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారం వంటివి ప్రస్తావించారు. ఇక ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి కూడా పానిహటి నుంచి భాజపా టికెట్ కేటాయించి.. ఆ అంశాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చింది. దీంతో మమతా విజయావకాశాలను దెబ్బకొట్టినట్లయ్యింది. పశ్చిమ బెంగాల్‌లో 70శాతం ఉన్న హిందూ ఓటర్ల ఏకీకరణే లక్ష్యంగా భాజపా పనిచేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను దృష్టిలోపెట్టుకొని వ్యూహాలను అమలు చేసింది. 2021 ఎన్నికల వేళ నేరుగా మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసి భాజపా దెబ్బతింది. ఈసారి మాత్రం ఆ తప్పు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, అవినీతిని లక్ష్యంగా చేసుకొని భాజపా శ్రేణులు ప్రచారం చేశాయి. 220 నియోజకవర్గాల్లోని టీఎంసీ ఎమ్మెల్యేలపై 'ఛార్జిషీట్లు' విడుదల చేసి ప్రజల్లోకి తీసుకెళ్లారు. 10,000 కిలోమీటర్ల మేరకు భాజపా పరివర్తన్ యాత్రను చేపట్టింది. ఫలితంగా 77 మంది అభ్యర్థులను టీఎంసీ మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈసారి ఎన్నికల్లో మమతా బెనర్జీకి మొదటి నుంచి అనుకూలించలేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే టీఎంసీ అనుకూల అధికారుల బదిలీలు, ఐప్యాక్‌పై ఈడీ దాడులు దీదీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికితోడు ప్రతి 140 మంది ఓటర్లకు ఒక సిబ్బంది చొప్పున మొత్తం 2.4 లక్షల మంది కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. ఈ నిర్ణయంతో పశ్చిమబెంగాల్‌లో అధికార పార్టీల కార్యకర్తలకు సహజంగా ఉండే దూకుడుకు కళ్లెం వేసినట్లైంది. దీనికితోడు సర్ విషయంలో న్యాయస్థానాల వద్ద మమత సర్కారు చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. పశ్చిమబెంగాల్‌లో మహిళా ఓటర్లను ఆకట్టుకొన్న పార్టీకే విజయం లభిస్తుంది. ఇప్పటికే టీఎంసీ నుంచి వారికి లక్ష్మీభాండార వంటి పలు పథకాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా సాధికారతే తమ మ్యానిఫెస్టో లక్ష్యమంటూ భాజపా అగ్రనేత అమిత్‌షా ప్రకటించారు. అంతేకాదు, ప్రతి మహిళకు నెలకు రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మమత సర్కారు ఇస్తున్న దానికిది రెట్టింపు. గర్భిణులకు రూ.21,000, మహిళలకు ఉచిత బస్సు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్, యువతకు నెలకు రూ.3,000 భృతి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఏక మొత్తంగా రూ.15,000 మద్దతు ప్రకటించింది. వరిని క్వింటాల్ రూ.3,100కు కొనుగోలు వాగ్దానం, పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో రాష్ట్ర వాటా పెంచి రైతులకు ఏటా రూ.9,000 చెల్లించేట్లు ఇచ్చిన హామీలు ఆకర్షించాయి. త్తర బెంగాల్‌పై పట్టు బిగించి.. సహజంగానే ఉత్తరబెంగాల్‌లో భాజపాకు పట్టుంది. ఇక్కడ తేయాకు తోటల సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్న రాజబోంగ్షీల సమస్యలపై పార్టీ ఈసారి దృష్టిపెట్టింది. వీరి సంఖ్య 10 లక్షలకు పైగానే ఉంటుంది. ఇక్కడ 2 శాతం ఓట్లు పెరిగినా.. ఈ ప్రాంతంలో తమ సీట్లను 40కు పైగా పెంచుకొనే అవకాశాన్ని గ్రహించి వాడుకొంది. స్వయంగా అమిత్‌షా ఈ ప్రాంతంలో ప్రచారానికి వచ్చారు. శాంతిభద్రత, సరిహద్దుల రక్షణ విషయంలో భాజపా తనదైన శైలిలో ప్రచారం చేసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే 100? కంచె నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించింది. పశువుల అక్రమ రవాణా, అక్రమ చొరబాట్లను అణచివేస్తామన్న హామీలు ఓటర్లపై పనిచేశాయి. పశ్చిమబెంగాల్‌లో 'బయటవారు' అన్న ముద్ర పోగొట్టుకోవడానికి భాజపా ప్రచారంలో కూడా జాగ్రత్తలు తీసుకొంది. సువేందు అధికారి, సుకాంత్ మజుందార్, దిలీప్ ఘోష్ వంటివారిని ముందుంచి ప్రచారం చేయించింది. కీలక ప్రాంతాల్లో మాత్రం కేంద్ర నేతలే ప్రచారం చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రంలో ఏకంగా 66 ర్యాలీలు చేపట్టారు. ప్రధాని మోదీ 18 కార్యక్రమాల్లో, జేపీ నడ్డా 10 ర్యాలీల్లో ప్రచారాన్ని నడిపించారు. ఇలా వ్యూహాత్మకంగా మమతను దెబ్బకొట్టారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,మే4 : బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. సోమవారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,920గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,340గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,51,220గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,490గా ఉంది. రోవైపు వెండి ధరలు కూడా స్వల్పంగా తగ్గాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,69,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,64,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,69,900గా, బెంగళూరులో రూ.2,64,900గా ఉంది.

# బెంగాల్లో బిజెపి స్పష్టమైన ఆధిక్యం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో భాజపా 190 స్థానాల్లో ముందంజలో ఉండడంతో అక్కడ బిజెఇప ప్రభుత్వ ఏర్పాటు దాదాపుగా ఖాయమయ్యింది. ఈ క్రమంలో సీఎం మమతా బెనర్జీ కీలక ప్రకటన విడుదల చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో భాజపా ఓట్లను దొంగిలించిందని ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. 'ఏజెంట్లు, అభ్యర్థులు ఎవరూ కౌంటింగ్ కేంద్రాలను విడిచి వెళ్లొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. ఇది భాజపా పథకం. మొదటి రెండు, మూడు రౌండ్లలో వారే ఆధిక్యంలో ఉన్నట్లుగా చూపిస్తారని నేను ముందు నుంచి చెబుతూనే ఉన్నాను. కొన్నిచోట్ల రెండు, మూడు రౌండ్ల తర్వాత కౌంటింగ్ ఆపేశారు. టీఎంసీని అణచివేసేందుకు కేంద్ర బలగాలను బలవంతంగా ఉపయోగిస్తున్నారు. సీట్ల ఆధిక్యంపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం కేంద్ర బలగాలతో కలిసి ఇష్టానుసారం వ్యవహరిస్తోంది. రాష్ట్ర పోలీసులు కూడా కేంద్ర బలగాలకు పూర్తిగా లొంగిపోయారు' అని మమత ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఏజెంట్లు, కార్యకర్తలు ఆందోళన చెందొద్దని, ధైర్యంగా ఉండాలని కోరారు. ఇంకా చాలా రౌండ్లు ఉన్నాయని.. తుది ఫలితాల్లో తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా.. 293 సీట్లకు ఓట్ల లెక్కింపు జరుగుతుండగా.. 190 స్థానాల్లో భాజపా ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 97 స్థానాల్లో, కాంగ్రెస్ 1 చోట ఆధిక్యంలో ఉన్నాయి. ఈ క్రమంలో ఎన్నికల కౌంటింగ్‌కు ముందు బీజేపీపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ కోతలు చోటు చేసుకున్నాయన్నారు. సీసీ టీవీలు కూడా ఆఫ్ అయ్యాయని పేర్కొన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు ఉంచిన ప్రదేశాలకు వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఇవన్నీ బీజేపీ అదేశాల మేరకే జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితులు నెలకున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ పార్టీ కార్యకర్తలకు సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని వారికి సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్ కోసం అధికారులను డిమాండ్ చేయాలని కేడర్‌ను పశ్చిమ బెంగాల్ సీఎం కోరారు. మరోవైపు కోల్‌కతాలోని ఖుదీరామ్ అనుశిలిని స్టేడియంలో కెమెరా ఆఫ్ చేసి ఉన్న కంప్యూటర్ స్క్రీన్ వీడియోను మమత కేబినెట్‌లోని మంత్రి శశి పంజా తన ఎక్స్ ఖాతా ద్వారా పంచుకున్నారు. వీడియో ఆఫ్ చేసిన ఫుటేజ్ తమకు చూపించాలని అధికారులను తాము డిమాండ్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. తమ పోరాటం కొనసాగుతుందని వివరించారు. శ్యామ్‌పుకూర్ అసెంబ్లీ స్థానం నుంచి టీఎంసీ అభ్యర్థిగా శశి పంజా బరిలో నిలిచారు.

## మోడీ నాయకత్వానికి ప్రజల మద్దతు

మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా అమలవుతోందని సీఎం కొనియాడారు. అభివృద్ధి ఫలాలు ప్రతివర్గానికీ అందేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమిని మరింత ఐక్యంగా, బలంగా మారుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత ఫలితాలు మోదీ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని, 'వికసిత భారత్' దార్శనికతకు ఇది బలమైన మద్దతని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 'సబ్ కా సాథ్' స్ఫూర్తితో దూసుకెళ్తున్న ఎన్డీఏ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ మరింత బలోపేతం అవుతుందని ఉద్ఘాటించారు.

# తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

వారిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోల్‌కతా నుంచి ఓ రోగిని చికిత్స నిమిత్తం బెంగళూరు అంబులెన్స్‌లో తరలిస్తుండగా.. ఓరందూరు వద్ద హైవే పక్కన నిలిపి ఉన్న లారీని వెనకనుంచి ఢీ కొట్టింది. అంబులెన్స్‌లో డ్రైవర్‌తో సహా ఆరుగురు ఉన్నట్లు తెలుస్తోంది.ా సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద ఆగి ఉన్న లారీని అంబులెన్స్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ఒక రోగిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై అప్పటికే నిలిపి ఉంచిన లారీని అంబులెన్స్ వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగితో పాటు ఆయనకు సహాయకులుగా ఉన్న మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని ప్రాథమిక సమాచారం. వీరి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. అంబులెన్స్ డ్రైవర్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి మండలం బందారిగుంట గ్రామానికి చెందిన సుధాకర్ రవీందర్, శోభన్ తమకు గ్రామ శివారు సర్వేనెంబర్ 556 లోని ఎకరం 22 గుంటల భూమి ఉందని దీనిని కొందరు అక్రమంగా దొంగ పట్టా చేయించుకున్నారని దీనిని పరిశీలించి ఆ పట్టా రద్దు చేసి మా పేరును విరాసిత్ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డీ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన ఎం రాఘవరెడ్డి తనకు అన్నం పెట్టకుండా పోషణకు వేధిస్తున్న ఇద్దరు కుమారులు కోడలి పై చర్య తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారిగా రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు పెద్దపల్లి పట్టణానికి చెందిన జి సుమలత తనకు జీవనోపాధి కింద ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సోసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్‌లో కోతుల బెడద నివారణకు వినూత్న ప్రయత్నం

### కొండేంగ వేషధారణతో వానర మూకల తరిమివేత





సుల్తానాబాద్, మే 03(ది క్రైమ్ న్యూస్), సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గత కొంతకాలంగా కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు 12వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ శ్రీమతి అమిరిశెట్టి శ్రావణి రాకేష్ వినూత్న చర్యలు చేపట్టారు. రాజీవ్ రహదారి, స్వప్న కాలనీ, టౌన్ షిప్, సాయిబాబా టెంపుల్, జవహర్ నగర్ వంటి ప్రాంతాల్లో కోతులు నివాసాల్లోకి చొరబడి నిత్యావసర వస్తువులను ధ్వంసం చేయడమే కాకుండా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా, మాజీ వార్డు సభ్యులు అమిరిశెట్టి తిరుపతి ఆధ్వర్యంలో ఒక యువకుడికి కొండేంగ (నల్ల ముఖం కోతి) వేషాధరణ వేయించి, ఆయా ప్రాంతాల్లో కోతులను భయపెట్టి తరిమివేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, వార్డు ప్రజల భద్రతే తమ ప్రాధాన్యమని, కోతుల సమస్య శాశ్వత పరిష్కారం కోసం మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తమ విన్నపాన్ని మన్నించి ఈ వినూత్న ప్రయత్నానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అమిరిశెట్టి రాజలింగం, మాటేటి సంజీవ్, వినయ్, ఎండి నయీమ్, టింకు, దొడ్ల సందీప్, పుప్పాల సురేష్, నోముల రాకేష్, లక్ష్మణ్, కుమార్, స్వామి, చైతన్య, సమీర్, కొలిపాక రాజకుమార్, జూపక స్వామి, సాయి, రాహుల్ మరియు శ్రీనివాస్ కాలనీకి చెందిన సుమారు 50 మందికి పైగా మహిళలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి

### మధిర బిజెపి నాయకులు



మధిర ప్రతినిధి (ది,క్రైమ్ న్యూస్) మే 4: ప్రభుత్వం తాను ప్రకటించిన విధంగా మొక్కజొన్న కొనుగోలు జరపాలని, రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే కాంటాలు వేసి సరుకు స్వాధీన పరుచుకోవాలని బిజెపి మధిర మండల ఆధ్వర్యంలో సోమవారం నాడు మధిర మార్కెట్ యార్డ్ లో రాసులుగా పోసి ఉన్న మొక్కజొన్నలను బిజెపి నాయకులు పరిశీలించి అకాల వర్షాల వల్ల మొక్కజొన్నలు తడిసిపోయే అవకాశం ఉంది కావున వెంటనే ప్రభుత్వం ప్రతి గింజలు కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టకుండా తేమశాతం విషయంలో ఇతర నిబంధన విషయంలో సడలింపులు జరపాలని మధిర బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమ కంటెస్టెంట్ అభ్యర్థి పెరుమాళ్ళపల్లి విజయరాజు, మండల అధ్యక్షులు గడ్డ శ్రీహరి జిల్లా కార్యదర్శి రామిశెట్టి నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండా చంద్రశేఖర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు జడ కృష్ణ, పెరుమాళ్లపల్లి మోహన్ రావు, సీనియర్ నాయకులు మధిర మున్సిపల్ కౌన్సిల్ కంటెస్టెడ్ అభ్యర్థి వరదరాజన్ దోర్నాల రవీంద్ర, ఆమన్ రాజు రైతులు పాల్గొన్నారు.

# బీరంగూడలో నూతన 'మిత్ర ఆసుపత్రి' ప్రారంభం



పటాన్చెరు(భీరాంగూడ), మే 04(ది క్రైమ్ న్యూస్) : పటాన్చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన మిత్ర ఆసుపత్రిని సోమవారం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్ రెడ్డి, మానిక్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ ప్రాంతంలో నూతన ప్రైవేటు ఆసుపత్రి ఏర్పాటవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వారి నమ్మకాన్ని పొందాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. అలాగే ఆసుపత్రి అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మిత్ర ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సరిత మాట్లాడుతూ, భీరంగూడ, పటాన్చెరు, అమీన్‌పూర్, ఆర్సీ పురం ప్రాంత ప్రజలు ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని కోరారు. తక్కువ ఖర్చుతోనే అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులో ఉంచామని తెలిపారు. అనుభవం కలిగిన వైద్య సిబ్బందితో గైనకాలజీ, జనరల్, ఆర్థోపెడిక్, డయాబెటిక్, సర్జరీ వంటి విభాగాల్లో సేవలు అందిస్తున్నామని వివరించారు.

# అక్రమ కట్టడాలపై చర్యలేవి?

### అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం





పటాన్చెరు(గడ్డపోతారం), మే 04(ది క్రైమ్ న్యూస్ ): పటాన్చెరు నియోజకవర్గంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు వేగంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా సర్వే నంబర్ 79లో అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణం సాగుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. స్థానికుల ప్రకారం, అక్రమ నిర్మాణాల పేరుతో వివిధ వాణిజ్య కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నియంత్రణ లేకుండా షెడ్లు నిర్మించడం వల్ల పట్టణ ప్రణాళిక దెబ్బతింటోందని అంటున్నారు. అంతేకాకుండా ఈ నిర్మాణాలకు సంబంధించిన ఆస్తి పన్నులు వసూలు కాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గణనీయమైన నష్టం కలుగుతోందని ఆరోపిస్తున్నారు. నియమాల ప్రకారం, వాణిజ్య భవనాలు నిర్మించేందుకు ముందుగా స్థల యజమానులు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి మున్సిపాలిటీ అనుమతి పొందాలి. అనంతరం నిర్మాణం పూర్తయ్యాక డోర్ నంబర్, అసెస్‌మెంట్ తీసుకుని ప్రతి సంవత్సరం ఆస్తి పన్ను చెల్లించాలి. అయితే గడ్డపోతారంలో ఈ నియమాలు పాటించకుండా నిర్మాణాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇకపోతే, అక్రమ నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన మున్సిపాలిటీ , రెవెన్యూ విభాగాల అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం వల్ల అధికారులు అక్రమార్కులకు మద్దతుగా నిలుస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పట్టణంలో నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఖ

# రామప్రభు ఆధ్వర్యంలో చలివేంద్రం




క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో గురునాదం చెరువు వద్ద అలాగే అంగారా రెస్టారెంట్ ఎదురుగా రెండు ప్రదేశాలలో చలివేంద్రాలను ఘనంగా ప్రారంభించారు. ఈ చలివేంద్రాలను సోమవారం మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించి, ప్రజలకు శీతల పానీయాలు మజ్జిగ, రాగిజావను పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు శ్రీకాంత్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి పురుషోత్తం, గంగాధర్, రఘునందన్ రెడ్డి, వినోద్, సుధీర్ కుమార్, మోహన్, ఉదయ్, బాబ్జీ, గిరి, వెంకటేశ్వర్లు, దయాకర్, సోమేశ్వర్, సాంబయ్య, రాజు, రవి, సుప్రజ, లక్ష్మయ్య, శ్రీరాములు, కాంతయ్య, కృష్ణమూర్తి, కాజా తదితరులు, కాలనీ వాసులు, కుటుంబ సభ్యులు ఏ ఆర్ పి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# మారణహోమం 1990 చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



ఖమ్మం ప్రతినిధి ( ది క్రైమ్ న్యూస్ ): ఖమ్మం నగరంలోని విట్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ వేదికగా మారణ హోమం 1990 చిత్రం పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగినది. చిత్ర బృందం హీరో బంధు నరేష్ విలన్ వట్టం రవి(పండు) విట్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నందు చిత్రం ప్రమోషన్ లో భాగంగా సోమవారం పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా హీరో బంధు.నరేష్ మాట్లాడుతూ ఎన్.కే.ఎస్ ఫిలిమ్స్ సమన్విత ప్రెజెంట్స్ లో రాబోతున్న మారణహోమం 1990 చిత్రం యదార్ధ సంఘటనల ఆధారంగా నేటి సమాజం కు దగ్గరగా ఉండే చిత్రంగా అభివర్ణించారు. మణుగూరు వాస్తవ్యులం కావడం వలన ఉమ్మడి ఖమ్మం జిల్లా కళాకారులుగా చిత్ర యూనిట్ తో ప్రమోషన్లను నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు మీ ముందుకు రావడం జరిగిందని త్వరలో థియేటర్లో రిలీజ్ కానున్న మరణహోమం 1990 చిత్రాన్ని ప్రతి ఒక్కరు చూసి మమ్మల్ని ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నట్లు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విట్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు కోడిరెక్క ఉమాశంకర్ మరియు గోగుల చంద్రశేఖర్ అధ్యాపకులు సతీష్ మోహన్, కల్లేపు అఖిల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతివిద్రోహులకు గుణపాటం చెప్పిన ఓటర్లు

### బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి గెలుపే నిదర్శనం..

### సంబరాలు చేసుకున్న బిజెపీ నాయకులు..



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : దేశంపట్ల, సనాతన హిందూధర్మం పట్ల కడుపునిండా విషం నింపుకున్న పార్టీలకు దేశ ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని భారతీయ జనతా పార్టీ నాయకులు అన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరీ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సొంతం కావడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహరరెడ్డి మాట్లాడుతు, భారీ విజయాన్ని అందించిన ఓటర్లకు దన్యవాదములు తెలిపారు. భవిశ్యత్ భారతమంతా ఇక బిజెపిదేనని, కాంగ్రెస్ ముక్త భారత్ కల సాకారం కానుందని ధీమా వ్యక్తం చేశారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ పేరుతో అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి దేశ ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న న్యాయమే అన్ని ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని అందిస్తోందన్నారు. తెలంగాణా కాంగ్రెస్ పార్టీ హామీల అమ్మల్లో విఫలం అయ్యిందని, వాచే ఎన్నికల నాటికి అజేయశక్తిగా ఎదిగి కాంగ్రెసును మట్టి కరిపిస్తామని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో బీజేపీ సీనియర్ నాయకులు శిలావేరు ఓదెలు, నల్ల మనోహర్ రెడ్డి, భూషణవేణ శ్రీనివాస్ గౌడ్, మౌటమ్ నర్సింగం, పర్శ సమయ్య, వెల్లంపల్లి శ్రీనివాస్, గనబోయిన రాజేందర్, శివంగారి సతీష్, తుడి రవీందర్, ఫహీమ్, చాతారాజు రమేష్, మొర మనోహర్, ప్రమోద్, పెండ్యాల కుమార్, తిరుపతి, రాజేంద్ర ప్రసాద్, మహేష్, బండ కరుణాకర్, జెట్టి రాజు, సతీష్, విజయ్, సంతోష్, శివయ్య, రాజు, నూనెటి వెంకటేష్, వేల్పుల సత్యం, బొల్లం వేణు, గొట్టెముక్కుల శ్రీనివాస్, మిట్టపల్లి వెంకటేష్, మల్లరెడ్డి, ఇరుగురాల భానుచందర్, ఓల్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం సేవాభావానికి ప్రతీక : జగదీశ్వర్ గౌడ్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : చలివేంద్రం ప్రారంభం సేవాభావానికి ప్రతీక అని జగదీశ్వర్ గౌడ్ అన్నారు. సోమవారం మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ మెయిన్ రోడ్డులో నాయకులు తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి, ఓబీసీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో దాహంతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు చల్లని త్రాగునీరు అందించడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని అన్నారు. "నీరు జీవం" అని పేర్కొంటూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. చలివేంద్రం ద్వారా ప్రతి ఒక్కరికీ ఉచితంగా శుద్ధమైన నీరు అందించడం ప్రధాన లక్ష్యమని, సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్ల సంజీవ రెడ్డి, రఘునందన్ రెడ్డి, రవీందర్ రావు, వీరేందర్ గౌడ్, మోహన్ రెడ్డి, రాంచందర్ యాదవ్, ఇలియాస్ షరీఫ్, రాంప్రభు, రాంచందర్ గౌడ్, సౌందర్య రాజన్, రవి కుమార్, ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కట్ల శేఖర్ రెడ్డి, వెంకన్న, శ్రీహరి గౌడ్, కృష్ణ, నరేందర్ ముదిరాజ్, శేఖర్, శ్రీదేవి, సంగీత గౌడ్, శాంత తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనను కలిసిన జగదీశ్వర్ గౌడ్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి సృజనని కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గచ్చిబౌలి, నల్లగండ్ల, మాదాపూర్, హాఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్లలో మంజూరైన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించాలని కమిషనర్‌ను కోరారు. అలాగే నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ పరిధిలో కాలనీలు, బస్తీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజల నుంచి తమ దృష్టికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ తెలిపారు.

# సంపాదకీయం

## బిజెపికి మరింత శక్తి !

బెంగాల్, తమిళనాడు, కేరళం ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ మార్పు ఎక్కువగా బిజెపికే లాభిచింది. ముఖ్యంగా బెంగాల్, తమిళనాట పాలకుల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. కేవలం కుటుంబ పాలనతో ప్రజలను విస్మరించిన మమత, స్టాలిన్‌లకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారు. బిజెపికి కొత్త శక్తిని ఇచ్చారు. దేశమంతా ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూసినా..అందరి దృష్టి కేవలం బెంగాల్‌పైనే ఉంది. బెంగాల్లో మమతా బెనర్జీని బిజెపి మట్టికరిపిస్తుందా లేదా అని ఎదురు చూశారు. అనుకున్నట్లుగానే, మోడీ, అమిత్ షా ద్వయం బెంగాల్లో కూడా పాగా వేశారు. అస్సాంలో పట్టు నిల్పుకున్నారు. కలకత్తా కాళీ కరుణించింది. బిజెపికి పగ్గాలు అప్పగించిది. ఇక డబుల్ ఇంజిన్ సర్కార్ అక్కడా మార్పు కోసం యత్నించ నుంది. దేశంలో నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతానికి జరిగిన ఎన్నికల ఫలితాలు మార్పును సూచించాయి. ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు వచ్చాయి. బిజెపి, కాంగ్రెస్ ఖాతాలో మరో రాష్ట్రం పడగా, తమిళనాడులో టివికె పార్టీ తొలి ప్రయత్నంలోనే అధికారం దక్కించుకోబోతోంది. ఇక్కడ డిఎంకె మళ్లీ విజయం సాధిస్తుందన్న అంచనాలు తలకిందులయ్యాయి. కేరళంలో దశాబ్దం తరవాత కాంగ్రెస్ కూటమి అధికారం లోకి రాబోతోంది. ఇక అసోం, పాండిచ్చేరిలో బిజెపి అధికారం నిలుపుకుంది. మొత్తంగా బెంగాల్లో మమత, తమిళనాట స్టాలిన్‌ల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. ఇది వారి స్వయంకృత ఓటమిగానే చూడాలి. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు కేరళం విజయం ఆ పార్టీకి ఊరటనిచ్చే అంశం. తమిళనాట పార్టీ పెట్టిన రెండేళ్లలోనే అధికారం చేపట్టబోతున్న విజయ్ ఓ రకంగా చరిత్ర సృష్టించారనే చెప్పాలి. నిరంకుశంగా పాలించడంతో పాటు కేవలం దక్షిణాది, హిందీ వ్యతిరకత ప్రదర్శించిన డిఎంకెకు ప్రజలు గుపాఠం చెప్పారు. బెంగాల్లో మమతా బెనర్జీ ఏకపక్ష రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. బంగ్లాదేశ్‌కు సరిహద్దు రాష్ట్రంగా ఉన్న బెంగాల్లో అవినీతి, అధికార దురహంకారం పెచ్చుమీరాయి. 15 ఏళ్లపాటు రాజ్యమేలిన బెంగాల్లో మమతా బెనర్జీ రాష్ట్రాన్ని మాఫియా కోటగా తయారు చేసుకున్నారు. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదు. ఓట్ల కోసం అక్ర చొరబాటుదారులను చేరదీశారు. వారికి ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు మంజూరయ్యాయి. బంగ్లా వసలదారుల పెత్తనంలో సొంత రాష్ట్రం ప్రజలు నలిగి పోయారు. పరాయి ప్రజలుగా మారారు. అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు నిత్యకృత్యం అయ్యాయి. ఇవన్నీ ఎదరించిన వారిని మట్టు పెట్టారు. దాడులు, విధ్వంస రచన సాగింది. అందుకే వీటిలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. వరుసగా నాలుగోసారి మమతా బెనర్జీ అధికారాన్ని అందుకుంటారా? లేకుంటే మమత పాలనకు బీజేపీ చరమ గీతం పాడనుందా? అంటూ ఈ రాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దాదాపు 50 ఏళ్ల పాటు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని రెండు పార్టీలే పాలించాయి. 34 సంవత్సరాలు జ్యోతిబసు నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్, ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని ఏలాయి. కానీ ఈ సారి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ పాగా వేయడంతో అక్కడ కొత్త చరిత్ర లిఖితం కాబోతోంది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోరు నడించింది. ఆ సమయంలో బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. దాదాపుగా ఐదేళ్లుగా అక్కడ బిజెపి వివిధ సమస్యలపై పోరాడుతూ వచ్చింది. అందుకు ఫలితం దక్కింది. బెంగాల్లో బిజెపి కాషాయ జెండా ఎగరేయడం ఓ చరిత్రగా చూడాలి. ఇకపోతే ఈ విజయం ఓ రకంగా మోడీ, అమిత్ షాల పట్టుదల, వ్యూహాత్మక రాజకీయాలకు నిదర్శనంగా చూడాలి. రాష్ట్రంలో గత మూడు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన టీఎంసీ నాలుగోసారి విజయంపై ధీమాగా ఉన్నప్పటికీ ప్రజలు ఛీకొట్టారు. మరోవైపు బెంగాల్‌లో పాగా వేయాలని శక్తియుక్తులన్నీ ధారపోసిన బీజేపీ కూడా తనదే విజయం అనిచాటుకుంది. ప్రధాని మోడీ, అమిత్ షాలు ఇక విజయోత్సవాల్లో పాల్గొనడానికి వస్తామని చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువశాతం మాత్రం బీజేపీకే అనుకూలంగా వచ్చాయి. అయితే, తాము 200 పైచిలుకు స్థానాల్లో గెలవబోతున్నామని సీఎం మమత ప్రకటించారు. కానీ ఓటర్లు బిజెపికే పట్టం కట్టారు. ఇక కేరళ విషయానికి వస్తే ఎన్నికల అయిపోగానే ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తన పేరు వెనుక సీఎం అనే పదాన్ని తొలగించు కున్నారు.. వృద్ధాప్యంతో పాటు పలు అవినీతి, కుంభకోణాల కారణంగా అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ లేదా యూడిఎఫ్ అధికారం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత పదేళ్లుగా సినరయ్ విజయ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ప్రజలు మార్పు కోరుకోవడంతో యూడిఎఫ్‌కు మళ్లీ అధికారం దక్కడం ఖాయమయ్యింది. ఇక తమిళనాడు లో ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందే రిసార్టు రాజకీయాలు మొదలయ్యాయి. ఈసారి రాష్ట్రంలో హంగ్ వస్తుందని.. తానే కింగ్ మేకర్ అవుతానన్న ధీమాతో ఉన్న టీవీకే అధ్యక్షుడు దళపతి విజయ్, తన ఎమ్మెల్యేలందరిని రిసార్టుకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. అనూహ్యంగా ఆయనే కింగ్ అయ్యారు. అయితే పూర్తి మెజార్టీకి దూరంలో ఉన్నారు. దీంతో ఇతర పార్టీలతో జట్టుకట్టక తప్పనిపరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో అన్న డిఎంకె కూడా రెండోస్థానంతో సత్తా చాటింది. ఎప్పుడూ ద్విముఖ పోరు జరిగే తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు సాగింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను డీఎంకే లేదా అన్నాడీఎంకే పార్టీలే శాసిస్తుండగా.. వీటి మధ్యలోకి ఈసారి'తమిళ వెట్రి కళగం' (టీవీకే) పార్టీతో సినీనటుడు విజయ్ ప్రవేశించారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకేదే ఈసారి కూడా అధికారమని మె జారిటీ ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. 'యాక్సిస్ మై ఇండియా' మాత్రం విజయ్ పార్టీ ఏకంగా 120 వరకు సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. విజయ్ పార్టీ గెలవడంతో ఇప్పుడు తమిళనాడు లో సరికొత్త రాజకీయ శకం మొదలైనట్లే. మొత్తంగా ఫలితాలు బిజెపిలో ఆశావహ దృక్పథాన్ని నిలిపాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా కొంత తోడ్పడిందనే చెప్పాలి.

# పకడ్బందీగా ఓట్ల లెక్కింపు



## భారీగా బందోబస్తు ఏర్పాటు
## బెంగాల్ కౌంటింగ్‌పై ప్రత్యేక దృష్టి

న్యూఢిల్లీ,మే4 : దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం పకడ్బందీగా చేపట్టారు. భారీ బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు సాగింది. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా భద్రత ఏర్పాటు చేశారు. బెంగాల్లో మరిన్ని బలగాలను మోహరించారు. టీఎంసీ, బీజేపీ మధ్య నువ్వా –నేనా అన్నట్లుగా పోటీ ఉన్న బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు వేళ..ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సీఎం మమతాబెనర్జీ సిద్ధమయ్యారు. ఆదివారమే తన పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు ఆ మేరకు దిశా నిర్దేశంచేశారు. బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీలకు గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఆయా రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు కోసం కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బాలెట్లతో ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యింది. ఎగ్జిట్‌పోల్ సర్వేలు భిన్న ఫలితాలను అంచనా వేయటంతో పోటీచేసిన రాజకీయ పార్టీల్లో ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈసీ చర్యలు తీసుకుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా అడ్డుకోవడానికి తొలిసారి క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టింది. తాజా ఎన్నికల్లో అందరి దృష్టి పశ్చిమ బెంగాల్‌పైనే నిలిచింది. ఇక్కడ 294 అసెంబ్లీ స్థానాలుండగా, నేడు 293 స్థానాల ఫలితాలను ప్రకటించనున్నారు. ఫాల్టా నియోజకవర్గంలో పోలింగ్‌ను ఈసీ రద్దుచేసింది. ఇక్కడ ఈ నెల 21న పోలింగ్ జరగనుంది. ఆమె పోటీ చేసిన భవానీపూర్ నియోజకవర్గం ఫలితంపైఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఇక్కడ ఆమెకు ప్రత్యర్థిగా బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి నిలబడ్డారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో ఆయన మమతను ఓడించారు. బెంగాల్‌లో గత నెల 23, 29 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. దేశ చరిత్రలోనే అత్యధికంగా 92.47శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో ఓట్ల లెక్కింపు కోసం దాదాపు 2.5 లక్షల మంది కేంద్ర బలగాలను నియమించారు. కేరళలో పోలింగ్‌కు ముందే కీలక పరిణామం చోటుచేసుకుంది. వామపక్ష కూటమి ఎల్డీఎఫ్‌ను వరుసగా రెండుసార్లు గెలిపించి చరిత్ర సృష్టించినసీఎం పినరయ్ విజయన్.. తనకు తానుగా సీఎం పేరును వదిలేసుకొని సంచలనం సృష్టించారు. తన సోషల్‌మీడియా ఖాతాలో ఆదివారం ఆయన కేరళ ముఖ్యమంత్రి అనే పదాన్ని తొలగించి సీపీఐఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు అనే పదాలను చేర్చారు. 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. ఈసారి ఇక్కడ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి గెలుపు ఖాయమని ఎక్కువ శాతం ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. అస్సాంలో అధికారాన్ని నిలబెట్టుకోవటంపై బీజేపీ ధీమాగా ఉంది. ఎగ్జిట్‌పోల్ సర్వేలు కూడా మళ్లీ బీజేపీదే అధికారమని ప్రకటించాయి. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తోంది. 126 అసెంబ్లీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరిగింది. 2.50 కోట్ల ఓటర్లున్న ఇక్కడ.. 85.96 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు కోసం 40 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 722 మంది అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో మొత్తం 30 అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు కూడా ఉదయమే ప్రారంభం అయ్యింది. ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి నేతృత్వంలోని 'ఏఐఎన్ఆర్‌సీ – బీజేపీ' కూటమిదే మళ్లీ అధికారమని సర్వేలు తెలిపాయి.

# దేశంలో కమ్యూనిస్టుల పాలన కనుమరుగు..!

హైదరాబాద్ : ఇటీవల ఐదు రాష్ట్రాలకు నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో దేశ



రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నో పార్టీలు పురుడు పోసుకొని రాజకీయాల్లో తమ అస్థిత్వాన్ని చాటుకుంటున్నాయి. ఈ క్రమంలో కేరళలో ఎల్డీఎఫ్ కూటమి ఓడిపోవడంతో దేశంలో కమ్యూనిస్టుల పాలనకు తెరపడినట్లయింది. 1957లోఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో కేరళలో ప్రపంచంలోనే మొదటిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కేరళ, పశ్చిమ బెంగల్, త్రిపుర ఇలా 49 ఏండ్ల ఏండ్లలో ఏదో ఒక చోట గెలుస్తూ అధికారాన్ని కాపాడుకుంటూ వస్తున్నది. అయితే, 2026 ఏప్రిల్‌లో కేరళతో పాటు మరో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. కేరళలో మొన్నటి వరకు సీపీఎం పార్టీ నాయకుడు పినరయి విజయన్ నాయకత్వంలో ఆ పార్టీ వరుసగా రెండు సార్లు గెలిచి పాలన సాగిస్తున్నది. ఈ రోజు వెలువడిన ఫలితాల్లో కేరళలో ఎల్డీఎఫ్ కూటమి ఘన విజయం సాధించింది. దీంతో కేరళలలో అధికారంలోకి వచ్చిన వామపక్షాలు కేరళలలో ఓటమితోనే తన ప్రస్థానాన్ని ముగించినట్లయింది.

# జోర్హాట్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ..

## తొలి ప్రయత్నంలో ఓడిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్

గువాహతి: అస్సాంకు చెందిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జోర్హాట్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అయితే ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడైన ఆయన మొదటి ప్రయత్నంలోనే ఓడిపోయారు. (+ఖబత్ఖుజ +శీస్త్రశీఱ) 2024 లోక్‌సభ ఎన్నికల్లో జోర్హాట్ ఎంపీగా గౌరవ్ గొగోయ్ ఎన్నికయ్యారు. బీజేపీకి చెందిన టోపోన్ కుమార్ గొగోయ్‌పై 1.4 లక్షల ఓట్ల మెజార్టీతో ఆయన గెలిచారు. కాగా, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి జోర్హాట్ అసెంబ్లీ స్థానం నుంచి గౌరవ్ గొగోయ్ పోటీ చేశారు. తన గెలుపుతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే బీజేపీకి చెందిన హితేంద్ర నాథ్ గోస్వామి చేతిలో 20,000కు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. మరోవైపు బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే హితేంద్ర నాథ్ గోస్వామి వరుసగా ఆరుసార్లు జోర్హాట్ నియోజకవర్గంలో గెలిచారు. ఏజీపీ నేతగా మూడుసార్లు, బీజేపీ ఎమ్మెల్యేగా రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈసారి కూడా జోర్హాట్‌లో గెలుపును బీజేపీకి అందించారు. అలాగే ఆ పార్టీ తరుపున వరుసగా మూడో విజయాన్ని ఆయన సొంతం చేసుకున్నారు. 59,000కు పైగా ఓట్లు సాధించారు.

# కనిపించని తాళాలు.. ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ లాక్ పగులగొట్టిన అధికారులు





బెంగళూరు: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల అధికారులకు విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఈవీఎంలు భద్రపరిచిన గది తాళంచెవి కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తిని పిలిపించి ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ లాక్‌ను సుత్తితో పగులగొట్టించారు. (జుశ్రీవఖ్ఱశీఅ తీవంబశ్రీం) కర్ణాటకలో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్రంలోని దావణగెరె దక్షిణ, బాగల్‌కోట్ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. దావణగెరె దక్షిణలో 68.43 శాతం, బాగల్‌కోట్‌లో 68.74 శాతం ఓటింగ్ నమోదైంది. కాగా, సోమవారం కౌంటింగ్ సందర్భంగా దావణగెరె దక్షిణ ఓటింగ్‌కు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ తాళంచెవి కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఒక వ్యక్తిని రప్పించారు. భారీ భద్రత మధ్య సుత్తి, ఉలితో స్ట్రాంగ్‌రూమ్ లాక్‌ను అతడు పగులగొట్టాడు. ఆ తర్వాత కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలను తరలించి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ ఈ ఉప ఎన్నికల ఫలితాలను ప్రతిష్టాత్మకంగా పరిగణిస్తున్నాయి.

# సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

కాకినాడ,మే4 : ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిదదవోలు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 54 మంది లబ్దిదారులకు రూ.26.41 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. లబ్దిదారుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 835 మంది లబ్దిదారులకు రూ.5.93 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసినట్లు మంత్రి వెల్లడించారు.

# నేర్పరితనం ఉంటేనే రాణింపు!

తిరుమల : జీవితంలో నేర్పరితనం అవసరం. నేర్పు లేకుంటే మనుగడ సాగించడం కష్టం. ఔషధ సేవనంతో రోగవిముక్తి పొందవచ్చు. కాని, శత్రు విముక్తికి ఎలాంటి ఉపాయమూ లేదు.'అపకారికి ఉపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి' అన్నాడు సుమతీ శతకకారుడు. అంతటితో శత్రుత్వ నశిస్తుందనలేదు. నేర్పుగా ఎలా జీవించాలో చెప్పాడంతే. నేర్పు అంటే దుష్పరిణామాల నుంచి ఉపాయంగా తప్పించుకోవడం. పాము పడగవిప్పి కాటు వెయ్యాలని మీదకు దూకుతుంటే పాములు పట్టేవాడు ఎలా తప్పించు కుంటాడు? చివరకు పాము తలను దొరకబుచ్చుకుంటాడు... అదీ నేర్పు అంటే ఇలాంటి నేర్పు పొందాల్సిన అవసరం కల్పించే వాడే శత్రువు. మనకు కలిసివచ్చే కాలంలో సిరిసంపదలు, పేరు ప్రఖ్యాతులు వస్తే అకారణ శత్రువులు ఏర్పడతారు. డబ్బుతో పాటే మనలను వ్యతిరేకించే వారు పెరుగుతారు. అసూయాపరులు మనవైపే చూస్తుంటారు. వీరు ఎంత లౌక్యులంటే వారి చూపుల్లో గాని, ప్రవర్తనలోగానీ ఎక్కడా వారి క్షుద్రభావాలు వెల్లడి కావు. పంచదార పలుకులతో మనల్ని ప్రలోభ పెడతారు. పైకి మిత్రులు, ఆత్మీయులు. లోపల అసూయ లావా కుతకుతలాడుతున్న అగ్నిపర్వతాలు. అవకాశం లభిస్తే మొదటి అపకారం వీళ్లే చేస్తారు. చాటున మన గురించి తీవ్రమైన దుష్ప్రచారం చేస్తారు. మనల్ని ఏకాకుల్ని చేయడానికి మిత్ర, బంధువర్గాల్లో మనకున్న మంచి పేరు చెడగొట్టడానికి శతథా యత్నిస్తారు. సోమరిపోతు, నిద్రాప్రియుడు కూడా ఇంట్లోకి పాము ప్రవేశించిందనగానే అప్రమత్తమై వేయికళ్లతో పాము జాడల కోసం వెతుకు తాడు. కనిపించగానే వెర్రి ఆవేశంతో కర్రదెబ్బలు కొడతాడు. ఇక్కడ పామే శత్రువు. దాన్ని చంపకపోతే అది మనల్ని చంపేస్తుంది. అలాగని దానికి నేర్పరితనం కూడా అవసరమే. ఇది ఒంటబట్టిన వారు జీవితంలో నెగ్గుకు రాగలరు.



ఆధ్యాత్మికం

# ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో అక్రమాలపై ఫిర్యాదు

- అవకతవకలకు తావులేకుండా అక్రిడిటేషన్లు కేటాయించాలి
- జిల్లా కలెక్టర్ దివాకరకు టీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రాలు
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్ దివాకర
- చర్యల నిమిత్తం డీపీఆర్వో, డీసీవోకు ఆదేశాలు



ఖమ్మం ప్రతినిధి ( ది క్రైమ్ న్యూస్ ): జిల్లా ప్రెస్ క్లబ్ లో గత పది సంవత్సరాలుగా జరుగుతున్న ఆర్థిక వ్యవహారాల పై ఆడిటింగ్ చేపట్టడంతో పాటు ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా సాగేందుకు ఎన్నికలు నిర్వహించాలని అలాగే అవకతవకలకు తావులేకుండా అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ - హెచ్ - 2843), ఖమ్మం జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరకు సోమవారం వినతిపత్రాలు సమర్పించింది. గత పది సంవత్సరాలుగా ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఓ రెండు యూనియన్లకు సంబంధించిన జర్నలిస్టులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా ఉండకుండా చేస్తున్నారని తెలిపింది. ప్రెస్ మీట్ నిర్వాహకుల వివరాలు, ఆదాయం, ఖర్చులు వాటికి సంబంధించిన బిల్స్ చూపకుండా అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. ప్రశ్నించిన వారిని టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాల్సిన ప్రెస్ క్లబ్ ను భ్రష్టు పట్టిస్తున్నారని, ప్రెస్ క్లబ్ పేరు చెప్పుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించింది. జర్నలిస్టు వృత్తికే మచ్చ తెస్తున్న ఇటువంటి వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని కోరింది. క్లబ్ నియమ నిబంధనల మేరకు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆడిటింగ్ చేయాల్సిందిగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఖమ్మం ప్రెస్ క్లబ్ పై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నవారు చివరకు కలెక్టర్ కు ప్రెస్ క్లబ్ పై ఉన్న అధికారమేంటని.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వరకు పరిస్థితి వచ్చిందని టీడబ్ల్యూజేఎఫ్ టీడబ్ల్యూజేఎఫ్ బృందం కలెక్టర్ దృష్టికి తెచ్చింది. ఖమ్మం ప్రెస్ క్లబ్ నిర్వహణ సక్రమంగా సాగాలంటే ఆడిటింగ్ ప్రక్రియ చేపట్టడంతో పాటు నియమ నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. అలాగే అక్రిడిటేషన్ ల కేటాయింపులో అవకతవకలకు తావు లేకుండా చూడాలని కోరింది. అనర్హులు ఏ ఒక్కరికీ అక్రిడిటేషన్ కేటాయించొద్దని, అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి చేసింది. నిబంధనల పేరుతో పెద్ద పత్రికలను ఇబ్బందులు పెట్టొద్దని, రకరకాల సర్టిఫికెట్ల పేరుతో అక్రిడిటేషన్ లలో కోత విధించొద్దని కోరింది. డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి సైతం తీసుకువెళ్లినట్లు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి చెప్పారు. స్పందించిన కలెక్టర్ డీపీఆర్వో, డీసీవోలకు చర్యల నిమిత్తమై ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, మధుశ్రీ, జానీపాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దగ్గుబాటి మాధవరావు, ఎన్. రామచంద్రమూర్తి, ఫయాజ్, అర్షద్, పాషా, గణేష్, కొరెకొప్పుల రాంబాబు, గోపి, కిరణ్, డి. రవికుమార్, ఉప్పలయ్య, వి. అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విధులకు గైర్హాజరైన రికార్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె. చిరంజీవిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. కె. చిరంజీవి విధులకు గైర్హాజరు కావడంతో పాటు, ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడం, వివరణ కోరుతూ జారీ చేసిన మెమోలను స్వీకరించకపోవడం గమనార్హమని కలెక్టర్ తెలిపారు.ఈ విషయంపై కమాన్‌పూర్ తహసీల్దార్ నివేదిక అందడంతో, సంబంధిత ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు.అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా, శాఖాపరమైన విచారణ చేపట్టనున్న నేపథ్యంలో, ఎ.పి. సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం శ్రీ కె. చిరంజీవిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుండి అమల్లో ఉంటాయని, విచారణ పూర్తయ్యే వరకు కొనసాగుతాయని తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత ఉద్యోగి ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఖ

# నిర్మాణ కార్మికుల పిల్లల కోసం వర్క్ సైట్ స్కూల్ ప్రారంభం




క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : నార్సింగిలోని రాజపుష్ప లేబర్ క్యాంప్‌లో వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'వర్క్ సైట్ స్కూల్'ను సోమవారం సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, సీఎంసీ కమిషనర్ సృజన సంయుక్తంగా ప్రారంభించారు. తెలంగాణ విద్యాశాఖ, మున్సిపల్ శాఖ, రాజపుష్ప ప్రాపర్టీస్ భాగస్వామ్యంతో ఈ వినూత్న కార్యక్రమం ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుంచి జీవనోపాధి కోసం వచ్చిన కార్మికుల పిల్లలకు సురక్షితమైన, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ఈ పాఠశాల లక్ష్యంగా ఏర్పాటైంది. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో వలస కార్మికుల పాత్ర కీలకమని, వారి పిల్లలకు రక్షణతో కూడిన విద్య అందించడం సమాజ బాధ్యత అని తెలిపారు. చిన్నారులు దేశానికి ఆస్తి అని, వారికి సరైన మార్గదర్శనం అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలు, ఎన్జీవోలు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. సీఎంసీ కమిషనర్ సృజన మాట్లాడుతూ నగర అభివృద్ధి అనేది కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, సమాజ అభివృద్ధిని కూడా కలిగి ఉండాలని తెలిపారు. వలస కార్మికుల పిల్లలకు భద్రత, విద్య కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ వర్క్ సైట్ స్కూల్ శాశ్వత వ్యవస్థగా కొనసాగేందుకు సీఎంసీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాజపుష్ప ఫౌండేషన్ ప్రతినిధి పుష్పలీల మాట్లాడుతూ ప్రస్తుతం ఈ క్యాంప్‌లో జార్ఖండ్, ఒడిశా, యూపీ, అస్సాం రాష్ట్రాలకు చెందిన 58 మంది పిల్లలకు విద్యా సదుపాయాలు కల్పించామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని పాఠశాలలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి సుశీంద్ర రావు మాట్లాడుతూ ప్రతి బిడ్డకు విద్యను చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, లేబర్ క్యాంప్‌లలోని పిల్లలకు కూడా విద్యా హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, కూకట్‌పల్లి ఏడీసీపీ సుదర్శన్, రాజపుష్ప ఎండి మహేందర్ రెడ్డి, నార్సింగి ఎస్‌హెచ్‌ఓ హరికృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు
రైస్ మిల్ యజమానులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

# పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోంది

## పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా నిలుస్తున్నారని పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కొనియాడారు. సోమవారం శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్పేట్, చందానగర్, భారతీనగర్ (పార్ట్) డివిజన్లకు చెందిన 69 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన మొత్తం రూ.69,08,004 ఆర్థిక సహాయాన్ని పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ 69 మంది లబ్ధిదారులకు రూ.69.08 లక్షల విలువైన చెక్కులను అందించడం ఆనందకరమైన విషయమని తెలిపారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తోడ్పడేందుకు దేశంలోనే ప్రత్యేకంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ప్రవేశపెట్టబడిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకం వల్ల పేద కుటుంబాల్లో సంతోషకరంగా పెళ్లిళ్లు జరగడానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా సోదరీమణులు, లబ్ధిదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందించేందుకు కృషి

## పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ట్రాఫిక్ సమస్యలు తగ్గిస్తూ, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందించేందుకు కృషి చేస్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలబెడతామని పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో భద్రాద్రి టవర్స్ నుండి శ్రీ సాయి టవర్స్ వరకు రూ.60 లక్షల 50 వేల అంచనాతో చేపట్టబోయే సీసీ రోడ్డు, వరద నీటి కాల్వ నిర్మాణ పనులకు పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని తెలిపారు. కాలనీ వాసుల సౌకర్యార్థం చేపట్టిన ఈ పనులు పూర్తయితే ప్రజలకు పెద్ద ఎత్తున ఉపశమనం కలుగుతుందని చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టి ఎక్కడా రాజీపడకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్తులో కాలనీల్లో థీమ్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే చర్యలు తీసుకుంటామని చెప్పారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని గాంధీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్ డిమాండ్




ఖమ్మం ప్రతినిధి ( ది క్రైమ్ న్యూస్ ): నారాయణపేట అరుగాలం కష్టపడి పంటను పండించిన రైతును కొనుగోలు కేంద్రం వద్ద వెనక దగా ముందు దగ చేస్తున్న రైస్ మిల్ యజమానులపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్ డిమాండ్ చేశారు. సోమవారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. నిబంధనాల ప్రకారం తరుగు బస్తాకు కేవలం 600 గ్రాములు మాత్రమే తీయాల్సి ఉండగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో రైస్ మిల్ యజమానులు కుమ్మక్కై మూడు నుండి నాలుగు కిలోల చొప్పున వరి ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యాసంగి పంట కొనుగోలు చేసేందుకు 8500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని మొదటగా ప్రకటించిన ప్రభుత్వం నేటికీ కేవలం 6,500 కొనుగోలు కేంద్రాలను మాత్రమే ప్రారంభించిందని అన్నారు. మక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు తగిన స్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం కారణంగా రైతులు దళారి చేతిలో పడి మోసపోతున్నారని అతి తక్కువ ధరకు తమ ధాన్యాన్ని అమ్మడం తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలను సిపిఎం నాయకులు సందర్శిస్తున్నారని రైస్ మిల్ యజమానుల ఆగడాలపై కొనుగోలు కేంద్ర నిర్వాహకుల మోసాలపై నిలదీస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, రైస్ మిల్ యజమానులు తమ వైఖరి మార్చుకోకపోతే సిపిఎం పార్టీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. రైతుకు రక్షణగా నిలుస్తుంది సిపిఎం పార్టీ అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కనీసం మద్దతు ధర ప్రకటించినప్పటికీ ఎక్కడ అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర చట్టం రూపుదాల్చినాడే రైతులకు మేలు కలిగే అవకాశం ఉందని తెలిపారు. రైస్ మిల్ యజమానులు, కొనుగోలు కేంద్రాల కుమ్మకుపై రైతును దగా చేస్తున్న విధానంపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల ఏప్రిల్ 11న అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహిస్తున్నమని తెలిపారు. ఈ ధర్నాలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి వెంకట్రామిరెడ్డి ప్రసంగించారు రైతుల నుండి బస్తాకు 10 రూపాయలు చొప్పున హామాలి బలవంతంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తగినన్ని గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నీరు , నీడ తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండమీది బలరాం, అంజిలయ్య గౌడ్, పుంజనూర్ ఆంజనేయులు, సిపిఎం జిల్లా నేతలు గోవిందరాజు, కే కాశప్ప, గుండెగారి దస్తప్ప, నరహరి తదితరులు పాల్గొన్నారు.

# మంద వెంకటేశ్వర్లును వరించిన స్వర్ణ నంది అవార్డు

## - సామాజిక సేవకు కేరాఫ్.. - వెల్లువెత్తుతున్న అభినందనలు..



ఖమ్మం ప్రతినిధి ( ది క్రైమ్ న్యూస్ ): హైదరాబాద్ రవింద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ నందు మొగిలి ఎంటర్టైన్మెంట్ సహాకారంతో ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఆనందో బ్రహ్మ స్వర్ణ నంది అవార్డు అందుకున్న ఖమ్మం జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు, సామాజిక సేవకుడు, ఇండిపెండెంట్ జర్నలిస్టు మంద వెంకటేశ్వర్లు. కరోనా సమయంలో 83 రోజులు అనాథలకు పేద ప్రజలకు, కార్మికులకు ఉచితంగా నిరంతరం బోజనం అల్పాహారం, మాస్కులు పంపిణీ చేసి నందుకు తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన సందర్భంగా. గత అనేక సంవత్సరాలుగా ఇండిపెండెంట్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్న మంద వెంకటేశ్వర్లు,కు స్వర్ణ నంది అవార్డు లభించింది. అనేక అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా ప్రజా సమస్యలను వెలికి తీస్తూ ప్రభుత్వాల ద్వారా వాటిని పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈవిధంగా సమాజానికి సేవచేస్తూ సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్నందుకు అతని సేవలను గుర్తించి ఆదివారం నాడు హైదరాబాద్ రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన ఆనందో బ్రహ్మ స్వర్ణ నంది పురస్కారం కార్యక్రమంలో మాజీ కార్మిక శాఖ మంత్రి, ప్రముఖ హాస్యనటుడు, డాక్టర్ పల్లి బాబు మోహన్, తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ చేతుల మీదుగా మంద వెంకటేశ్వర్లు స్వర్ణ నంది అవార్డు అందుకున్న సందర్భం ఆనందం వ్యక్తం చేశారు. సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు మంద వెంకటేశ్వర్లు పోరాట గళం టీవీ డిజిటల్ మీడియా చానల్ నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక సంచలనాత్మక కథనాలను అందించారు. ఎక్కడ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నా ఎలాంటి శక్తుల ఒత్తిళ్లకు లొంగకుండా నిర్భయంగా పోరాటం గళం టీవీ లో వార్తలు ప్రచారం చేయడంలో దిట్ట... సామాజిక సేవ, జర్నలిజం వృత్తినే శ్వాసగా... నైతిక విలువలను పాటిస్తూ పేదల పక్షాన నిలువడం, అన్యాయాన్ని ఎదురించడం లక్షణం.. అక్రమార్కుల బెదిరింపులకు వెరువకుండా, ఎంచుకున్న దారిలో దూసుకెళ్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. నంది అవార్డు రావడం పట్ల స్థానిక సీనియర్ జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలుపుతూ మంద వెంకటేశ్వర్లు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

# మహిళా పొదుపు సంఘ నూతన పాలకవర్గం ఎన్నిక



తిమ్మాపూర్,మే4(ది క్రైం న్యూస్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులోని శ్రీ భవాని మహిళా పొదుపు సంఘ మొదటి వార్షిక మహాసభను సోమవారం నిర్వహించారు.ఆర్థిక సంవత్సర లావాదేవీలు చదివి వినిపించగా సభ్యులందరూ ఆమోదం తెలిపిన అనంతరం పాలకవర్గానికి ఎన్నిక నిర్వహించి అధ్యక్షులుగా చౌదరి దేవేంద్ర, ఉపాధ్యక్షులుగా సిరిసిల్ల స్వప్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2025 మార్చి25న 125 మందితో ప్రారంభమైన పొదుపు సంఘం నేడు 314 మంది సభ్యులు,5లక్షల నిధులతో ఆర్థిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నూతన అధ్యక్షులు దేవేంద్ర తెలిపారు.పోరండ్ల సమితి అధ్యక్షులు తోడెంగ రజిత, ఘనకులు చింతల విజయలక్ష్మి,బొజ్జ శ్రీలత,గట్టుదుద్దెనపల్లి -1,2 సంఘాల అధ్యక్షులు మడ్డీ రజిత,పిట్టల లత, శ్రీ ఆంజనేయ పురుషుల పొదుపు సంఘ అధ్యక్షులు చౌదరి పరుశురాములు,భవాని పాలకవర్గ సభ్యులు గుడిపాటి సరోజ, సింగం సాగరిక, పుట్ట పద్మ, బుర్ర రాణి, పంబాల స్వప్న,వేల్పుల మౌనిక, ఆగు నూరి స్వప్న, పల్లె కవిత, పంబాల సరిత, ఓల్లే శ్రీలత , సంఘ గనకలు సిరిసిల్ల రేణుక మహాసభలో పాల్గొన్నారు.

## ఎలిగేడులో భక్తిశ్రద్ధలతో హనుమాన్ దీక్షాపరులకు అన్నదానం

**ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం**



సుల్తానాబాద్, మే 4 (ది క్రైమ్ న్యూస్):ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కోదండ రామాలయం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. మండల పరిధిలోని హనుమాన్ దీక్షాపరులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు దుగ్యాల సంతోష్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమం భక్తుల సమక్షంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రాంతం హనుమాన్ దీక్షలకు ఒక ప్రధాన నిలయంగా (నేలవు) మారిందని కొనియాడారు. ఎంతో కఠినమైన నియమ నిష్ఠలతో మాల ధారణ చేసిన స్వాములకు ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని నిర్వాహకులను అభినందించారు. హనుమాన్ నామస్మరణతో ఎలిగేడు మండల కేంద్రం మార్మోగింది. దీక్షా స్వాముల సంకల్పం సఫలం కావాలని, వారికి ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు వివిధ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు , పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సినిమా షూటింగ్ కు క్లాప్ కొట్టిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



తిమ్మాపూర్, మే4(ది క్రైం న్యూస్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండిలోని శ్రీచైతన్య కళాశాలలో జిల్లాకు చెందిన యువ దర్శకుడు కార్తీక్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న "గెట్ టు గెదర్" చిత్రం షూటింగ్ పూజను నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై షూటింగ్ ను క్లాప్ కొట్టి ప్రారంభించారు.శ్రీచైతన్య చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి,ప్రిన్సిపాల్ ప్రసాద్ రాజు, సర్పంచులు గంకిడి లక్ష్మారెడ్డి, పొన్నాల సంపత్, పార్టీ మండలాధ్యక్షుడు బండారి రమేశ్ గౌడ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి,నాయకులు శ్రీగిరి రంగారావు, చింతల లక్ష్మారెడ్డి, ధ్యావ శ్రీనివాస్ రెడ్డి, నోముల అనిల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేటిఆర్ మాటలను తీవ్రంగా ఖండించిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి

**కరీంనగర్ గడ్డకు వచ్చి కేటిఆర్ అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారు ఇక చూస్తూ ఊరుకోం**

**సంఘటన జరిగిన వెంటనే ముగ్గురం ఎమ్మెల్యేలం,చైర్మన్ అందరం పర్యవేక్షిస్తుంటే మీ కళు మూసుకున్నారా**

కరీంనగర్ టౌన్, మే4(ది క్రైమ్ న్యూస్) : జరిగిన సంఘటన పై భాద్యత గల పదవిలో ఉన్న కేటీఆర్ విలువైన సూచనలు ఇవ్వాలే గాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఇష్టారాజ్యంగా మాట్లడమేంటని మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు.స్థానిక ఆర్అండ్ బి గెస్ట్ లో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ తో కలిసి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జువెల్లరీ షాపులో దొంగతనం జరుగుతేదాన్ని రాజకీయం చేయడమే లక్ష్యంగా పెట్టుకుని బిఆర్ఎస్ నాయకులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని కేటీఆర్ బలుపు మాటలు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.దోషులను తప్పకుండా పట్టుకొని శిక్షిస్తామని గత బిఆర్ఎస్ పాలనలో ఎం జరిగిందో ప్రజలకు తెలుసని అవన్నీ చెప్పడానికి ఇది సమయం కాదని చెప్పుతలేమని మంథని లో వామన్ రావు మరియు అతని భార్యను నడిరోడ్డుపై కత్తులతో నరికి చంపినప్పుడు మేము మీలాగా రాజకీయం చేయలేదని దోషులను శిక్షించాలని అన్నామని అదికూడా మీకు చేతకాలేదని మండిపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో వూట్కూరి వెంకటరమణ రెడ్డి, మోరపల్లి రమణరెడ్డి, పులి కృష్ణా, తిరుపతి రెడ్డి, కొరివి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం జిల్లా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్‌కు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి**



ఖమ్మం ప్రతినిధి ( ది క్రైమ్ న్యూస్ ): ఖమ్మం జిల్లాలో 2026-28 సంవత్సరం మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకం, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపకులు మామిడి సోమయ్య, ఖమ్మం యూనియన్ నాయకులను కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నగేష్ ల నేతృత్వంలో ప్రతినిధి బృందం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో, ఖమ్మం జిల్లాలో కమిటీ నియామకం, దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత లోపించిందని, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, ముఖ్యంగా, ఖమ్మం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకంలో అన్ని జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించకుండా, ఒకే యూనియన్ కు చెందిన పలువురికి ప్రాధాన్యత ఇచ్చినట్లు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, కమిటీ నియామకం ప్రక్రియపై ముందస్తుగా ఎలాంటి అధికారిక నోటీసు లేదా సమాచారం ఇవ్వకుండానే గోప్యంగా నిర్వహించినట్లు జర్నలిస్టు వర్గాల్లో అనుమానాలు నెలకొన్నాయని, వారు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఆన్లైన్ లో దాఖలు చేయబడిన దరఖాస్తుల పరిశీలనలో అనర్హమైన దరఖాస్తులకు కూడా ఆమోదం తెలిపినట్లు సమాచారం అందుతోందని, ప్రభుత్వ జీవో నెం. 252 ప్రకారం నిర్దేశించిన ప్రమాణాలు, పత్రికల ప్రామాణికత, సర్క్యులేషన్ ఆధారాలు, సంస్థ అనుమతులు, నియామక పత్రాలు, అనుభవ ధృవీకరణ పత్రాలు, పే స్లిప్పులు వంటి ముఖ్యమైన పత్రాలను సమగ్రంగా పరిశీలించకుండానే అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోందని, వాటిని బహిర్గతం చేస్తూ చర్యలు చేపట్టాలని కోరారు. వెరిఫికేషన్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించకుండా తూతూ మంత్రంగా పూర్తి చేసినట్లు, మీడియా రంగంపై సరైన అవగాహన, ఫీల్డ్ అనుభవం లేని వారిని కూడా అర్హులుగా పరిగణించినట్లు అభ్యంతరాలు ఉన్నాయని, ఈ పరిణామాల వల్ల నిజంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు అన్యాయం జరిగే అవకాశం ఉందనివారు ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పై అంశాలపై సమగ్ర విచారణ జరిపించి, నిబంధనలకు విరుద్ధంగా ఆమోదించబడిన దరఖాస్తులను పునఃపరిశీలించి, అర్హులైన, నిజమైన మీడియా ప్రతినిధులకు మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా, భవిష్యత్తులో మీడియా అక్రిడిటేషన్ కమిటీలో అన్ని సంఘాలకు తగిన ప్రాధాన్యత చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరారు. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి, మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, సమాన అవకాశాలు పాటించబడేలా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజెఎఫ్ (ఎహ్ -2843), అధ్యక్షులు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేములకొండ రమేష్, ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ మరియు మామిడాల కిరణ్, టీబీజేఎ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, టీబీజేఎ నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, రమ్య, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా యాసంగి ధాన్యం కొనుగోలు చేపట్టాలి

**- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**అకాల వర్షాల నేపథ్యంలో రక్షణ చర్యలు కట్టుదిట్టం**

**మే చివరికల్లా 80% కొనుగోళ్లు పూర్తి చేయాలి**




పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి పాల్గొన్నారు.జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. టార్పాలిన్ కవర్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, రైతులు తమ ధాన్యాన్ని ఎత్తైన ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు.గాలులకు కవర్లు ఎగిరిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు వెంటనే తెలియజేయాలని అధికారులకు సూచించారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు, షామియానాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని, మాయిశ్చర్ యంత్రాలు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని, ఎక్కడా జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హమాలీలు, వాహనాల కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రతి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, మే నెల చివరికల్లా 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రేమ యంత్రాలు , ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచుతున్నామని, ప్రతి కేంద్రానికి అవసరమైన టార్పాలిన్ కవర్లు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఎండ తీవ్రత దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. హమాలీలు, వాహనాల కొరత లేకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని, ఎక్కడా జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమన్వయంతో పని చేసి యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కాళిందిని, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారులు శ్రీనాథ్, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలి: సిపిఎం

నల్గొండ జిల్లా ప్రతినిధి । ది క్రైమ్ న్యూస్ । మే 04 అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో లారీలు, గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలని, తూకాల్లో మిల్లర్ల మోసాలను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిడమనూర్ మండలంలోని వేంపాడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం, రైతు సంఘాల ప్రతినిధి బృందం రైతులతో కలిసి పరిశీలించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరుగాలం కష్టపడి పండించిన రైతు కొనుగోలు కేంద్రాలలో కూడా అన్యాయం ఎదుర్కోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు లేవనే సాకుతో రోజులు గడుస్తున్నాయని, రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని పేర్కొన్నారు. మిల్లర్ల వద్ద క్వింటాకు 2 నుంచి 4 కిలోల వరకు తూకంలో తరుగులు తీస్తున్నారని ఆరోపిస్తూ, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను మాట్లాడుతూ, వ్యాపారులు గ్రామాల్లోనే రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసి, మార్కెట్లో రైతుల పేరుతో అమ్ముతున్నారని ఆరోపించారు. వారికి మాత్రం లారీలు, గన్ని బ్యాగులు సులభంగా లభిస్తున్నాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస వసతులు కూడా లేవని, సొసైటీ అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో ఇప్పటికే నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే సహాయం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలులో జరుగుతున్న జాప్యం, రైతులపై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ఈ నెల 11న నిర్వహించే కలెక్టరేట్ ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సుల్తానాబాద్‌లో బీజేపీ విజయోత్సవ సంబరాలు

**న్యాయవాదుల ఆధ్వర్యంలో మిఠాయిల పంపిణీ**



సుల్తానాబాద్, మే 4(ది క్రైమ్ న్యూస్): నేడు వెలువడిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ మూడు రాష్ట్రాల్లో ఘనవిజయం సాధించిన సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలో సంబరాలు మిన్నంటాయి. స్థానిక న్యాయవాదుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో బీజేపీ సాధించిన చారిత్రాత్మక విజయంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బెంగాల్ ప్రజలు ధర్మం వైపు మొగ్గు చూపారని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ చట్టం , జాతీయ పౌర పట్టిక వంటి చట్టాలకు ప్రజలు పూర్తి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. "భారత్ మాతాకీ జై", "జై శ్రీరామ్" నినాదాలతో సుల్తానాబాద్ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. అనంతరం పట్టణ ప్రజలకు, బాటసారులకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు మేకల తిరుపతిరెడ్డి, మాడూరి ఆంజనేయులు, భూసరపు బాలకిషన్ ప్రసాద్, గుడ్ల వెంకటేష్, జోగుల రమేష్, బొబ్బిలి శ్యామ్ పటేల్, అంబాల నరసయ్య, దొడ్డిపల్లి సారయ్య, పడాల అంజయ్య, ఆసరి రమేష్, గాజుల పవన్, అశోక్ సందీప్, శ్రీనివాస్ , ఇతర న్యాయవాద బృందం పాల్గొన్నారు.

### పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో బిజెపి విజయం పట్ల హుజురాబాద్ బిజెపి శ్రేణుల సంబరాలు

**పశ్చిమబెంగాల్‌లో బిజెపి విజయం చారిత్రకం**

**జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి**

**లిబిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



కరీంనగర్ టౌన్, మే4(ది క్రైమ్ న్యూస్)పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ విజయం పట్ల హుజురాబాద్ బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మరోసారి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వానికి, పనితీరుకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు.ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ , అస్సాం , పుదుచ్చేరిలో చరిత్ర తిరగరాసే విధంగా విజయం సాధించిందన్నారు. అలాగే తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమికి మెరుగైన ఫలితాలే వచ్చాయన్నారు. ప్రధానంగా పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం చారిత్రకమైందన్నారు. పశ్చిమబెంగాల్ లో బిజెపి గెలుపు జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారికి ఘణ నివాళి అన్నారు .... జాతీయవాదులకి ఇది కేవలం విజయం కాదు, ఒక భావోద్వేగ క్షణం లాంటిదన్నారు."వందే మాతరం" పుట్టింది ఇదే నేలలో, "భారత్ మాతా కీ జై" నినాదం వినిపించింది ఇదే గడ్డ,స్వామి వివేకానంద జన్మించిన గడ్డ, జనసంఘ్‌కు బీజం వేసింది కూడా ఇదే బెంగాల్ గడ్డ అని, ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇంత గొప్ప చరిత్ర ఉన్న కొన్ని దశాబ్దాలుగా దుర్మార్గుల చేతుల్లో బంది అయ్యిందన్నారు. అరాచకాలు, ఆకృత్యాలు, నియంత పాలనకు బెంగాల్ ప్రజలు చమర గీతం పాడారన్నారు.బెంగాల్లో సుస్థిర పాలన కోసం బలిదానమైన వీరులను , పార్టీ క్యాడర్ ను మరిచిపోలేమన్నారు. దుర్మార్గపు పాలన కు వ్యతిరేకంగా పోరాడిన ప్రతి వీరుడి కి,ఆత్మార్పణ చేసిన ప్రతి యోధుడి కి బిజెపి కరీంనగర్ జిల్లా పక్షాన జోహార్లు , వందనాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అలాగే మూడు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపికి ఘనవిజయం అందించిన ప్రజలందరికీ బీజేపీ జిల్లా పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో పట్టణ మరియు మండల అధ్యక్షులు తూర్పాటి రాజు పారుపల్లి కొండల్ రెడ్డి కందుగుల సర్పంచ్ ముప్పు మహేష్ జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్ తూముల శ్రీనివాస్ కౌన్సిలర్ లక్ష్మీదుర్గ మాజీ ఫ్లోర్ లీడర్ పైళ్ళవెంకటరెడ్డ పట్టణమాజీ అధ్యక్షులు గంగిశెట్టిరాజు నాయకులు బూత్‌అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కాల్పుల ఘటనలో గాయపడిన బాధితులను పరామర్శించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కరీంనగర్ టౌన్, మే4(ది క్రైమ్ న్యూస్) : కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో గాయపడిన బాధితులను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం పరామర్శించారు. మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇతర పార్టీ నేతలతో కలిసి ఆయన నగరంలోని పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సిబ్బందిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్, గంగుల కమలాకర్ మాట్లాడుతు దొంగతనాన్ని అడ్డుకునే క్రమంలో ప్రాణాలకు తెగించి పోరాడిన షోరూమ్ సిబ్బంది సాహసాన్ని కేటీఆర్ అభినందించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పట్టపగలే నగర నడిబొడ్డున ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే గుర్తించి, కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.



# బరువును తగ్గించడమే కాదు
# మెరిసే చర్మాన్ని అందించే అద్భుత పానీయం!





వేసవి తాపం నుండి ఉపశమనం పొందడానికి, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి ఇది ఒక అద్భుతమైన మార్గం బార్లీ నీళ్లు. అంతే కాదు దీనిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఒక సహజమైన, రుచికరమైన , శక్తివంతమైన పానీయం ఇది. ఇది శతాబ్దాలుగా అనేక సంస్కృతులలో ఆరోగ్యకరమైన మరియు రిఫ్రెష్ పానీయంగా ఉపయోగించబడుతోంది. దీనిని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. శరీర డిటాక్స్‌కు సహాయపడుతుంది బార్లీ నీరులో పొటాషియం, మాంగనీస్, విటమిన్ %దీ% కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి కాలేయాన్ని శుద్ధి చేయడంతోపాటు మలినాలను బయటికి పంపించేందుకు సహాయపడతాయి. శరీరంలోని విషపదార్థాలను బయటికి పంపి, కొత్త ఒర్రని అందిస్తుంది. అంతే కాకుండా ఈ నీరు ఆమ్లత్వాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. పొటాషియం , మగ్నీషియం పేగుల్లో మంచి బ్యాక్టీరియాను పెంచి, అజీర్ణం, మలబద్ధకం సమస్యలను తగ్గిస్తాయి. ఇది అల్సర్, గ్యాస్ ట్రబుల్ ఉన్నవారికి మంచి ఔషధంగా పని చేస్తుంది. బరువు తగ్గేందుకు ఉపకరిస్తుంది బార్లీ నీరులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది పెట్టుని ఎక్కువ సేపు నిండుగా ఉంచుతుంది. ఆకలి నియంత్రణకు సహాయపడుతుంది, ఫలితంగా అధిక భోజనం చేయకుండా ఉంటుంది. కొవ్వు కరుగుదల త్వరగా జరిగేలా సహాయపడుతుంది. అంతే కాకుండా బార్లీ నీరు సహజమైన డయూరేటిక్ (మూత్ర విసర్జనను పెంచే పదార్థం) గా పనిచేస్తుంది. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు తగ్గించడంలో సహాయపడుతుంది. కిడ్నీ స్టోన్స్ రూపాన్ని అడ్డుకోవడానికి బార్లీ నీరు మంచి సహాయకారి. గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది బార్లీ నీరులో బీటా–గ్లూకాన్ అనే ఫైబర్ ఉంది, ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గించి, హృదయ సంబంధిత వ్యాధులను నివారించగలదు. రక్తపోటును నియంత్రించడంతోపాటు, గుండెకు కావలసిన పోషకాలను అందిస్తుంది. గర్భిణీ స్త్రీలకు హార్మోన్లను బ్యాలెన్స్ చేయడంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో ఉబ్బసం సమస్యలను తగ్గిస్తుంది. చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది బార్లీ నీరులో యాంటీఆక్సిడెంట్లు, సెలెనియం ఉన్నాయి. ఇవి చర్మ కాంతిని మెరుగుపరిచి, వృద్ధాప్య లక్షణాలను తగ్గిస్తాయి. నిత్యం బార్లీ నీరు తాగడం వల్ల చర్మం మృదువుగా, తేలికగా ఉంటుంది. మొటిమలు, చర్మంలోని మృతకణాలు తొలగడానికి సహాయపడుతుంది. అటు బార్లీ నీరులో ఉన్న ఫైబర్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, కాలన్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించగలదు. ఇది పేగుల కదలికలను మెరుగుపరిచి, మలబద్ధకాన్ని నివారిస్తుంది. బ్లడ్ షుగర్ నియంత్రణ బార్లీ నీరు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి, డయాబెటిస్ ఉన్నవారికి బాగా ఉపయోగపడుతుంది. బీటా–గ్లూకాన్ అనే ఫైబర్ ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గించి రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించగలదు. బార్లీ నీరులో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచడానికి సహాయపడతాయి.



## సమ్మర్ లో ఈజీగా బరువు తగ్గడానికి జస్ట్ ఇలా చేస్తే సరిపోతుందట..సన్నగా నాజూగ్గా అయిపోతారు!

ప్రస్తుతం మారిన జీవనశైలి, ఆహార అలవాట్ల కారణంగా చాలామంది బరువు పెరిగే సమస్యలతో బాధపడుతున్నారు. బరువు పెరగడం కారణంగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే బరువు తగ్గడానికి డైటింగం, వ్యాయమం వంటి దినచర్యలను అనుసరిస్తున్నారు కొంతమంది. అయితే బరువు పెరగడం ఈజీనే కానీ తగ్గడం అంత తేలిక కాదు. ఒక్కసారి బరువు పెరిగారు అంటే దాన్ని తగ్గించాలంటే చాలానే శ్రమించాలి. అనేక కఠిన నియమాలను ఫాలో అవుతూ ఉండాలి. అధిక బరువు కారణంగా కొంతమంది సమాజంలో అవమానాలకు కూడా గురవుతున్నారు. కొందరికి అయితే బరువు కారణంగా పెళ్లిళ్లు అవడం కూడా కష్టంగా ఉంది. ప్రస్తుతం సమ్మర్ సీజన్ వచ్చేసింది. వేసవి కాలంలో బరువు తగ్గడం కొంచెం సులభం అవుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం వేసవి కాలంలో మీ అధిక బరువును తగ్గించుకోవడానికి సరైన పద్ధతిని అనుసరించడం ముఖ్యం. ఈ సమయంలో శరీరాన్ని వీలైనంత హైడ్రేటెడ్ గా ఉంచాలని నిపుణులు తెలిపారు. మీరు తక్కువ నీరు తాగుతుంటే నెమ్మదిగా తగినంత నీరు త్రాగడం ప్రారంభించాలని సూచించారు. వేసవి కాలంలో ఎక్కువ నూనె పదార్థాలు తినకుండా ఉండాలని సూచించారు. బరువు తగ్గడానికి ప్రయత్నించేటప్పుడు విటమిన్లు, ఖనిజాలు కలిగిన ఆహారాన్ని తినాలని తెలిపారు. సులభంగా జీర్ణమయ్యే ఆహారాలు బరువు తగ్గడానికి చాలా సహాయపడతాయి. వేసవి కాలంలో దోసకాయలు, టమోటాలు, పుచ్చకాయ వంటి హైడ్రేటింగ్ ఆహారాలను చేర్చాలని చెప్పారు. గ్రీన్ టీలోని యాంటీఆక్సిడెంట్లు బరువు తగ్గడానికి సహాయపడతాయి. జీవక్రియను వేగవంతం చేయడమే కాకుండా శరీరం నుండి అదనపు కొవ్వును కాల్చడంలో కూడా ఇది సహాయపడుతుంది. ముఖ్యంగా ఉదయం పూట రెండు నుండి మూడు కప్పుల గ్రీన్ టీ తాగడం అలవాటు చేసుకోవడం మంచిదని నిపుణులు తెలిపారు. గ్రీన్ టీతో పాటు, మీరు హెర్బల్ టీ కూడా తాగవచ్చుని సూచించారు. వేసవి కాలంలో మీ ఆహారంలో ఫైబర్, ప్రోబయోటిక్స్ చేర్చుకోండి. మీరు ప్రతిరోజూ పెరుగు, పండ్లు, సలాడ్లు, తృణధాన్యాలు తినాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫైబర్ ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతుంది దీంతో అతిగా తినకుండా మిమ్మల్ని నిరోధిస్తుంది. ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి, శరీర జీవక్రియను పెంచుతాయి, ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాక్నేండా ప్రతిరోజూ క్రమంతప్పకుండా ఎక్సర్ సైజ్ లేదా వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మీరు ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో వ్యాయామం చేయవచ్చు. మీరు వ్యాయామం చేయలేకపోతే కనీసం అరగంట పాటు వాకింగ్ అయినా చేయాలని తెలిపారు. నడకతో కేలరీలను బర్న్ అవుతాయని, కండరాలను బలపరుస్తుందని నిపుణులు తెలిపారు.

## ఫేస్ మాస్క్‌గా పసుపును వాడుతున్నారా.. అయితే ఒక్కసారి ఇవి తెలుసుకోండి!

పసుపు... ఇది కేవలం వంటగదిలో సుగంధ ద్రవ్యం మాత్రమే కాదు, ఇది సహజ వైద్యంలో ఒక అద్భుతమైన నిధి. తరతరాలుగా భారతీయ సంస్కృతిలో, పసుపును దాని వైద్య , సౌందర్య ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ముఖానికి పసుపు రాయడం అనేది ఒక సాంప్రదాయ పద్ధతి, దీని వెనుక అనేక ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. పసుపులో కర్కుమిన్ అనే ఒక శక్తివంతమైన సమ్మేళనం ఉంటుంది. ఇది పసుపు రంగుకు కారణం , ఆరోగ్య ప్రయోజనాలకు మూలం. కర్కుమిన్ ఒక అద్భుతమైన యాంటీఆక్సిడెంట్ , యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంది. ఈ లక్షణాలే చర్మానికి , శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. మొటిమలు, మచ్చలకు స్వస్తి: పసుపులోని యాంటీ బాక్టీరియల్ , యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు మొటిమలు, వాటి తాలూకు మచ్చలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఇది చర్మ రంధ్రాలను శుభ్రం చేసి, బ్యాక్టీరియా వృద్ధిని నిరోధిస్తుంది, తద్వారా మొటిమలు రాకుండా చేస్తుంది. ఇప్పటికే ఉన్న మొటిమల వాపును తగ్గించి, వాటిని త్వరగా మానిపోయేలా చేస్తుంది. చర్మం కాంతివంతంగా, యవ్వనంగా: పసుపు ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది ఫ్రీ రాడికల్స్ వల్ల చర్మానికి జరిగే నష్టాన్ని నివారిస్తుంది. ఫ్రీ రాడికల్స్ చర్మ కణాలను దెబ్బతీసి, వృద్ధాప్య ఛాయలను త్వరగా వచ్చేలా చేస్తాయి. పసుపు ఈ ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, చర్మాన్ని యవ్వనంగా, కాంతివంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. చర్మంపై ముడతలు, గీతలు, వయసు మచ్చలు వంటి వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో పసుపు సమర్థవంతంగా పనిచేస్తుంది. చర్మం రంగును మెరుగుపరుస్తుంది: పసుపు చర్మం రంగును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది మెలనిన్ ఉత్పత్తిని నియంత్రించడంలో సహాయపడుతుంది, ఇది చర్మానికి రంగును ఇచ్చే వర్ణద్రవ్యం. అధిక మెలనిన్ ఉత్పత్తి వల్ల చర్మంపై నల్ల మచ్చలు, పిగ్మెంటేషన్ ఏర్పడతాయి. పసుపు మెలనిన్ ఉత్పత్తిని సమతుల్యం చేసి, చర్మాన్ని సమాన రంగులో, ప్రకాశవంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. గాయాలు, మచ్చలు త్వరగా నయం: పసుపులోని యాంటీ సెప్టిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు గాయాలు, చిన్న కోతలు, కాలిన గాయాలు త్వరగా నయం కావడానికి సహాయపడతాయి. ఇది చర్మ కణాల పునరుత్పత్తిని ప్రోత్సహిస్తుంది, తద్వారా గాయాలు త్వరగా మానిపోతాయి, మచ్చలు ఏర్పడకుండా చేస్తుంది. చర్మ వ్యాధులకు ఉపశమనం: పసుపు చర్మ సంబంధిత సమస్యలైన తామర (ఎగ్జిమా), సోరియాసిస్ వంటి వాటి లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. పసుపులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఈ వ్యాధుల వల్ల కలిగే దురద, ఎరుపు, వాపు వంటి లక్షణాల నుండి ఉపశమనం కలిగిస్తాయి. సూర్యరశ్మి నుంచి రక్షణ: సూర్యరశ్మిలోని హానికరమైన %ఖం% కిరణాలు చర్మానికి తీవ్ర నష్టం కలిగిస్తాయి. పసుపులో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఈ %ఖం% కిరణాల వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఇది సన్‌బర్న్, చర్మం నల్లబడటం మరియు చర్మ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మం తేమగా ఉండటానికి: పసుపు చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది చర్మ కణాల మధ్య తేమను నిలుపుకోవడానికి సహాయపడు తుంది, పసుపును వివిధ రకాల ఫేస్ మాస్క్‌లలో ఉపయోగించవచ్చు. శనగపిండి, పెరుగు, తేనె, పాలు వంటి వాటితో కలిపి ఫేస్ మాస్క్‌గా వేసుకోవచ్చు. మొటిమలు, గాయాలు వంటి వాటిపై పసుపు పేస్ట్‌ను నేరుగా రాయవచ్చు. పసుపు పొడిని నీటితో లేదా రోజ్ వాటర్‌తో కలిపి పేస్ట్‌లా తయారు చేసి ప్రభావిత ప్రాంతంపై రాయాలి. పసుపు నూనెను చర్మంపై మసాజ్ చేయడానికి ఉపయోగించవచ్చు.

## ప్రపంచంలో అత్యంత ఖరీదైన పండు ఏదో తెలుసా..?

పండ్లు మన ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. అవి విటమిన్లు, ఖనిజాలు, మరియు ఫైబర్ వంటి అవసరమైన పోషకాలను అందిస్తాయి, ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. మార్కెట్‌లో చాలా రకాల పండ్లు అందుబాటులో ఉన్నాయనే విషయం తెలిసిందే. అయితే ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పండుగా యుబారి కింగ్ మెలోన్ నిలిచింది. ఈ పండు జపాన్‌లో మాత్రమే దొరుకుతోంది. యుబారి కింగ్ పుచ్చకాయ జపాన్ లోని హొక్కైడో ద్వీపంలోని యుబారిలో పండించే ఒక రకమైన పుచ్చకాయ. ఇది దాని తీపి రుచి, పరిపూర్ణ ఆకారం మరియు అధిక ధరకు ప్రసిద్ధి చెందింది.

### యుబారి కింగ్ మెలోన్ ప్రత్యేకతలు

యుబారి కింగ్ పుచ్చకాయలు గుండ్రంగా మరియు నునుపైన చర్మంతో ఉంటాయి.లోపల గుజ్జు నారింజ రంగులో మరియు చాలా తీపిగా ఉంటుంది.దీని వాసన కూడా చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది.ఈ పండును చుగెన్ (జపాన్ లో బహుమతులు ఇచ్చే సంప్రదాయం) సందర్భంగా బహుమతిగా ఇస్తారు.ఈ పుచ్చకాయ యొక్క ప్రత్యేకత ఏమిటంటే దీనిని చాలా జాగ్రత్తగా పెంచుతారు. ప్రతిరోజు ఈ పండును శుభ్రం చేస్తారు.ఈ పుచ్చకాయలు 1.5 నుండి 2 కిలోల బరువు వరకు ఉంటాయి. యుబారి కింగ్ పుచ్చకాయను కంటాలౌప్ మరియు బర్పీస్ స్పైసీ కంటాలౌప్ అనే రెండు రకాల పుచ్చకాయల మిశ్రమం ద్వారా తయారు చేస్తారు.ఈ యుబారి పుచ్చకాయలు జూన్ నుండి ఆగష్టు మొదటి వారం వరకు మాత్రమే దొరుకుతాయి.2018 సంవత్సరంలో రెండు యుబారి కింగ్ పుచ్చకాయలు 3.2 మిలియన్ జపనీస్ యెన్లకు అమ్ముడయ్యాయి.2019లో ఒక జత యుబారి కింగ్ మెలోన్ 46,500 డాలర్లకు (సుమారు 35 లక్షల రూపాయలు) అమ్ముడయ్యింది. ఇవే కాకుండా ప్రపంచంలో ఖరీదైన పండ్ల జాబితాలో మియాజాకి మామిడి, రూబీ రోమన్ ద్రాక్ష, డెన్సుకే పుచ్చకాయ వంటివి ఉన్నాయి.



# మార్కెట్

## కష్టాల్లో ఐటీ పరిశ్రమ.. వృద్ధి అవకాశాలు అంతంత మాత్రమే


### ప్రతికూలంగా అంతర్జాతీయ మార్కెట్

బెంగళూరు : భారతీయ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కంపెనీలకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26) కష్టాలేనన్న అభిప్రాయాలు పరిశ్రమ విశ్లేషకుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. నిజానికి ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా పేలవమైన ప్రదర్శనను ఇచ్చిన రంగాల్లో ఐటీ రంగం కూడా ఒకటిగా ఉన్నది. ఈ క్రమం లో ఇండస్ట్రీ అనలిస్టుల అంచనాలు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుండగా, ప్రపంచంలోనే అతిపెద్ద ఐటీ సేవల సంస్థ యాక్సెంచర్ త్రైమాసిక నివేదిక కూడా ఆ అంచనాలకు బలం చేకూరుస్తున్నది. తాజాగా విడుదలైన ఈ రిపోర్టులో ఐటీ కంపెనీల కస్టమర్లు వ్యయ నియంత్రణ దిశగా వెళ్తున్నారని, దీంతో మున్ముందు ఐటీ ప్రాజెక్టులకు డిమాండ్ అంతంతేనని యాక్సెంచర్ పేర్కొన్నది మరి.

అమెరికాలో ఆగమాగం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నగా భావించే అగ్రరాజ్యం అమెరికాలో ఇప్పుడు గందరగోళ పరిస్థితులే నెలకొన్నాయి. ఎన్నో అంచనాల నడుమ అధ్యక్ష పీఠం ఎక్కిన డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలే ఇందుకు కారణమన్న అభిప్రాయాలు అంతటా వినిపిస్తుండటం గమనార్హం. ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలకు పట్టుబడుతున్న ట్రంప్.. అందుకు డెడ్‌లైన్ కూడా పెట్టుకున్నారు. వచ్చే నెల నుంచి భారత్, చైనాసహా ఐరోపా, ఇతర దేశాలపై అధిక సుంకాలుంటాయని ఇప్పటికే తెగేసి చెప్పిన విషయం తెలిసిందే. కానీ ఇది అమెరికా జీడీపీలో మందగమనానికి దారితీస్తున్నది. ట్రంప్ చర్యలతో అమెరికాలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తుల ధరలు పెరుగుతాయన్న గుబులు అక్కడివారిలో పట్టుకున్నది. ఈ పరిణామం మార్కెట్‌లో కొనుగోలు శక్తిని బలహీనపరుస్తుండగా.. కంపెనీల పెట్టుబడులు, ఖర్చులనూ పునరాలోచనలో పడేస్తున్నది. భారతీయ ఐటీ కంపెనీల ఆదాయంలో మెజారిటీ వాటా అమెరికా మార్కెట్ నుంచే వస్తుందన్న సంగతి విదితమే. దీంతో అక్కడి క్లయింట్లు తమ బడ్జెట్‌ను తగ్గిస్తుండటం.. ఇండియన్ ఐటీ సంస్థల కొత్త ప్రాజెక్టులను దెబ్బతీస్తున్నది. యాక్సెంచర్ తాజా నివేదికలోనూ ఇవే సంకేతాలున్నాయి.

## దలాల్‌స్ట్రీట్‌లో రంకేసిన బుల్..! సెన్సెక్స్ 1000 పాయింట్లు జంప్..!




దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల జోరు కొనసాగుతున్నది. వరుసగా ఆరో రోజు మార్కెట్లు లాభాల ర్యాలీ కొనసాగింది. ఫైనాన్సియల్, బ్యాంకింగ్ రంగాల్లో స్టాక్స్ పెరుగుల కారణంగా సూచీలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సానుకూల పవనాలకు తోడు.. విదేశీ పెట్టుబడులు కొనసాగుతుండడంతో పాటు బ్లూ–చిప్ స్టాక్స్ కొనుగోళ్ల కారణంగా మార్కెట్లు లాభాలను నమోదు చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. సోమవారం ఉదయం 77,456.27 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత సెన్సెక్స్ చివరి వరకు అదే జోష్‌లో కొనసాగాయి. ఈ క్రమంలోనే ఇంట్రాడేలో 77,179.35 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 78,107.23 పాయింట్లకు పెరిగింది. చివరకు 1,078.87 పాయింట్లు పెరిగి.. 77,984.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 307.95 పాయింట్లు పెరిగి 23,658.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,371 షేర్లు లాభపడ్డాయి. 1,602 షేర్లు నష్టపోగా.. మరో 153 షేర్లు మారలేదు. బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, ఐటీ, ఆయిల్, గ్యాస్, పవర్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ తదితర రంగాలకు చెందిన సూచీలు ఒకటి నుంచి మూడుశాతం వరకు పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతానికిపైగా వృద్ధిని నమోదు చేశాయి. నిఫ్టీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, పవర్ గ్రిడ్ కార్ప్, టెక్ మహీంద్ర భారీగా లాభపడ్డాయి. అయితే ఎంఅండ్‌ఎం, టైటాన్ కంపెనీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, భారతి ఎయిర్‌టెల్ నష్టపోయాయి.


## విమానయాన సంస్థలకు డీజీసీఏ కీలక ఆదేశాలు..

### టికెట్ బుకింగ్ సమయంలోనే ప్రయాణికులకు ఆ సమాచారం..!

విమానయాన సంస్థలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్స్ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. విమానయాన సంస్థలకు కస్టమర్స్ హక్కులు, నియమ నిబంధనలకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. టికెట్ బుక్ చేసుకున్న తర్వాత.. అందుబాటులో ఉన్న ప్రయాణికుల చార్టర్ ఆన్‌లైన్ లింక్‌ను ప్రయాణికుడికి ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా పంపాలని డీజీసీఏ అన్ని విమానయాన సంస్థలకు సూచించింది. ఇకపై ప్రయాణికులు విమాన టికెట్స్‌ను బుక్ చేసుకున్న సమయంలోనే వారి హక్కులు, సౌకర్యాలకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకునే వీలు కలుగనున్నది. డీజీసీఏ ఆదేశాల ప్రకారం.. అన్ని విమానయాన సంస్థలు టికెట్లను బుక్ చేసుకున్న తర్వాత ప్రయాణికులకు ఆన్‌లైన్ లింక్ ద్వారా తమ హక్కుల గురించి తెలియజేయాల్సి ఉంటుంది. ఈ లింక్‌లో ప్రయాణికుల హక్కులు, నియమాలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన పూర్తి సమాచారం ఉండనున్నది. తద్వారా ప్రయాణికులు ఏదైనా సమస్యను సులభంగా పరిష్కరించుకునే అవకాశంతో పాటు విమాన ప్రయాణ సమయంలో పొందే హక్కుల గురించి స్పష్టమైన సమాచారం లభించనుంది. ఎందుకంటే సాధారణంగా ప్రయాణీకులు విమానాల రద్దు, బోర్డింగ్ తిరస్కరణ, బ్యాగేజ్ మిస్సింగ్, బ్యాగేజ్ మిస్సింగ్ లాస్ సమయాల్లో సమస్యలు ఎదుర్కొంటారు. చాలా మంది ప్రయాణికులకు ఆయా పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఎదురవుతుంది. ఈ క్రమంలో తాజాగా డీజీసీఏ ఆదేశాలతో స్పష్టమైన సమాచారంతో పాటు ఫిర్యాదులను సైతం పరిష్కరించుకునే అవకాశం కలుగనున్నది. డీజీసీఏ ఆదేశాలతో విమానయాన సంస్థలు సమాచారాన్ని ఎయిర్‌లైన్ వెబ్‌సైట్‌తో పాటు టికెట్‌లో ప్రముఖంగా అందుబాటులో ఉంచాలి. విమానం ఆలస్యం, విమానం రద్దు విషయంలో పరిహారం, బ్యాగేజీకి సంబంధించిన రూల్స్, ఇతర ముఖ్యమైన సమాచారం గురించి సమాచారం సులభంగా దొరనున్నది. డీజీసీఏ ఆదేశాల నేపథ్యంలో విమానయాన కంపెనీలు మార్పులు చేస్తున్నాయి. విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ఇప్పటికే ఈ ప్రక్రియను అమలులోకి తీసుకువచ్చింది. టికెట్ బుకింగ్‌తో పాటు ప్రయాణీకుల హక్కుల గురించి సమాచారాన్ని పంపుతున్నది. ఇండిగో సైతం త్వరలోనే ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నది.



క్రైమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
సోమవారం మే 04 2026
ninadam.in




# ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ కిడ్నాప్..

## గన్‌తో బెదిరించి రూ. 1.8 కోట్లు బదిలీ!

- ఢిల్లీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్‌ను కిడ్నాప్ చేసిన ఫ్రాంచైజీ భాగస్వామి
- అరుపులు బయటకు వినిపించకుండా ఫ్లాట్‌లో సుందరకాండ పారాయణం
- బాధితురాలికి గంటలపాటు నరకం చూపిన నిందితులు
- డబ్బు బదిలీ అయిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిన పోలీసులు
- ఆసుపత్రి బెడ్‌పై నిందితుడి అరెస్ట్





వ్యాపార భాగస్వామే కాలయముడయ్యాడు. నమ్మించి పిలిపించి, కిడ్నాప్ చేసి, కణతకు తుపాకీ గురిపెట్టి గంటలపాటు నరకం చూపించాడు. బలవంతంగా రూ.1.89 కోట్లు ఆన్‌లైన్‌లో బదిలీ చేయించుకున్నాడు. భోపాల్‌లో జరిగిన ఈ సంచలన ఘటన, ఏ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌కూ తీసిపోని రీతిలో సాగింది. ఢిల్లీకి చెందిన ప్రముఖ ఐఏఎస్ కోచింగ్ అకాడమీ డైరెక్టర్‌కు ఎదురైన ఈ భయానక అనుభవం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఢిల్లీ కేంద్రంగా పనిచేసే 'శుభ్రా రంజన్ ఐఏఎస్ అకాడమీ' డైరెక్టర్ శుభ్రా రంజన్‌ను, అదే అకాడమీకి భోపాల్‌లో ఫ్రాంచైజీ నడుపుతున్న ప్రియాంక్ శర్మ మోసపూరితంగా భోపాల్‌కు ఆహ్వానించాడు. నగరంలో మరో సెంటర్ ప్రారంభించాలని, సెమినార్ నిర్వహించాలని నమ్మబలికాడు. ఇది నిజమేనని నమ్మి ఆమె భోపాల్ వచ్చారు. బుధవారం మధ్యాహ్నం 2-3 గంటల సమయంలో, ఆమె బస చేస్తున్న 5-స్టార్ హోటల్ నుంచి ప్రియాంక్ ఆమెను తన కారులో ఎక్కించుకుని బాగ్‌సేవానియా ప్రాంతంలోని ఓ అద్దె ఫ్లాట్‌కు తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ప్రియాంక్ ఏర్పాటు చేసిన సాయుధులైన వ్యక్తులు కాపు కాశారు. ఫ్లాట్‌లోకి వెళ్లగానే శుభ్రా రంజన్, ఆమె సహాయకులను బంధించారు. దాదాపు నాలుగు గంటల పాటు తుపాకీతో బెదిరిస్తూ, 'జనక్షిలా సొసైటీ', 'ఆర్ఎస్ ఎంటర్‌ప్రైజెస్' పేర్లతో ఉన్న బ్యాంకు ఖాతాలకు రూ.1.89 కోట్లు ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలని ఒత్తిడి చేశారు. వారి అరుపులు, కేకలు బయటకు వినిపించకుండా ఉండేందుకు నిందితులు అదే ఫ్లాట్‌లో సుందరకాండ పారాయణం ఏర్పాటు చేయడం గమనార్హం. ఇది భక్తితో చేసింది కాదని, బాధితురాలి గొంతును అణచివేసేందుకే ఈ నాటకం ఆడారని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, పోలీసులకు ఫిర్యాదు చేయకుండా భయపెట్టేందుకు ఓ నకిలీ వీడియోను కూడా రికార్డ్ చేశారు. అందులో ఓ వ్యక్తిని తాళ్లతో కట్టి బాక్సులో బంధించినట్లు చూపించి, ఫిర్యాదు చేస్తే తమ సహచరులకు ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.

### రంగంలోకి క్రైమ్ బ్రాంచ్.. ఖాతాల స్తంభన

డబ్బు బదిలీ పూర్తయ్యాక బుధవారం రాత్రి బాధితులను విడిచిపెట్టారు. వెంటనే బాధితుల తరఫున సంతోష్ కుమార్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భోపాల్ క్రైమ్ బ్రాంచ్ రంగంలోకి దిగింది. పోలీస్ కమిషనర్ సంజయ్ కుమార్ సింగ్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. గంటల వ్యవధిలోనే స్పందించిన పోలీసులు, నిందితులు డబ్బు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. దీంతో రూ.1.89 కోట్ల మొత్తం భద్రంగా ఉంది. మరోవైపు, అరెస్ట్ తప్పదని భావించిన ప్రధాన నిందితుడు ప్రియాంక్ శర్మ విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించాడు. అది విఫలమవడంతో, తీవ్ర అనారోగ్యం నటిస్తూ భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రిలోని ఐసీయూలో చేరాడు. అయితే, పక్కా సమాచారంతో అక్కడికి చేరుకున్న క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, వైద్యులను సంప్రదించి అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని నిర్ధారించుకుని, ఆస్పత్రి బెడ్‌పైనే అతడిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ సమయంలో ప్రియాంక్ తల్లి, భార్య పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ప్రియాంక్ విచారణ అనంతరం మరో ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురిని కోర్టులో హాజరుపరిచారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఈ నేరంలో ఉపయోగించిన కారు, మొబైల్ ఫోన్, తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రియాంక్ భార్య పాత్రపై కూడా దర్యాప్తు జరుగుతోందని పోలీసులు వెల్లడించారు. దోపిడీకి గురైన డబ్బును తిరిగి బాధితురాలికి అప్పగించే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు.

# కరీంనగర్ జ్యుయెలరీ షాపు చోరీ...

## దొంగల ఆచూకీ చెబితే రూ.1 లక్ష

- కరీంనగర్ పీఎంజే జ్యువెలర్స్‌లో సాయుధ దోపిడీ
- సిబ్బందిపై కాల్పులు జరిపి నగలు ఎత్తుకెళ్లిన దుండగులు
- ఐదుగురు నిందితుల ఫోటోలను విడుదల చేసిన పోలీసులు
- దోపిడీ దొంగల ఆచూకీ తెలిపితే రూ.లక్ష బహుమతి
- సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ




కరీంనగర్ వే

కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలర్స్ దోపిడీ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితుల ఫోటోలను పోలీసులు విడుదల చేయడంతో పాటు, వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష నగదు బహుమతిని ప్రకటించారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పోలీసులు స్పష్టం చేశారు. నిన్న ఉదయం కరీంనగర్‌లోని జ్యోతినగర్ లో ఉన్న పీఎంజే జ్యువెలర్స్‌లోకి వినియోగదారుల రూపంలో ప్రవేశించిన ఐదుగురు సాయుధ దుండగులు, ఒక్కసారిగా సిబ్బందిపై తుపాకులతో కాల్పులకు తెగబడటంతో నలుగురు సిబ్బందికి గాయాలైన విషయం తెలిసిందే. అనంతరం దుండగులు భారీ మొత్తంలో బంగారు ఆభరణాల ను దోచుకుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దోపిడీని తీవ్రంగా పరిగణించిన పోలీసులు, నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు కట్టుదిట్టం చేశారు. "ఈ ఫోటోలలో ఉన్న వ్యక్తులు కరీంనగర్ నగల దుకాణంలో జరిగిన దోపిడీలో పాల్గొన్నారని, వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సరైన సమాచారం అందించిన వారికి రూ.1 లక్ష బహుమతి ఇవ్వబడుతుంది" అని పోలీసులు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో కరపత్రాలను విడుదల చేశారు. నిందితులకు సంబంధించి ఏవైనా ఆధారాలు లభిస్తే కరీంనగర్ టూ టౌన్ ఎస్‌హెచ్‌ఓ (8712670762), ఏసీపీ (8712670711), లేదా ఎస్‌బీ కంట్రోల్ రూం (8712670713) నంబర్లకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# నోబెల్ బరిలో భారత 'ప్యాడ్‌మ్యాన్'

- అతి తక్కువ ధరకే శానిటరీ ప్యాడ్లు అందిస్తున్న అరుణాచలం
- మహిళల ఆరోగ్య పరిరక్షణలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన పారిశ్రామికవేత్త
- నోబెల్ బహుమతికి ఆయన పేరును నామినేట్ చేసిన పుదుచ్చేరి కంటి ఆసుపత్రి డీన్
- 24 గంటల్లోనే నామినేషన్‌కు ఆమోదం
- అరుణాచలం జీవితం ఆధారంగా 2018లో 'ప్యాడ్‌మ్యాన్' సినిమా




భారతదేశ 'ప్యాడ్‌మ్యాన్'గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కోయంబత్తూరుకు చెందిన పారిశ్రామికవేత్త అరుణాచలం మురుగనందం నోబెల్ బహుమతికి నామినేట్ అయ్యారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా వెల్లడించారు. 2026 సంవత్సరానికి గానూ ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతికి తన పేరు నామినేట్ అయినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు తక్కువ ధరకే శానిటరీ ప్యాడ్లను అందుబాటులోకి తెచ్చి, వారి ఆరోగ్య పరిరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినందుకు గాను ఆయన ఈ గుర్తింపునకు చేరువయ్యారు. "మొదట నేను నమ్మలేకపోయాను. పుదుచ్చేరిలోని అరవింద్ కంటి ఆసుపత్రి డీన్, అక్కడి అమెరికన్ బృందాలు నా పేరును ప్రతిపాదించాయి. 24 గంటల్లోనే నా నామినేషన్ ఆమోదం పొందింది. ఇది నాకు చాలా గర్వంగా ఉంది" అని ఒక వార్తా సంస్థతో మురుగనందం తన సంతోషాన్ని పంచుకున్నారు. తమిళనాడుకు చెందిన అరుణాచలం జీవితం ఆధారంగానే 2018లో 'ప్యాడ్‌మ్యాన్' చిత్రం తెరకెక్కింది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ప్రధాన పాత్ర పోషించారు. ఈ సినిమా సామాజిక అంశాలపై ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డును కూడా గెలుచుకుంది. సాధారణంగా నోబెల్ బహుమతి నామినేషన్ల ప్రక్రియ ఎనిమిది నెలల పాటు చాలా క్లిష్టంగా సాగుతుంది. నార్వేకు చెందిన ఐదుగురు సభ్యుల నోబెల్ కమిటీ పలు దశల్లో నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి తుది జాబితాను సిద్ధం చేస్తుంది.

# తమిళనాడు ఫలితాల టెన్షన్..

## తిరుమలలో త్రిష పూజలు!



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ ఉత్కంఠభరితంగా సాగుతున్న వేళ, ప్రముఖ సినీ నటి త్రిష తిరుమల పర్యటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఈరోజు ఉదయం ఆమె శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తమిళనాడులో హోరాహోరీగా సాగిన ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో తేలనుండగా, ఈ దర్శనం ప్రాధాన్యం సంతరించుకుంది. నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ ఈ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేస్తుండటంతో, ఆయన విజయం కోసమే త్రిష శ్రీవారిని ప్రార్థించినట్లుగా ప్రచారం జరుగుతోంది. సోమవారం త్రిష పుట్టినరోజు కూడా కావడం మరో విశేషం. ఆదివారం రాత్రే తాను తిరుపతికి ప్రయాణిస్తున్నట్లు త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. ఎన్నికల ఫలితాలకు ముందు త్రిష తిరుమల పర్యటన తమిళనాట చర్చనీయాంశంగా మారింది.

# కరీంనగర్‌లో కన్నీటి దృశ్యం..

## పండ్లు అమ్మే బండే.. కొడుకు పాడెగా మారింది!

- అనారోగ్యంతో మృతిచెందిన కుమారుడు
- శవాన్ని తోపుడు బండిపై ఇంటికి తరలించిన నిరుపేద తల్లిదండ్రులు
- పండ్లు అమ్మి జీవించే కుటుంబంలో తీవ్ర విషాదం
- అంబులెన్స్ వచ్చేలోపే ప్రాణం విడిచిన యువకుడు



కరీంనగర్ జిల్లాలో అత్యంత విషాదకరమైన సంఘటన వెలుగుచూసింది. కన్నకొడుకు అనారోగ్యంతో మృతిచెందగా, ఆ నిరుపేద తల్లిదండ్రులు అతడి మృతదేహాన్ని తమ తోపుడుబండిపైనే తరలించుకోవాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక దృశ్యం స్థానికులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళితే... శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన ఎల్కపెల్లి వీరయ్య, రుక్కమ్మ దంపతులు తోపుడుబండిపై పండ్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు యాకూబ్ (38) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.

ఆదివారం సాయంత్రం యాకూబ్ ఆరోగ్యం విషమించడంతో తల్లిదండ్రులు అతడిని తమ రేకుల షెడ్డు వద్దకు తీసుకొచ్చి 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేశారు. అయితే, అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకునేసరికే యాకూబ్ ప్రాణాలు విడిచాడు. దీంతో వారు ఏమీ చేయలేక వెనుదిరిగారు. చేసేది లేక, తమ జీవనాధారమైన పండ్ల బండిపైనే కొడుకు మృతదేహాన్ని ఉంచి, ఇంటికి తరలించారు. కళ్లెదుటే జరిగిన ఈ విషాద ఘటన ను చూసిన స్థానికులు చలించిపోయారు.

# వివాహేతర సంబంధం..

## భార్యను హత్య చేసిన భర్త

- సోదరులతో కలిసి ఇనుప రాడ్‌తో కొట్టి చంపిన భర్త
- నిందితుడైన భర్త, అతని ఇద్దరు సోదరుల అరెస్ట్

కృష్ణా జిల్లా పామర్రు మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కక్షతో కట్టుకున్న భార్యనే ఓ భర్త తన సోదరులతో కలిసి అతి కిరాతకంగా హత్య చేశాడు. గాంధీనగర్‌లో ఈరోజు తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతురాలిని దిమ్మెట లక్ష్మీప్రసన్న (30)గా గుర్తించారు. ఆమెకు 13 ఏళ్ల క్రితం మీర్జాపురం గ్రామానికి చెందిన మురళీకృష్ణతో వివాహం కాగా, ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా భర్త, పిల్లలను వదిలిపెట్టిన లక్ష్మీప్రసన్న.. నిడుమోలు గ్రామానికి చెందిన అయ్యప్ప అనే వ్యక్తితో కలిసి సహజీవనం చేస్తోంది. ఈ విషయంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న భర్త మురళీకృష్ణ, ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకు న్నాడు. పథకం ప్రకారం సోమవారం ఉదయం గాంధీనగర్‌లో ఉన్న లక్ష్మీప్రసన్నపై తన ఇద్దరు సోదరులతో కలిసి ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. తలపై బలంగా కొట్టడంతో ఆమె తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పామర్రు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ హత్యకు పాల్పడిన భర్త మురళీకృష్ణతో పాటు అతనికి సహకరించిన ఇద్దరు సోదరులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివాహేతర సంబంధం కారణంగా ఏర్పడిన కక్షలే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# వరుస గొర్రెలు, మేకల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

గత కొంతకాలంగా వికారాబాద్, పొరుగు జిల్లాల్లో వరుసగా మేకలు, గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను వికారాబాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ పర్యవేక్షణలో, పరిగి డిఎస్‌పి ఎన్. శ్రీనివాస్ ఆదేశాల మేరకు, కోడంగల్ సిఐ ఎన్. శ్రీధర్ రెడ్డి, బొమ్రాస్‌పేట్ ఎస్ ఐ జి.బి.వి. రమణల ఆధ్వర్యంలో ప్రత్యేక క్రైమ్ పార్టీ బృందం రంగంలోకి దిగింది. ఆదివారం మఫ్టీలో ఉన్న పోలీసులు కె. బాలు, కె. బాలయ్య, శ్రీనివాస్ లు బొమ్రాస్‌పేట్ గ్రామ శివారులోనిరహదారి163 రోడ్డు వద్ద నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక తెల్లటి ఎర్టిగా కారును తనిఖీ చేయడానికి ప్రయత్నించగా, అందులోని వ్యక్తులు పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వారిని వెంబడించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితులను యాదగిరి జిల్లాకు చెందిన సంజయ్ కుమార్ చవాన్ అలియాస్ సంజు (33) మరియు థానే జిల్లా (మహారాష్ట్ర)కు చెందిన జగత్ పాల్ అలియాస్ దినేష్ కుమార్ (29)గా గుర్తించారు. వీరిని బొమ్రాస్‌పేట్ పోలీసు స్టేషన్‌లో విచారించగా, వీరితో పాటు రోషన్, టైగర్ అలియాస్ తేజు, బహదూర్ అనే వ్యక్తులు కలిసి ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. విలాసాలకు, మద్యం అలవాట్లకు బానిసైన వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అర్ధరాత్రి సమయాల్లో కారులో వచ్చి వికారాబాద్ జిల్లాలోని బొమ్రాస్‌పేట్, పరిగి, చెంగోముల్, దోమ, కుల్కచెర్ల, యాలాల్, పెద్దేముల్ మండలాలతో పాటు నారాయణపేట జిల్లాలోని మాగనూర్, మహబూబ్ నగర్ జిల్లాలోని మహమ్మదాబాద్ పరిధిలో మేకలు, గొర్రెలను దొంగలించేవారు. దొంగిలించిన జీవాలను యాదగిరిలోని




షాపూర్ సంతలో విక్రయించి వచ్చిన డబ్బును పంచుకునేవారు. ఈ తరుణంలో ఆదివారం మధ్యాహ్నం తిరిగి దొంగతనం చేసేందుకు కారులో వస్తుండగా పోలీసులు వీరిని పట్టుకున్నారు. అయితే ముగ్గురు నిందితులు పారిపోగా, ప్రధాన నిందితులైన సంజయ్ కుమార్, జగత్ పాల్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి నేరానికి వాడిన ఎర్టిగా కారుతో పాటు రూ. 1,50,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం వీరిపై బొమ్రాస్‌పేట్ పీఎస్ లో సి ఆర్ పీ సి నెంబర్ 34/2026 కింద 331 (4)(II), 305 బి ఎన్ ఎస్ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ ముఠాపై గతంలో చెంగోముల్ (110/2024, 29/2026), యాలాల్ (02/2025), మాగనూర్ (74/2025), కుల్కచెర్ల (138/2025, 20/2026, 28/2026), పెద్దేముల్ (181/2025), మహమ్మదాబాద్ (20/2026), పరిగి (45/2026), దోమ (55/2026) పోలీసు స్టేషన్లలో మొత్తం 12 కేసులు నమోదై ఉన్నాయి. పరారీలో ఉన్న మిగిలిన ముగ్గురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, పోలీస్ అధికారులు తెలిపారు. ఈ కేసులో పని చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది ని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ అభినందించారు.

# కౌంటింగ్‌కు ముందు మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు

- ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఉద్దేశపూర్వకంగా కరెంట్ తీస్తున్నారని ఆరోపణ
- సీసీటీవీలు ఆఫ్ చేశారని, అనుమానాస్పద వాహనాలు తిరుగుతున్నాయన్న మమత
- ఇదంతా బీజేపీ కుట్రేనని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు



పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కొన్ని గంటల ముందు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఉద్దేశపూర్వకంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, సీసీటీవీలను ఆఫ్ చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో 'ఎక్స్' వేదికగా ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా కలకలం రేపింది. "వివిధ ప్రాంతాల్లో కావాలనే లోడ్ షెడ్డింగ్ చేస్తున్నట్లు నాకు సమాచారం అందుతోంది. హూగ్లీలోని సెరాంపూర్, నాడియాలోని కృష్ణానగర్, బర్ధ్వాన్‌లోని ఆష్‌గ్రామ్, కోల్‌కతాలోని ఖుదీరామ్ అనుశీలన్ కేంద్రం వద్ద ఇలాంటి ఘటనలు జరిగాయి. సీసీటీవీలు ఆఫ్ చేస్తున్నారు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్దకు వాహనాలు వస్తూ పోతున్నాయి" అని మమత తన పోస్టులో పేర్కొన్నారు. ఈ కుట్రల వెనుక బీజేపీ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. "నేను రాత్రంతా మేల్కొని పరిస్థితిని గమనిస్తున్నట్లే, మీరు కూడా రాత్రంతా మేల్కొని స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ప్రజా తీర్పును కాపాడాలి. ఎక్కడైనా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వారిని చుట్టుముట్టండి, వెంటనే ఫిర్యాదు చేయండి, సీసీటీవీ ఫుటేజ్ డిమాండ్ చేయండి" అని తన పార్టీ కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు. నాలుగోసారి అధికారం కోసం పోటీ పడుతున్న మమత, ఆదివారం సాయంత్రం భవానీపూర్ నియోజకవర్గ కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు గాను మెజారిటీకి 148 సీట్లు అవసరం. ఈ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అయితే, ఐదు ఎగ్జిట్ పోల్స్ బీజేపీ విజయం సాధిస్తుందని అంచనా వేయగా, తాము 226కు పైగా సీట్లు గెలుస్తామని మమత ధీమా వ్యక్తం చేశారు.

# హర్మూజ్ జలసంధిలో 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'.. అమెరికా భారీ ఆపరేషన్

- చిక్కుకున్న విదేశీ నౌకలను సురక్షితంగా బయటకు తీసుకురావడమే లక్ష్యం
- ఇది మానవతా చర్య అని, అడ్డుకుంటే తీవ్రంగా స్పందిస్తామని ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్‌తో సానుకూల చర్చలు జరుగుతున్నాయన్న ట్రంప్
- అమెరికా చర్య కాల్పుల విరమణ ఉల్లంఘనేనని ఇరాన్ స్పష్టీకరణ




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న విదేశీ వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' పేరుతో ప్రత్యేక ఆపరేషన్ చేపడుతున్నట్లు వెల్లడించారు. సోమవారం ఉదయం ఈ ఆపరేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. ట్రూత్ సోషల్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించిన ట్రంప్ ఈ వివాదంతో ఏమాత్రం సంబంధం లేని అనేక దేశాల నౌకలు అక్కడ చిక్కుకుపోయాయని పేర్కొన్నారు. వారిని 'అమాయక బాధితులు'గా అభివర్ణించారు. ఆ నౌకల్లోని సిబ్బంది వద్ద ఆహారం, నిత్యావసరాలు అడుగంటుతున్నాయని, ఇది పూర్తిగా మానవతా దృక్పథంతో చేపడుతున్న చర్య అని వివరించారు. ఈ ఆపరేషన్‌కు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పూర్తి మద్దతు ప్రకటించింది. గైడెడ్-మిసైల్ డిస్ట్రాయర్లు, 100కు పైగా విమానాలు, 15,000 మంది సైనికులు ఇందులో పాల్గొంటారని తెలిపింది. ఇదే సమయంలో, ఈ మానవతా సహాయక చర్యలకు ఎవరైనా అడ్డుతగిలితే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని ట్రంప్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. మరోవైపు, ఇరాన్‌తో తమ ప్రతినిధులు చాలా సానుకూల చర్చలు జరుపుతున్నారని ట్రంప్ పేర్కొనడం గమనార్హం. అయితే, కొన్ని రోజుల క్రితమే ఇరాన్ ప్రతిపాదించిన 14-సూత్రాల శాంతి ప్రణాళికను ట్రంప్ 'ఆమోదయోగ్యం కాదు' అని తోసిపుచ్చారు. తాజా పరిణామాలపై స్పందించిన ఇరాన్, హర్మూజ్ జలసంధిలో అమెరికా జోక్యాన్ని కాల్పుల విరమణ ఉల్లంఘనగా పరిగణిస్తామని హెచ్చరించింది.

# పెళ్లికి వెళుతుండగా వరుడిని కాల్చి చంపిన దుండగులు

- ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో ఘటన







పెళ్లి వేడుకలతో కళకళలాడాల్సిన ఓ ఇంట్లో పెను విషాదం నెలకొంది. మరికొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వరుడిని, ఊరేగింపుగా వెళ్తుండగా దుండగులు నడిరోడ్డుపై కాల్చి చంపారు. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో చోటుచేసుకుంది. పెళ్లికి రెండు రోజుల ముందే తమకు బెదిరింపులు వచ్చాయని, అయినా తాము వాటిని తేలికగా తీసుకున్నామని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆజాద్ బింద్ అనే యువకుడికి వివాహం నిశ్చయమైంది. శుక్రవారం సాయంత్రం పూలతో అలంకరించిన కారులో బంధువులతో కలిసి పెళ్లి మండపానికి బయలుదేరాడు. వారి నివాసానికి ఐదు కిలోమీటర్ల దూరంలో, జాతీయ రహదారి 135-ూా పై ప్రయాణిస్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు కారును అడ్డగించారు. నెంబర్ ప్లేట్‌కు గుడ్డ కట్టి ఉన్న బైక్ పై వచ్చిన మాస్కులు ధరించిన నిందితులు వెంటనే ఆజాద్‌పై కాల్పులు జరిపి పరారయ్యారు. కాల్పులు జరగడంతో కారులో ఉన్నవారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. బుల్లెట్ గాయాలతో ఉన్న ఆజాద్ "నేను బతకలేను" అంటూ చెప్పిన మాటలను గుర్తుచేసుకుని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆజాద్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ హత్య వెనుక వధువు తరఫు బంధువుల హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వధువు బంధువైన ప్రదీప్ బింద్‌కు ఈ పెళ్లి ఇష్టం లేదని, ఈ కారణంగానే అతను రవి యాదవ్, భోలే రాజ్‌భర్‌లతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. పెళ్లికి ముందు ప్రదీప్ తమను బెదిరించినట్లు వధువు కూడా విచారణలో అంగీకరించింది. నిందితుడు ప్రదీప్‌కు నేరచరిత్ర ఉందని, గతంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉండి బెయిల్‌పై బయట ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా, వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.25,000 రివార్డును పోలీసులు ప్రకటించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# తక్కువ క్రెడిట్ స్కోర్‌తో బోలెడు సమస్యలు..

## ఈ టిప్స్ పాటిస్తే సమస్యలు ఫసక్..!

భారతదేశంలో ఇటీవల కాలంలో పెరిగిన టెక్నాలజీ కారణంగా బ్యాంకింగ్ రంగంలో కీలక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా లోన్ ఇవ్వడానికి బ్యాంకులు కస్టమర్ చెల్లింపు పరిస్థితిని తెలుసుకోవడానికి వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. పెరిగిన ఖర్చులు, అవసరాల నేపథ్యంలో లోన్ తీసుకోవడం అనేది ప్రస్తుత రోజుల్లో సర్వసాధారణమైంది. అయితే లోన్ తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లినప్పుడు లోన్ ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా బ్యాంకులు లోన్ ఇవ్వడానికి కస్టమర్ క్రెడిట్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటున్నాయి. అయితే క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటే చాలా సింపుల్‌గా రుణాన్ని రిజెక్ట్ చేస్తూ ఉంటాయి. కస్టమర్లు చేసే కొన్ని తప్పుల కారణంగా తక్కువ సిబిల్ స్కోర్ ఉంటుందని చాలా మందికి తెలియదు. ఈ నేపథ్యంలో లోన్ రిజెక్ట్ కాకుండా ఉండడానికి మెరుగైన క్రెడిట్ స్కోర్ ఎలా మెయింటెన్ చేయాలో? ఓసారి తెలుసుకుందాం. బిల్లుల చెల్లింపు మంచి క్రెడిట్ స్కోర్ మెయింటేన్ చేయాలంటే మీ




క్రెడిట్ కార్డ్ బిల్లులు, లోన్ ఈఎంఐలు, ఇతర బకాయిలను సకాలంలో చెల్లించాలని నిపుణులు చెబుతున్నారు. చెల్లింపులు ఆలస్యంగా చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని వివరిస్తున్నారు. క్రెడిట్ కార్డుల వినియోగం కస్టమర్లు వారి వద్ద ఉన్న క్రెడిట్ కార్డుల్లో వినియోగ పరిమితిని 30 శాతం కంటే తక్కువ ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. అధిక క్రెడిట్ వినియోగం ఆర్థిక ఇబ్బందులను సూచిస్తుందని తద్వారా క్రెడిట్ స్కోర్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. రుణాల మిశ్రమం సాధారణంగా మన అవసరానికి సంబంధించి తీసుకున్న రుణాలు మన క్రెడిట్ స్కోర్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. సెక్యూర్డ్ రుణాలు అంటే గృహ రుణాలు వంటివి, అలాగే అసురక్షిత క్రెడిట్ అంటే క్రెడిట్ కార్డ్‌ల వంటివి ఉపయోగించే సమయంలో జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా క్రెడిట్ కార్డుల తీసుకునే సమయంలో మనకు అవసరమైన క్రెడిట్‌ను మాత్రమే తీసుకోవాలని పేర్కొంటున్నారు. లోన్ అప్లికేషన్ల వినియోగం మీరు లోన్ లేదా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసిన ప్రతిసారీ రుణదాత మీ క్రెడిట్ స్కోర్‌ను తనిఖీ చేస్తాడు. ఫలితంగా మీ రుణ అవసరాన్ని బేరీజు వేసుకుని మీ క్రెడిట్ స్కోర్ తగ్గే ప్రమాదం ఉంది. అందువల్ల లోన్ తీసుకోవాలని అనుకున్నప్పుడు 15 రోజుల వ్యవధిలోనే మీకు అవసరమైన బ్యాంకులకు వెళ్లి రుణ వడ్డీ రేట్లను కనుగొనడం ఉత్తమం. ఇలా చేయడం ద్వారా క్రెడిట్ స్కోర్ తగ్గదని నిపుణులు పేర్కొంటున్నారు. క్రెడిట్ నివేదిక లోపాలు లేదా అనధికారిక లావాదేవీలు లేవని నిర్ధారించుకోవడానికి మీ క్రెడిట్ నివేదికను కాలానుగుణంగా సమీక్షించడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మీరు ఏవైనా వ్యత్యాసాలను కనుగొంటే వాటిని సరిదిద్దడానికి వెంటనే సంబంధిత ఏజెన్సీకు నివేదించాలని సూచిస్తున్నారు.

# ప్రయాణికులకు శుభవార్త! ఈ అన్ని రైల్వే స్టేషన్లలో టికెట్ల కోసం డిజిటల్ చెల్లింపు సదుపాయం

రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఇప్పుడు రైల్వే స్టేషన్లలో రైలు టిక్కెట్లు కొనుగోలు చేసేటప్పుడు ప్రయాణీకులు కోడ్ ద్వారా డిజిటల్‌గా ఛార్జీలను చెల్లించవచ్చు. పశ్చిమ రైల్వేలు గుజరాత్‌లోని రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్‌లలోని అన్ని స్టేషన్లలో కోడ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక త్వరలో అన్ని స్టేషన్‌లలో ఈ విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కొత్త కార్యక్రమం కింద రాజ్‌కోట్ డివిజన్‌లోని రాజ్‌కోట్, జామ్‌నగర్, సురేంద్రనగర్, ద్వారక సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ టికెట్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం కల్పించామని డివిజనల్ రైల్వే ప్రతినిధి తెలిపారు. డివిజనల్ రైల్వే మేనేజర్ అశ్వనీ కుమార్, భావ్‌నగర్ డివిజనల్ రైల్వే మేనేజర్ రవీష్ కుమార్ లు క్యూఆర్ కోడ్‌ని ఉపయోగించి టికెట్ ఛార్జీలను డిజిటల్‌గా చెల్లించాలని ప్రయాణికులను అభ్యర్థించారు. భావ్‌నగర్ డివిజన్‌లోని భావ్‌నగర్ టెర్మినస్, బోటాడ్, గాంధీగ్రామ్, జునాగఢ్, పోర్ బందర్, వెరావల్‌తో సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్ చేయబడిన, రిజర్వ్ చేయని టికెట్ కౌంటర్లలో కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం అందించారు. రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్




డిజిటల్ చెల్లింపు పద్ధతులను ఉపయోగించి నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి, ప్రయాణీకులకు సాఫీగా, మరింత సమర్థవంతమైన సేవలను అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. డివిజన్‌లోని రిజర్వేషన్ కార్యాలయం, బుకింగ్ కార్యాలయం అన్ని కౌంటర్లలో కోడ్ పరికరాలు అమర్చారు. రైల్వే ప్రయాణికులు టిక్కెట్ ఛార్జీలు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్ డిజిటల్ మాధ్యమం సౌకర్యం కల్పిస్తున్నారు. ౖరెల్వే ప్రయాణికులు ఇప్పటికే యూటీఎస్ మొబైల్ యాప్, వంటి వివిధ డిజిటల్ చెల్లింపు ఎంపికలను టిక్కెట్ ఛార్జీని చెల్లించడానికి అందుబాటులో ఉన్నాయి. ఈ రకమైన డిజిటల్ చెల్లింపు వ్యవస్థను మరింత ఉపయోగకరంగా, సాఫీగా మార్చే లక్ష్యంతో, రాజ్‌కోట్ డివిజన్ దీనిని విస్తరించింది. ఈ కొత్త డిజిటల్ చెల్లింపు విధానం ఇప్పుడు క్యూఆర్ కోడ్ ద్వారా టిక్కెట్ ఛార్జీలు చెల్లించడానికి ప్రయాణీకులకు మరింత సౌలభ్యాన్ని అందిస్తుంది. దీని ద్వారా ఏ ప్రయాణీకుడైనా తన టికెట్ ఛార్జీలను సజావుగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించవచ్చు.

# అద్దె ఒప్పందం 11 నెలలకే ఎందుకు చేసుకుంటారో తెలుసా.?



ఇంటి కోసం లేదా దుకాణం కోసం అద్దెకు తీసుకోవడం సర్వసాధారణమైన విషయం. దేశంలో చాలా సొంతింటిలో ఉంటున్న వారి కంటే, సొంత దుకాణాల్లో వ్యాపారాలు చేస్తున్న వారి కంటే అద్దె ఇంట్లో ఉంటున్న వారే ఎక్కువని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే అద్దెకు తీసుకునే సమయంలో రెంటల్ అగ్రిమెంట్ చేసుకుంటారని మనకు తెలిసిందే. అద్దెకు ఇచ్చే వారికి, అద్దె తీసుకునే వారి మధ్య ఈ ఒప్పందం జరుగుతుంటుంది. రెంటల్ అగ్రిమెంట్‌లో యజమాని పేరు, చిరునామా, అద్దె మొత్తం ఎంత.? ఎంత వ్యవధి కోసం అద్దె తీసుకుంటున్నారు, ఇంకా ఏమైనా ఇతర నిబంధనలు లేదా షరతులు ఉంటే వాటిని అందులో పేర్కొంటారు. అద్దె ఒప్పందం అనేది ఒక రకమై లీజు ఒప్పందం లాంటిది. వీటిని వైట్ పేపర్స్‌పై లేదా, బాండ్ పేపర్‌పై రాసి సాక్ష్యుల సమక్షంలో ఒప్పందాలు చేసుకుంటారు. అయితే చాలా వరకు రెంటల్ అగ్రిమెంట్స్ 11 నెలల వ్యవధికి మాత్రమే చేసుకుంటారు. అయితే 11 నెలలకే రెంటల్ అగ్రిమెంట్ ఎందుకు చేసుకుంటారన్న దానిపై ఎప్పుడైనా సందేహం వచ్చిందా.? దీని వెనకాల అసలు కారణం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 11 నెలలకు రెంటల్ అగ్రిమెంట్ చేసుకోవడానికి కారణాల్లో రిజిస్ట్రేషన్ చట్టం 108 ఒకటి. రిజిస్ట్రేషన్ చట్టం 1908లో సెక్షన్ 17 నిబంధనల ప్రకారం ఏడాది కంటే తక్కువ లీజు ఒప్పందం చేసుకోవడం కుదరదు. ఏడాదికి లీజు ఒప్పందం చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా కాస్త వ్యయప్రయాసలతో కూడుకున్న అంశం కావడంతో చాలా మంది కేవలం 11 నెలలకే రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. తిరిగి 11వ తనెల పూర్తి కాగానే మళ్లీ, మరో 11 నెలలకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఇదండీ 11 నెలల రెంటల్ అగ్రిమెంట్ వెనకాల ఉన్న అసలు ఉద్దేశం.

# 21 ఏళ్లలో రూ. 70 లక్షలు.. నెలకు ఎంత సేవ్ చేయాలంటే..



సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సేవ్ చేసుకోవాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. అయితే ఇది వారి వారి ఆదాయాలకు అనుగుణంగా మారుతుంటుంది. సంపాదించే ప్రతీ ఒక్కరూ సేవింగ్స్ చేయాలని ఆర్థిక నిపుణులు సైతం చెబుతుంటారు. ఒకప్పుడు కర్చు పెట్టిన తర్వాత మిగిలిన మొత్తాన్ని సేవ్ చేసే వారు. కానీ ప్రస్తుతం పొదుపు చేసిన తర్వాత మిగిలిన మొత్తాన్నే ఖర్చు చేస్తున్నారు. ఇక పెట్టుబడి పెట్టేందుకు ఎన్నో రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. కష్టపడి సంపాదించిన సొమ్ముకు భద్రతతో పాటు, మంచి రిటర్న్ రావాలని ప్రతీ ఒక్కరూ ఆశిస్తుంటారు. అలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వ సంస్థ పోస్టాఫీస్ పలు రకాల పథకాలను అందిస్తోంది. ఇలాంటి బెస్ట్ స్కీమ్స్‌లో సుకన్య నమృద్ధి యోజన ఒకటి. బాలికల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో రూ. 250 నుంచి గరిష్టంగా ఏడాదికి రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. ఈ పథకంలో మొత్తం 15 ఏళ్లు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ లభిస్తుంది. మరి ఈ పథకంలో భాగంగా రూ. 70 లక్షలు పొందాలంటే నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. మీ కూతురు పుట్టిన రోజు నుంచే సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ప్రారంభించి ఏటా రూ. 1.5 లక్ష డిపాజిట్ చేశారనుకుందాం. ఈ లెక్కన మీరు ప్రతీ నెల రూ. 12,500 సేవ్ చేయాల్సి ఉంటుంది. ఇలా 15 ఏళ్లు పెట్టుబడి పెడితే మొత్తం రూ. 22,50,000 అవుతుంది. ప్రస్తుతం ఈ పథకానికి 8.2 శాతం వడ్డీ లభిస్తోంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ సమయంలో ర. 46,77,578 వడ్డీగా పొందుతారు. దీంతో మీ కూతురు 21 ఏళ్ల నాటికి అసలు, వడ్డీతో కలిపి మొత్తం రూ. 69,27,578 అంటే సుమారు రూ.70 లక్షలు పొందొచ్చు.ఉదాహరణకు మీరు ఒకవేళ 2024 సెప్టెంబర్‌లో ఈ పథకంలో చేరితే మీకు 2045 నాటికి రూ.7 లక్షలు పొందొచన్నమాట.ఇక ఈ పథకంలో పెట్టుబడిఎట్టినవారికి1961లోనిసెక్షన్80%కిందపన్నుఆదాఅవకాశం కూడా లభిస్తుంది.

# వ్యాపారం

## దృష్టి లోపం ఉన్న వారికి కూడా మేలైన బ్యాంకింగ్ సేవలు..

### బ్రెయిలీ డెబిట్ కార్డు లాంచ్ ద్వారా ఆ సమస్యలు దూరం




భారతదేశంలో ఇటీవల కాలంలో బ్యాంకింగ్ సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని బ్యాంకు ఖాతాల ద్వారానే లబ్ధిదారులకు అందిస్తున్నాయి. ముఖ్యంగా జన్-ధన్-ఖాతాలు భారతదేశంలో బ్యాంకింగ్ విప్లవాన్నే సృష్టించాయని చెప్పాలి. భారతదేశ పౌరులందరికీ జీరో బ్యాలెన్స్ అకౌంట్ల ద్వారా బ్యాంకింగ్ సేవలను అన్ని బ్యాంకులు అందించాయి. ముఖ్యంగా డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు కూడా పెరిగాయి. డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి బ్యాంకులకు వెళ్లే అవసరం లేకుండా డెబిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంల ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే వారు ఇటీవల కాలంలో బాగా పెరిగారు. అయితే దృష్టి లోపం ఉన్న వారు బ్యాంకింగ్ సేవలను పొందడంలో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా వారికంటూ ప్రత్యేక చర్యలు ఏవీ లేకపోవడంతో వారు ఇంకా నగదు డిపాజిట్, విత్‌డ్రా కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో దృష్టి లోపం ఉన్న వారికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ గుడ్‌న్యూస్ చెప్పింది. బ్రెయిలీ డెబిట్ కార్డులను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ తీసుకున్న చర్యలు గురించి వివరాలను తెలుసుకుందాం. ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం పీఎన్‌బీ అంత: దృష్టి పేరులో బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రారంభించింది.ఈ కాంటాక్ట్‌లెస్ నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) డెబిట్ కార్డ్ రూపే నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉందని పీఎన్‌బీ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రవేశపెట్టడం అనేది చేరిక, ఆర్థిక సౌలభ్యంపై పీఎన్‌బీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆ బ్యాంకు ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించేందుకు పీఎన్‌బీ ఇలాంటి చర్యలను తీసుకుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే పీఎన్‌బీ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం ప్రత్యేక చర్యలను తీసుకోవడం అభినందనీయమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశంలోని అందరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయని వివరిస్తున్నారు.

## యూపీఐ నగదు చెల్లింపుల్లో ఆ తప్పు చేశారా..? ఈ టిప్స్ పాటిస్తే మీ సొమ్ము వాపస్




భారతదేశంలో 2016లో నోట్లను రద్దు చేశాక ఆన్‌లైన్ చెల్లింపులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఎన్‌పీసీఐ అందుబాటులోకి తీసుకువచ్చిన యూపీఐ పేమెంట్స్ సదుపాయం ద్వారా చాలా మంది నగదును ఈజీగా బదిలీ చేస్తున్నారు. ముఖ్యంగా యూపీఐ చెల్లింపుల వల్ల దేశంలో చిల్లర సమస్యకు చెక్ పడినట్లు అయ్యింది. అలాగే వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లకు నగదు బదిలీ కూడా బ్యాంకునకు వెళ్లాల్సిన అవసరం లేకుండా యూపీఐ చెల్లింపులు ద్వారా చేయడం ప్రజలకు అలవాటు అయ్యింది. అయితే యూపీఐ ద్వారా ఒక వ్యక్తికి పంపబోయి వేరే వ్యక్తికి నగదును బదిలీ చేస్తే అవి తిరిగి రావు అని చాలా మంది చెబుతూ ఉంటారు. కానీ, నిర్దిష్ట విధానాన్ని పాటించడం ద్వారా మనం పొరపాటున వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును వాపస్ పొందవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును ఎలా వాపసు పొందవచ్చో? ఓసారి తెలుసుకుందాం. యూపీఐ ద్వారా బదిలీ చేసిన నగదు వాపసు పొందడం ఇలా మీరు ముందుగా ఏ యాప్ ద్వారా నగదు బదిలీ చేశారో? ఆ యాప్‌లో లావాదేవీ నెంబర్ ద్వారా టిక్కెట్ రైజ్ చేసి కంప్లైంట్ చేయాలి. అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌ను సందర్శించి, 'వివాద పరిష్కార యంత్రాంగం' విభాగాన్ని సెలెక్ట్ చేసి ఆన్‌లైన్ ఫారమ్‌ను పూరించాలి. లావాదేవీ ఐడీ, వర్చువల్ చెల్లింపు చిరునామా, బదిలీ చేసిన మొత్తం, లావాదేవీ తేదీ, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో సహా అవసరమైన వివరాలను అందించాలి. అనంతరం అకౌంట్‌లో సొమ్ము బదిలీ జరిగినట్లు మీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను అప్‌లోడ్ చేయాలి. అక్కడ మీ ఫిర్యాదుకు కారణం 'మరో ఖాతాకు తప్పుగా బదిలీ చేయబడింది' ఎంచుకోవాలి. అనంతరం మీ ఫిర్యాదు పరిష్కారమవుతుంది. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే ముందుగా టీపీఏపీ, తర్వాత పీఎస్‌పీ బ్యాంక్ (చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్ బ్యాంక్), అనంతరం బ్యాంకును సమస్య పరిష్కారం కోసం సంప్రదించాలి. ఒక నెల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే లేదా ప్రతిస్పందనతో మీరు అసంతృప్తి చెందితే, డిజిటల్ లావాదేవీల కోసం ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ని సంప్రదించాలి.

## ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితి పెంపు.. ఆ బ్యాంకుల్లో ప్రత్యేక ఆఫర్లు

భారతదేశంలో పెట్టుబడిదారులు నమ్మకమైన పెట్టుబడి ఎంపికగా ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకుంటూ ఉంటారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ రంగంలో వచ్చిన మార్పుల వల్ల ఎఫ్‌డీల కంటే మంచి పెట్టుబడి ఎంపికలు ప్రజాదరణ పొందుతున్నాయి. క్రమేపి బ్యాంకుల్లో ఎఫ్‌డీల్లో డిపాజిట్ చేసే వారి సంఖ్య క్రమేపి తగ్గుతుంది. ఈ నేపథ్యంలో కస్టమర్లను ఎఫ్‌డీల్లో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించడానికి చాలా బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లను లాంచ్ చేస్తున్నాయి. సాధారణ ఎఫ్‌డీలతో పోలిస్తే ఈ ప్రత్యేక ఎఫ్‌డీలు అధిక వడ్డీను అందిస్తున్నాయి. తాజాగా ప్రముఖ బ్యాంకులు అన్నీ ప్రత్యేక ఎఫ్‌డీల కాలపరిమితిని పెంచాయి. ఈ నేపథ్యంలో ఏయే బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని పెంచాయో? ఓ సారి తెలుసుకుందాం. పొడగింపులను ప్రకటించిన బ్యాంకులు ఇవే ఇండియన్ బ్యాంక్ తన ప్రత్యేక ఎఫ్‌డీల కోసం పొడిగింపును ప్రకటించింది. ఎఫ్‌డీ పెట్టుబడిదారులు సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ గడవు జూన్ 30తో ముగిసినా మరోసారి పెంచారు. ఐడీబీఐ బ్యాంక్‌కు సంబంధించిన ప్రత్యేక ఉత్సవ్ ఎఫ్‌డీల గడువు కూడా సెప్టెంబర్ 30, 2024 వరకు పొడిగించారు. వాస్తవానికి ఈ పథకం గడువు జూన్ 30, 2024న ముగిసినా వినియోగదారులను ఆకర్షించడానికి బ్యాంకు మరోసారి గడువును పొడగించింది. పంజాబ్ సింధ్ బ్యాంక్ లిమిటెడ్ పిరియడ్ ప్రత్యేక డిపాజిట్ల కాలపరిమితిని పెంచింది. ఈ గడువు సెప్టెంబర్ 30, 2024కి ముగుస్తుంది. ప్రముఖ బ్యాంకు ఎస్‌బీఐ కూడా ప్రత్యేక డిపాజిట్లపై కాలపరిమితిని పెంచింది. అమృత్ కలాష్ స్కీమ్, ఎస్‌బీఐ వీ కేర్ ఎఫ్‌డీల కాలపరిమితిని ఎస్‌బీఐ పెంచింది. ఎస్‌బీఐ కూడా ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని సెప్టెంబరు 30, 2024 వరకు పెంచింది.

# జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారా? అయితే కాసిన్ని ఖర్జూరాలు తినండి..



ఏడాది పొడవునా మార్కెట్‌లో లభించే పండ్లలో ఖర్జూరం ఒకటి. వివిధ రకాల ఖర్జూరాలు మార్కెట్లో లభిస్తుంటాయి. అన్ని రకాల ఖర్జూరాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే వీటిని 'సూపర్ ఫుడ్' అని కూడా పిలుస్తారు. ప్రతిరోజూ ఖర్జూరం తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. రోజూ ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం. ఖర్జూరంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, కాపర్, మాంగనీస్, విటమిన్ బి6, కె అధికంగా ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఖర్జూరంలో పోషక విలువలు చాలా



ఎక్కువ. ఖర్జూరం తినడం వల్ల ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి చక్కెరలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. శరీరానికి వెంటనే శక్తి అందుతుంది. అందుకే ఉపవాసం తర్వాత ఖర్జూరం తినడం మంచిది. ఖర్జూరం పొట్టకు చాలా మంచిది. ఖర్జూరాలు జీర్ణక్రియలో సహాయపడతాయి. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. పీచు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ఖర్జూరం గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఖర్జూరాలు హృదయనాళ వ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే శక్తి కూడా ఖర్జూరాలకు అధికంగా ఉంటుంది. ఖర్జూరంలో చక్కెర ఉన్నప్పటికీ ఇవి రక్తంలో చక్కెరను పెంచవు. అయినప్పటికీ డయాబెటిస్ పేషెంట్లు వీటిని తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ఖర్జూరాలు మెదడు ఆరోగ్యాన్ని పెంచడానికి, మెదడు పనితీరును పెంచడంలో సహాయపడతాయి.

# వీరికి సంజీవని ఈ పండు.. రోజూ ఒకటి తిన్నారంటే ఈ వ్యాధికి దీన్ని మించిన దివ్యౌషధం లేదు.!

రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి పండ్లు తినడం. కొన్ని పండ్లను తీసుకోవడం వల్ల సహజంగా మీ శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అలాంటి వాటిలో అవకాడో ఒకటి. దీనిని బటర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. ఈ పండు మన శరీరానికి చాలా పోషకాలను అందిస్తుంది. అవకాడోలో కూరగాయల మాదిరిగానే ఆరోగ్యకరమైన పదార్థాలు ఉంటాయి. ఇందులో కొవ్వు అధికంగా ఉన్నప్పటికీ, ఇది మీ శరీరాన్ని అదనపు కొవ్వు నుండి రక్షిస్తుంది.మీ శరీరం ఫోలిక్ యాసిడ్ వంటి విటమిన్లను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. కాబట్టి మీరు ఈ పండును పచ్చిగా తినవచ్చు. అవకాడో మీ శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడానికి సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను కూడా నియంత్రణలో ఉంచుతుంది. అవకాడోను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల స్ట్రోక్ లేదా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.అవకాడోలో ఉండే కొవ్వు ఆమ్లాలు, లైపేస్ ఎంజైమ్ శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. అవకాడోలో విటమిన్ బి, విటమిన్ కె, విటమిన్ ఇ, విటమిన్ సి పుష్కలంగా ఉన్నాయి. అవకాడోలో ఉండే పొటాషియం మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడోలో ఉండే ఫైబర్ మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.



## కొబ్బరినీళ్లు తాగే అలవాటుందా..? ఈ సమస్యలున్న వారు అస్సలు తాగకూడదంట.. ఇక మీ ఇష్టం..

ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఈ తరుణంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ముఖ్యంగా ఎండాకాలంలో చాలామంది డీహైడ్రేషన్ సమస్యతో బాధపడుతుంటారు. వాస్తవానికి.. శరీరంలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ నీటిశాతం తగ్గితే.. అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. బాడీ డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు కొబ్బరి నీరు అమృతంలా పనిచేస్తుంది.. వాస్తవానికి కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, కాల్షియం, కాపర్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి.. కొబ్బరినీళ్లు ఎప్పుడు తాగినా తాగినా మంచిదే కానీ.. కొందరికి మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని పేర్కొంటున్నారు వైద్య నిపుణులు.. కొన్ని సమస్యలున్న వారు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. ఏ వ్యాధితో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదో ఇప్పుడు తెలుసుకోండి. కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నవారు: కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. మధుమేహ రోగులు: మధుమేహ వ్యాధిగ్రస్తులు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఎందుకంటే దానిలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువ. అందుకే.. కొబ్బరినీళ్లు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అలర్జీ: అలర్జీ బాధితులు కొబ్బరినీళ్లు తాగకూడదు. కొబ్బరి నీరు తాగితే చర్మంపై దురద, మంట, చర్మం ఎర్రబడడం వంటి అనేక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. అధిక రక్తపోటు: అధిక రక్తపోటుతో బాధపడేవారు కూడా సాధ్యమైనంతమేరకు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. అయితే, వైద్యుల సలహా మేరకు మాత్రం కొబ్బరి నీళ్లు తాగవచ్చు.



## కప్పు కాఫీ.. తాగితే అమేజింగ్ అంతే.! వీళ్లు మాత్రం అస్సలు జోలికి వెళ్లొద్దు..



ప్రపంచవ్యాప్తంగా కాఫీ లవర్స్ చాలామందే ఉంటారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కొంతమందికి కాఫీ తాగనిదే రోజు గడవదు. అంతలా ఎడిక్ట్ అవుతారు. ఉదయాన్నే బెడ్ కాఫీ తాగితేనే గానీ తమ రోజు మొదలుపెట్టరు. అయితే కాఫీ లిమిట్‌గా తాగితే ఫర్వాలేదు. కాని అధిక మోతాదులో తీసుకుంటేనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఈ వ్యాధులు ఉన్నవారు కాఫీని అస్సలు తాగకూడదు. మీరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటే.. అస్సలు కాఫీ తాగొద్దు. కాఫీలో కెఫిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు నరాలపై ప్రభావం చూపిస్తుంది. అలాగే రక్త ప్రసరణ కూడా మందగిస్తుంది. అధిక మొత్తంలో కెఫిన్ శరీరంలోకి చేరితే.. మైగ్రేన్ మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. మీకు హై-బీపీ ఉన్నట్లయితే.. కాఫీ తాగకండి. కాఫీ తాగడం వల్ల రక్తపోటు స్థాయి మరింతగా పెరుగుతుంది. దాని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలాగే కాఫీ తాగడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. దీంతో బీపీలో హెచ్చుతగ్గులు ఉండొచ్చు. డయాబెటిక్ పేషెంట్లు కాఫీ తాగడం మానేయాలని చాలామంది ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాఫీ తాగడం వల్ల డయాబెటిక్ రోగులకు అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయి అసమతుల్యంగా ఉన్నవారు కూడా కాఫీ తాగకూడదు. గర్భధారణ సమయంలో కాఫీ తాగడం మంచిది కాదు. కాఫీలో ఉండే కెఫిన్ శాతం మీ శరీరంలోని రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుంది. దీని వల్ల కడుపులో పెరుగుతున్న పిండానికి రక్తం సరఫరాలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఒకవేళ మీకు ఒత్తిడిని ఎదురుకుంటున్నట్లయితే.. కాఫీ గురించి అస్సలు ఆలోచించొద్దు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కాఫీని ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో కార్టిసోల్ హార్మోన్‌పై అధిక ప్రభావం పడుతుంది. ఇది ఒత్తిడిని మరింత ఎక్కువ చేస్తుంది. కాగా, ఈ వార్త కేవలం పలు అధ్యయనాలు, వైద్య నిపుణుల రీసెర్చ్ ఆర్టికల్స్ ఆధారంగా ప్రచురించింది మాత్రమే. మీరు ఏదైనా డైట్ ఫాలో కావాలన్నా.. డాక్టర్ సలహా కచ్చితంగా తీసుకోండి.

## మీ బుజ్జాయి కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజుకొక్కసారి ఇలా చేయండి



మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో కన్ను ఒకటి. చూపు లేని లోకం అంధకారం అని పెద్దలు అందుకే అంటారు. కాబట్టి కంటి సంరక్షణ చాలా ముఖ్యం. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో పిల్లలు చిన్నప్పటి నుంచే ఫోన్ స్ట్రీన్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో పిల్లల కళ్ళు బాల్యం దశలోనే ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి చిన్న వయసు నుంచే పిల్లల కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే వయసు పెరిగే కొద్దీ సమస్యలు మరింత తీవ్రతరం అవుతాయి. మీ కంటిపాప చూపును జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఆయుర్వేదాన్ని ఆశ్రయించవచ్చు. మంచి కంటి చూపుకు, కంటి సంరక్షణకు ఆయుర్వేద నివారణలు ఎంతో ఉపయోగపడతాయి. తర్పన్ అనేది ఒక రకమైన ఆయుర్వేద చికిత్స. ఇది కళ్ళను తేమగా ఉంచడానికి, దృష్టిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది కంటి దురదను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. దీనిని ఎలా వినియోగించాలంటే.. నెయ్యిని కళ్లపై నెమ్మదిగా రాసి, ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కళ్లను కడగాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల కళ్లకు చాలా మంచిది. కళ్లలోకి చేరే రకరకాల దుమ్ము, కాలుష్య కారకాలను తొలగించి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే అధిక వేడి, చల్లటి నెయ్యిన కళ్లకు ఎప్పుడూ పూయకూడదు. అలాగే కళ్లపై ప్రత్యక్ష సూర్యకాంతి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల కళ్లలోకి యువి కిరణాలు నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సూర్యుడి నుండి కళ్ళను రక్షించడం కూడా అవసరమే. నేటి యుగంలో పిల్లల ముందు టీవీ, ల్యాప్‌టాప్, మొబైల్ స్క్రీన్‌లు కనిపిస్తున్నాయి. వాటిని నివారించలేం. అయితే పిల్లలను స్క్రీన్‌కు దూరం ఉంచడం మీ చేతుల్లో పనే. ఇది మీ పాపాయి కళ్లను కొంత వరకు కాపాడుతుంది. ఆయుర్వేదం ప్రకారం సోంపు గింజలు తినడం కళ్ళకు ఎంతో మేలు జరుగుతుంది. సోంపు గింజలు నోటి దుర్వాసనను తొలగించడంలో కూడా ఉపయోగపడతాయి. కాబట్టి రోజూ భోజనం తిన్న తర్వాత సోపు తింటే కళ్లకు మేలు చేస్తుంది. అలాగే త్రిఫల, ఉసిరి కళ్లకు చాలా మేలు చేస్తుంది. త్రిఫల పొడి, ఉసిరి పొడి కలిపి మీ చిన్నారికి ఆహారంలో ఇవ్వవచ్చు. దానితో పాటు కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అలవాటు చేయాలి. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలకు తినిపిస్తే కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

## పోషకాల్లో తిరుగులేని పొద్దుతిరుగుడు.. తింటే అద్భుతమైన శక్తి



పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ సి, విటమిన్ ఇ, విటమిన్ బి6, ఫైబర్, ఐరన్, జింక్, కాపర్, ఫాస్ఫరస్ మరియు కాల్షియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ ఎముకలను బలోపేతం చేయడమే కాకుండా మీ జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుచుకోవచ్చు. అలాగే, అవి డయాబెటిక్ రోగులకు ఔషధం లాంటివి. ఎందుకంటే వీటి సహాయంతో రక్తంలో చక్కెర స్థాయిని నిర్వహించడంలో సహాయపడతాయి. పొద్దుతిరుగుడు పువ్వుకు ఎంత అందం ఉంటుందో, దాని గింజల్లో అంత ఆరోగ్యం దాగివుందని నిపుణులు అంటున్నారు. పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి వరం లాంటివి. ప్రతిరోజూ వాటిని తినడం వల్ల ఈ అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. నేటి అనారోగ్యకరమైన జీవనశైలిలో, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. మీ ఆహారంలో పొద్దుతిరుగుడు విత్తనాలను చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ నుండి రక్తపోటు వరకు నియంత్రించవచ్చు. పొద్దుతిరుగుడులో డైటరీ ఫైబర్, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి. ఇవి అనేక వ్యాధులలో గొప్ప ప్రయోజనాలను అందిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో అద్భుతమైన ఆరోగ్య నిధి దాగి ఉంది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి ఆహారంలో కొన్ని గింజలను చేర్చుకోవడం చాలా మేలు చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉపయోగించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవడం ద్వారా, మీరు మలబద్ధకం సమస్య నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి వాటిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, ఈ విత్తనాలను తీసుకోవడం ద్వారా మీరు చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు గింజలు డయాబెటిక్ రోగులకు ఒక ఔషధం లాంటివి., ఎందుకంటే వాటిలో పాలీసాచురేటెడ్ కొవ్వు పుష్కలంగా ఉంటుంది. కార్బోహైడ్రేట్ పరిమాణం తక్కువగా ఉంటుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల జీవక్రియ రేటు పెరుగుతుంది. వాటిలో మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో సన్‌ఫ్లవర్ సీడ్స్ రెగ్యులర్ వినియోగం బరువు తగ్గడానికి, స్థూలకాయాన్ని అదుపులోకి తీసుకురావడానికి సహాయపడుతుంది. ఎముకల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కూడా ఈ విత్తనాలు చాలా మేలు చేస్తాయి. మీరు కూడా కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఎందుకంటే ఇందులో కాల్షియం, మెగ్నీషియం, జింక్ మరియు ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. పొట్టను శుభ్రం చేయడంలో పొద్దుతిరుగుడు గింజలకు మరోకటి పోటీ లేదు. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, శరీరంలోని టాక్సిన్స్‌ను కూడా బయటకు పంపవచ్చు . ప్రతిరోజూ 2 టేబుల్ స్పూన్ల పొద్దుతిరుగుడు విత్తనాలు మీ ఆరోగ్యానికి వరం కంటే తక్కువ కాదు.

క్రైమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక



# దుర్వాసన దూరం..

గుట్కాలు తినేవారిలో, మద్య పానం-ధూమపానం చేసేవారిలో నోటి దుర్వాసన ఎక్కువగా కనిపిస్తుంది. దంతధావనం సరిగ్గా చేయపోయినా.. ఈ సమస్య వేధిస్తుంది. కానీ, కొందరిలో ఏ దురలవాట్లూ లేకపోయినా.. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసినా.. నోటి నుంచి చెడువాసన వస్తుంటుంది. ఇది నలుగురిలో తీవ్రమైన ఇబ్బందికి గురిచేస్తుంది. కాబట్టి, నోటి దుర్వాసనను దూరం చేసే కొన్ని ఇంటి చిట్కాలను నిపుణులు వివరిస్తున్నారు. నోటిలో పేరుకుపోయే బ్యాక్టీరియా, ఇతర ఆరోగ్య సమస్యలు.. నోటి దుర్వాసనకు ప్రధాన కారణాలు. కాబట్టి, రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడంతోపాటు ఫ్లాస్ చేయడం, నాలుకపై బ్యాక్టీరియాను తొలగించుకోవడం ముఖ్యం. నోటి దుర్వాసనను కలిగించే బ్యాక్టీరియాను ఉప్పు నీటితో పుక్కిలించడం ద్వారా నిర్మూలించవచ్చు. బేకింగ్ సోడాలో యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. దీనిని మౌత్ వాష్‌గా వాడితే మంచి ఫలితాలు ఉంటాయి. నోరు పొడిబారినా.. దుర్వాసన వేస్తుంది. కాబట్టి, ఈ సమస్య నుంచి బయట పడటానికి నీళ్లు ఎక్కువగా తాగండి. దాంతో, శరీరం హైడ్రేటెడ్‌గా ఉండి, నోటి ఆరోగ్యం బాగుంటుంది. శ్వాసను తాజాగా ఉంచడంలో తులసి, పుదీనా ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి. రాత్రిపూట విధులు నిర్వహించే సమయంలో.. తులసి, పుదీనా ఆకులను నమలండి. ఆపిల్, క్యారెట్లు, పుచ్చకాయలు, పైనాపిల్ వంటి పండ్లు.. నోటి దుర్వాసనను తగ్గిస్తాయి. నోటిలో బ్యాక్టీరియాను తొలగించడం, లాలాజల ఉత్పత్తిని పెంచడంలో ముందుంటాయి. అయినా.. సమస్య అలాగే ఉంటే దంతవైద్యులను సంప్రదించండి.

# నిద్ర రావట్లేదా?

వృద్ధుల్లో నిద్రలేమి సాధారణ సమస్యగా మారింది. నిద్ర మాత్రలు తాత్కాలిక ఉపశమనాన్ని అందించినా.. తరచుగా వాడితే దుష్ప్రభావాల ప్రమాదం ఉంటుంది. ఇందుకు నిపుణులు సిఫారసు చేస్తున్న ఒక సులభమైన చిట్కా.. క్రమం తప్పని శారీరక శ్రమ. వయసు పెరిగేకొద్దీ.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. అదనంగా ఆర్థరైటిస్, గుండె సమస్యలు, మందుల వాడకం వంటివి నిద్రకు భంగం కలిగిస్తాయి. దాంతో పెద్దవాళ్లు నిద్రపోవడంలో ఇబ్బంది పడుతుంటారు. రాత్రిపూట తరచుగా మేల్కొంటూ ఉంటారు. ఫలితంగా జ్ఞాపకశక్తి సమస్యలు, రోగ నిరోధక శక్తి తగ్గడం, మానసిక స్థితిలో మార్పులు లాంటి సమస్యలు ఎదురవుతాయి. వీటినుంచి బయటపడాలంటే.. వృద్ధుల్లో నిద్ర సమస్యలను నివారించాలి. అందుకు 'వ్యాయామం' చక్కని పరిష్కారం చూపుతుంది. వ్యాయామంతో నిద్ర... చిన్నచిన్న వ్యాయామాలతోనూ కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) స్థాయిలు తగ్గుతాయి. దాంతో ఒత్తిడి, ఆందోళన దూరమవుతుంది. మనసు విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది. వ్యాయామం.. జీవ గడియారాన్ని రీసెట్ చేస్తుంది. ముఖ్యంగా ఉదయంపూట ఆరుబయట నడక వల్ల.. శరీరానికి సహజమైన సూర్యకాంతి అందుతుంది. ఇది రాత్రిపూట మెలటోనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. మితమైన వ్యాయామంతో శరీరం ఆరోగ్యకరమైన రీతిలో అలసిపోతుంది. ఫలితంగా.. రాత్రిపూట మంచి నిద్రపట్టేస్తుంది. సాయంత్రాల్లో ఓ మోస్తరు యోగాసనాలు వేయడం వల్ల.. శరీరానికి తగినంత విశ్రాంతి లభిస్తుంది. రాత్రి గాఢనిద్రలోకి జారుకునేలా చేస్తుంది. నిరంతరం వ్యాయామం చేసే వృద్ధులు నాణ్యమైన నిద్రపోతారని ఇటీవలి అధ్యయనాలు వెల్లడించాయి. అయితే, పడుకునే రెండు గంటల ముందు వ్యాయామాలకు దూరంగా ఉండటమే మంచిది. వ్యాయామం.. కేవలం శారీరక ఆరోగ్యం కోసమే కాదు. ఇది పెద్దల్లో మనశ్శాంతిని పునరుద్ధరిస్తుంది.

# లైఫ్ ట్రాప్స్‌లో లవ్



ఈరోజుల్లో ప్రేమంటే? కాఫీ డేట్స్, రీల్స్, స్టోరీస్‌లో లవ్ వైబ్స్, షాపింగ్.. అంతేనా? నిజానికి బంధాలు అంత తేలికైనవి కావు. మీరు మనస్ఫూర్తిగా ఎవరినైనా ప్రేమిస్తే, ఆ బంధం మీకు సంతోషాన్ని ఇవ్వాలి. కానీ, కొన్నిసార్లు ప్రేమ పేరుతో విసిరే ఉచ్చులో మనం చిక్కుకుపోతుంటాం. పదేపదే మనకు సరిపోని వాళ్ల మాయలోనే పడిపోతుంటాం. అందుకు కారణం కూడా మన ఆలోచనలే కావడం విచిత్రం. మనలో కొన్ని 'లైఫ్ ట్రాప్‌లు' పనిచేస్తుంటాయి అని మీకు తెలుసా? బాల్యంలో మొదలయ్యే కొన్ని భావనలు పెద్దయ్యాక సంబంధాలను ప్రభావితం చేస్తాయి. డాక్టర్ జెఫ్రీ యంగ్ అనే సైకాలజిస్ట్ 'స్కీమా థియరీ'తో ఈ 'లైఫ్ ట్రాప్‌ల' గురించి ఏనాడో చెప్పారు. ఇవి మన ఆలోచనల్ని, నిర్ణయాల్ని ప్రభావితం చేస్తాయి. సరైన భాగస్వామిని ఎంచుకోవడంలో తప్పులు చేసేలా ప్రోత్సహిస్తాయి. చివరికి ఇంకేముంది హార్ట్‌బ్రేక్!! అమ్మాయిలు ముఖ్యంగా మూడు లైఫ్‌ట్రాప్‌ల వల్ల ఇబ్బందులు పడుతుంటారు. ఎమోషనల్ డిప్రివేషన్ (భావోద్వేగాల లేమి), అబాండన్‌మెంట్ (విడిచి వెళ్లిపోతారేమో అనే భయం), సెల్ఫ్ శాక్రిఫైస్ (స్వీయ త్యాగం). ఈ మూడు ధోరణుల వల్ల భాగస్వామి ఎంపికలో, ప్రేమను నిలబెట్టుకోవడంలో తప్పులు చేస్తుంటారు.

కావాల్సిన ప్రేమ దొరకదేమో?!

నాకు కావాల్సిన ప్రేమ దొరకడం లేదు!! వాళ్లు నన్ను ప్రేమించినా.. సరిగ్గా వ్యక్తపరచడం లేదు.. ఇలాంటి ఆలోచనలు మీలో ఉన్నాయా? చిన్నప్పుడు మీకు సరైన ఆప్యాయత దొరకలేదా? అమ్మానాన్నలు దూరంగా ఉన్నారా? వాళ్లు మీకు అన్నీ ఇచ్చినా, మీ మనసులో ఏం ఉందో అర్థం చేసుకోలేదా? అలాంటప్పుడు, మీరు భావోద్వేగాలు అంతగా వ్యక్తపరచని వ్యక్తులకే త్వరగా ఆకర్షితురాలు అవుతారు. చిన్నప్పటి నుంచి భావోద్వేగాల లేమితో సతమతమైన మీ మనసు.. మీ తరహా వ్యక్తిత్వం ఉన్నవారికే అట్రాక్ట్ అవుతుంది. కానీ, లేనిది వెతుక్కోవడమే కదా జీవితం! బాల్యం నుంచి దొరకని ఆప్యాయత భాగస్వామి నుంచి ఆశించడం తప్పు కాదు. కన్సర్న్ చూపించే వారిని కాదని, మీలా బోర్‌గా ఫీలయ్యే వాళ్ల వెంటపడితే.. చివరికి జీవితంలో భావోద్వేగాలు మృగ్యమైపోతాయి.

నన్ను వదిలేస్తారేమో?! ప్రేమించినవాడు వదిలేస్తాడేమో అన్న అనుమానం..

## వాళ్లు కాస్త దూరం జరిగినా ఆత్మరక్షణలో పడిపోవడం..

మీలో ఈ తరహా ఫీలింగ్స్ వస్తుంటే కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. చాలామంది తల్లిదండ్రులు ఎప్పుడూ ఒకేలా ఉండరు. పిల్లలంటే ప్రేమ ఉన్నప్పటికీ%ూ% పరిస్థితులను బట్టి వాళ్ల అభిమానం వ్యక్తమవుతూ ఉంటుంది. కొన్నిసార్లు అతి గారాబం చేయడం, కొన్నిసార్లు మరీ ఎక్కువ నిర్లక్ష్యం చేయడం లాంటి పరిస్థితులు ఎదుర్కొన్న ఆడపిల్లల ఆలోచన కాస్త చిత్రంగా ఉంటుంది. ప్రేమలో అడుగుపెట్టినప్పటి నుంచి అనుమానాలు వాళ్లను పీడిస్తూ ఉంటాయి. భాగస్వామి ఏ కొంచెం స్పందించకపోయినా.. అతిగా స్పందిస్తుంటారు. ఎప్పుడూ అతణ్నే అంటిపెట్టుకొని ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. మరింత గాఢమైన ప్రేమను ఆశిస్తూ ఉంటారు. ఈ భయం మీ నిబద్ధతను చూపించకపోగా, నిజమైన ప్రేమను కూడా అంగీకరించలేని పరిస్థితిలోకి నెట్టేస్తుంది.

ప్రాణం అయినా ఇస్తాను

నా భాగస్వామి సంతోషంగా ఉంటే చాలు.. వాళ్ల కోసంఏదైనా చేస్తాను..

పైకి చూస్తే ఇలా ఆలోచించడం గొప్ప విషయమే! ప్రేమంటే త్యాగమే!! కానీ, లవ్‌జర్నీలో ఇదో ప్రమాదకరమైన ట్రాప్. చిన్నప్పటి నుంచి ఇంట్లోవాళ్ల కోసం త్యాగాలకు అలవాటుపడిన ప్రాణమైతే మరీ ప్రమాదం. ఎదుటివ్యక్తిని సంతోషపర్చడానికి ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడుతుండటం అలవాటుగా చేసుకుంటారు. ఇక ప్రేమించిన వ్యక్తి కోసం విపరీత త్యాగాలకు పాల్పడుతుంటారు. సరైనోడు అయితే త్యాగం చేసినా కొంత ఫర్వాలేదు. కానీ, మీ బలహీనతను అలుసుగా తీసుకునే బాపతు ప్రేమికుడు ఎదురుపడితే.. మీ త్యాగాలకు విలువ ఉండదు సరికదా, కొన్నిసార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి కూడా రావొచ్చు. ఈ త్యాగశీలురు తమ భాగస్వామి నుంచి కూడా అదే తరహా త్యాగాలను ఆశిస్తే%ూ% మీ ప్రేమ మొగ్గలోనే వాడిపోవడం ఖాయం. జెన్-జీ అమ్మాయిలు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్రపంచంలో పెరుగుతున్నారు. వారికి బంధాలపై స్పష్టమైన అవగాహన ఉండటంలేదు. అపరిచితులతో తేలికగా కనెక్ట్ అవుతున్నారు. ఈ క్రమంలో బాల్యంలో ఎదురైన అనుభవాలు, మనసుకు తగిలిన గాయాలు.. ఈ సంబంధాలపై పడితే.. మరింత డేంజర్ జోన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. కాబట్టి, రిలేషన్‌లోకి ప్రవేశించడానికి ముందు.. మానసికంగా దృఢంగా ఉండాలి. ఎదుటివ్యక్తిని సరిగ్గా అంచనా వేయగలగాలి. అప్పుడే ఆరోగ్యకరమైన ప్రేమను పొందే అవకాశాలు ఉంటాయి.

# జుట్టుకు మునగాకు!

మునగ ఆకుల్లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి అనేక శారీరక సమస్యలను దూరం చేస్తాయి. జుట్టు ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ ముందుంటాయి. మునగాకులో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ బి6, సి, ఐరన్, జింక్, క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. అవన్నీ జుట్టు సమస్యలకు చక్కటిపరిష్కారం చూపుతాయి. మునగాకుతో హెయిర్ ప్యాక్స్ తయారుచేసుకొని వాడితే.. అద్భుత ఫలితాలు కనిపిస్తాయి. తయారీ విధానం.. ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ మునగాకు పొడి, టేబుల్ స్పూన్ ఉసిరి పొడిని తీసుకోవాలి. రెండిటినీ బాగా మిక్స్ చేసి.. కొద్దికొద్దిగా పెరుగు కలుపుతూ మెత్తని పేస్ట్ తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టేలా జుట్టుకు ప్యాక్ వేసుకోవాలి. అరగంట సేపు అలాగే ఉంచి.. గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. అనేక ప్రయోజనాలు.. మునగాకులో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఫంగల్ గుణాలు పుష్కలం. ఇవి జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. వెంట్రుకలు ఒత్తుగా పెరిగేందుకు సాయపడతాయి. ఇందులో ఉండే జింక్.. జుట్టు కుదుళ్లలోని సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది. దాంతో కుదుళ్లు తేమగా మారుతాయి. చుండ్రు, దురద వంటి సమస్యలను తరిమేస్తాయి. తెల్ల జుట్టు సమస్యకూ మునగాకు చక్కని పరిష్కారం. ఇందులో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్ సి.. వెంట్రుకలు నెరవడానికి కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. మునగాకులో ఉండే బెహెనిక్, ఓలియిక్ ఆమ్లాలు.. జుట్టు ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. కుదుళ్లలో ఇన్‌ఫ్లమేషన్, ఇతర సమస్యల్ని తగ్గిస్తాయి.



# మార్కెట్

## ముంబైలో టెస్లా తొలి షోరూం.. నెల అద్దె ఎంతో తెలుసా..?


ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత విపణిలోకి అడుగుపెట్టింది. ఇవాళ ఉదయం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో టెస్లా తన తొలి షోరూంను గ్రాండ్‌గా లాంచ్ చేసింది. ఈ షోరూం కోసం బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ అద్దెకు తీసుకుంది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగానూ కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె (%వీశీత్ప్రశ్రీఎ =వత్%) చెల్లించనున్నారని తెలిసింది. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసినట్లు సమాచారం. మరోవైపు తొలిషోరూం కోసం టెస్లా సంస్థ వై మోడల్ కార్లను చైనాలోని షాంఘై నగరంలో గల తమ ఫ్యాక్టరీ నుంచి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన వై మోడల్ కారు ధర పన్నులు, బీమా కలిపితే రూ. 48 లక్షలపైనే ఉండనుంది. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ రెండో షోరూంను ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని సమాచారం.




## నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్..

# 317 పాయింట్లు సెన్సెక్స్ జంప్..!

దేశీయ స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల తర్వాత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. జూన్ నెలలో భారత దేశ ద్రవ్యోల్బణం 77 నెలల కనిష్ట స్థాయి 2.1శాతానికి తగ్గింది. ఈ క్రమంలో మార్కెట్‌లో అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,233.16 ఫ్లాట్‌గా మొదలైంది. ఈ తర్వాత కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 82,221.74 పాయింట్ల కనిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,743.62 పాయింట్లకు చేరింది. చివరకు సెన్సెక్స్ 317.45 పాయింట్లు పెరిగి 82,570.91 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 113.50 పాయింట్లు పెరిగి 25,195.80 వద్ద ముగిసింది. అన్ని రంగాల సూచీలు ఫార్మా, ఆటో, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ 0.5-1 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం పెరిగాయి. హీరో మోటోకార్ప్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, అపోలో హాస్పిటల్స్, శ్రీరామ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధానంగా లాభాలను నమోదు చేశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎటర్నల్, టాటా స్టీల్ నష్టపోయాయి. విస్తరణ ప్రణాళిక నేపథ్యంలో హీరో మోటోకార్ప్ షేర్లు 5 శాతం పెరిగాయి. ర్యాలీస్ ఇండియా షేర్లు 52 వారాల గరిష్టాన్ని తాకాయి. క్యూ 1లో లాభం దాదాపు రెట్టింపు అయిన విషయం తెలిసిందే. తేజస్ నెట్‌వర్క్స్ షేర్లు క్యూ 1లో నష్టాల నేపథ్యంలో షేర్లు 6 శాతం పడిపోయాయి. యూఎస్ పేటెంట్ సెటిల్‌మెంట్ లెక్సెల్వి ప్రారంభానికి మార్గం సుగమం కావడంతో సన్ ఫార్మా షేర్లు దాదాపు 3శాతం పెరిగాయి. ఈస్ట్ సెంట్రల్



రైల్వే నుంచి ఆర్డర్లతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేర్లు 2 శాతం పెరిగాయి. టాటా టెక్నాలజీస్ షేర్లు జూన్ త్రైమాసికంలో నికర లాభం 5శాతం పెరగడంతో షేర్లు 2 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 140 స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి. ఇందులో ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, నిప్పాన్ లైఫ్, హెచ్‌డీఎఫ్ ఏఎంసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, జిల్లెట్ ఇండియా, యూటీఐ ఏఎంసీ, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, అనుపమ్ రసాయనన్, లారస్ ల్యాబ్స్, ఈఐడీ ప్యారీ, గ్లోబల్ హెల్త్, సియట్, జేఎం ఫైనాన్షియల్ ఉన్నాయి.



# తెలుగు మూవీలో కరీనా ఎంట్రీ ?

సినీ పరిశ్రమలో దాదాపు 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు నటి కరీనా కపూర్ .కెరీర్ ఆరంభం నుంచి బాలీవుడ్‌లోనే ఉన్న ఆమె ప్రస్తుతం దక్షిణాది సినిమాల్లోనూ నటించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ కోసం సంతకం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఓ ప్రతిష్టాత్మక మూవీలో కరీనాకపూర్ భాగమయ్యారంటూ బీటౌన్‌లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈనేపథ్యంలోనే ప్రభాస్ 'స్పిరిట్' , మహేశ్ బాబు, రాజమౌళి ప్రాజెక్టులు తెరపైకి వచ్చాయి. ఆ రెండు చిత్రాల్లో ఒక దాని కోసం ఆమె సైన్ చేశారని టాక్. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న భారీ ప్రాజెక్ట్ 'స్పిరిట్'. సుమారు రూ.500 కోట్ల భారీ బ్జడెట్‌తో యాక్షన్ డ్రామాగా సిద్ధం కానుంది. ప్రభాస్ తొలిసారి పోలీస్ పాత్రలో అలరించనున్నారు. ఈ ఏడాది చివరిలో ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టే అవకాశం ఉంది. 2026లో విడుదల కానుంది. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా కరీనాకపూర్ కనిపించనున్నారని.. విలన్‌గా ఆమె భర్త, నటుడు సైఫ్ అలీఖాన్ నటించనున్నారని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈమేరకు చర్చలు జరిగాయని సమాచారం. దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ మూవీ పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. భారీ బ్జడెట్‌తో ప్రతిష్టాత్మకంగా దీనిని సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఇది సెట్స్ పైకి వెళ్లనుంది. 'గరుడ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఈ చిత్రంలో కరీనాకపూర్ నటించనున్నారని.. ఇప్పటికే చిత్రబృందం ఆమెను సంప్రదించినట్లు వార్తలు వస్తున్నాయి. రాజమౌళి సినిమా కావడంతో కరీనా కూడా వెంటనే ఓకే చెప్పారని టాక్. ఈ వార్తలపై నటి టీమ్ నుంచి ఏ విధమైన స్పందన రాలేదు.




# జైహనుమాన్‌లో అక్షయ్ ఖన్నా ?

టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను హాలీవుడ్ రేంజ్‌లో విస్తరిస్తున్నారు. ప్రస్తుతం అందరి కళ్లు ఆయన ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న 'జై హనుమాన్'పైనే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన కాస్టింగ్ అప్‌డేట్‌కు సంబంధించి ఇప్పుడు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా నటనకు ఫిదా అయిన ప్రశాంత్ వర్మ, ఆయనను 'జై హనుమాన్' ప్రాజెక్టులోకి కూడా ఆహ్వానించినట్లు సమాచారం. ఇప్పటికే ప్రశాంత్ వర్మ యూనివర్స్‌లోని 'మహాకాళి' చిత్రంలో అక్షయ్ ఖన్నా 'శుక్రాచార్యుడి' గా కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అక్షయ్ ఖన్నా పోషించబోయే పాత్రపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 'మహాకాళి'లో ఆయన చేస్తున్న శుక్రాచార్యుడి పాత్రకు, 'జై హనుమాన్'లోని పాత్రకు ఏమైనా లింక్ ఉంటుందా? లేక ఇది సరికొత్త పాత్రనా? అన్నది మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రశాంత్ వర్మ తన యూనివర్స్‌లోని పాత్రలను ఒకదానితో ఒకటి అనుసంధానించడంలో దిట్ట కాబట్టి, అక్షయ్ ఖన్నా ఎంట్రీ ఈ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తోంది. కేవలం బాలీవుడ్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొనే కాకుండా, పాత్రకు ఉన్న వెయిటేజ్ కారణంగానే ఆయనను ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. క 'జై హనుమాన్'లో కన్నడ స్టార్, 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి లీడ్ రోల్ హనుమంతుడుగా చేస్తున్న విషయం తెలిసిందే. రిషబ్ శెట్టి లాంటి పవర్‌ఫుల్ పర్ఫార్మర్‌కు తోడు అక్షయ్ ఖన్నా వంటి వెర్సటైల్ యాక్టర్ తోడవ్వడం సినిమాకు పెద్ద అసెట్ కానుంది. ప్రశాంత్ వర్మ విజన్ ప్రకారం, ఈ యూనివర్స్‌లో ప్రతి పాత్రకు ఒక ప్రాముఖ్యత ఉంటుంది, కాబట్టి అక్షయ్ ఖన్నా రోల్ కూడా కథను మలుపు తిప్పేలా ఉంటుందని టాక్. బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమనిపిస్తోంది. 'జై హనుమాన్'లో అక్షయ్ ఖన్నా రోల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# కన్నడ చిత్రంలోనూ.. వేధింపులు

## నటి నీతూశెట్టి ఆరోపణలతో కలకలం

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపుల గురించి జస్టిస్ హేమ కమిటీ రూపొందించిన రిపోర్ట్ ఇప్పుడు అన్ని భాషల్లోనూ కలకలం రేపుతోంది. ఈనేపథ్యంలోనే కన్నడ చిత్ర పరిశ్రమలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని నటి నీతూశెట్టి షాకింగ్ ఆరోపణలు చేశారు. తాజాగా ఓ జాతీయ మీడియాతో మాట్లాడిన ఆమె కొన్ని కీలక విషయాలు బయటపెట్టారు. కన్నడ చిత్రపరిశ్రమలోనూ మహిళలు వేధింపులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. వాటిని బయటకు రానివ్వరు. గతంలో ఒక నిర్మాత నాతో ఇబ్బందికరంగా ప్రవర్తించాడు. సినిమా చర్చలో భాగంగా ఆయన్ని కలిశాను. సినిమా గురించి పక్కన పెట్టి హాలీడే కోసం తనతో గోవాకు రమ్మని పిలిచాడు అని నీతూశెట్టి ఆరోపించారు. 'కన్నడ చిత్ర పరిశ్రమలో నటించిన ఏ నటినైనా అడగండి. వాళ్ల దగ్గర చెప్పడానికి తప్పకుండా ఒక వేధింపుల కథ ఉంటుంది' అని మరో నటి ఆరోపించారు. అయితే తాను ఎవరి వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నది చెప్పాలనుకోవడం లేదన్నారు. జస్టిస్ హేమ కమిటీ వంటి కమిటీలు అన్నిచోట్లా ఉండాలని, అప్పుడే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయని ఆమె వివరించారు. దాదాపు ఏడేళ్లపాటు శ్రమించి జస్టిస్ హేమ కమిటీ ఈ నివేదికను సిద్ధం చేసింది. మలయాళ సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వర్కింగ్ కండిషన్లు, రెమ్యూనరేషన్, సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం తదితర అంశాలను అధ్యయనం చేసిన కమిటీ.. కాస్టింగ్ కౌచ్ మొదలు వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఈ నివేదికలో వెల్లడించిన పలు అంశాలు అంతటా తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈనేపథ్యంలోనే నటీమణులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయనే అంశాలు తెలుసుకోవడంపై పలు చిత్ర పరిశ్రమలు దృష్టిపెట్టాయి. ఇటీవల కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆ పరిశ్రమకు చెందిన తారలతో సమావేశం నిర్వహించి వారికి ఎలాంటి పరిస్థితులు ఉన్నాయనే విషయాన్ని అడిగి తెలుసుకుంది.





# ఆదిత్యరాయ్‌తో డేటింగ్‌లో సుతారియా

బాలీవుడ్ లో ఇప్పుడు సినిమాల కంటే స్టార్ల వ్యక్తిగత జీవితాల చుట్టూనే ఎక్కువగా వార్తలు నడుస్తున్నాయి. మరీ ముఖ్యంగా హీరోహీరోయిన్ల డేటింగ్‌కు సంబంధించి, ఏ చిన్న టాపిక్ వచ్చినా.. అది సెన్సేషన్‌గా మారుతోంది. గతంలో ఇలాంటి డేటింగ్ వ్యవహారాల అనంతరం సెలబ్రిటీలు కొందరు మ్యారేజ్ చేసుకున్న వారు కూడా ఉన్నారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఇలాంటి విషయాలు కామన్‌గా మారిపోయాయి. ఇప్పుడీ కామన్ పాయింట్‌లోకి మరో కొత్త జంట వచ్చి చేరారు. 'ఆషికీ2', 'ఓకే జాను' చిత్రాల ఫేమ్ ఆదిత్య రాయ్ కపూర్.. 'తడప్', 'హీరోపంతి 2' ఫేమ్ తారా సుతారియా డేటింగ్‌లో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియా సర్కిల్స్‌లో వార్తలు సెన్సేషన్‌గా మారాయి. బాలీవుడ్‌లోని ప్రధాన మీడియా సంస్థలు వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని అధికారికంగా ధృవీకరించడంతో.. సోషల్ మీడియాలో వారిద్దరి గురించే డిస్కషన్ నడుస్తోంది. ఇటీవల జరిగిన పలు సినీ వేడుకలు, ప్రైవేట్ పార్టీల్లో వీరిద్దరూ జంటగా కనిపించడంతో అభిమానులకు ముందే అనుమానం వచ్చింది. కొన్నిరోజులుగా వీరి రిలేషన్‌పై వార్తలైతే వినిపిస్తున్నాయి కానీ, అధికారికంగా ఎక్కడా రివీల్ కాలేదు. ఇప్పుడు ప్రధాన మీడియా సంస్థలే కన్ఫర్మ్ చేయడంతో.. ఇద్దరి మధ్య రిలేషన్ నిజమే అనేలా ఫ్యాన్స్ కూడా ఫిక్స్ అవుతున్నారు.

# సొంత కథతో సిద్ధం అవుతున్న రామ్

దేవదాసుతో వెండితెరకు పరిచయమైన రామ్ తన ఎనర్జీతో, డ్యాన్స్‌తో, యాక్టింగ్‌తో టాలీవుడ్‌ను ఊపేశాడు. లవర్ బాయ్‌గా అమ్మాయిల మనసు గెలిచిన రామ్, ఇస్మార్ట్ శంకర్ తో మాస్ బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు. కానీ, గడిచిన కొంతకాలంగా రామ్ కెరీర్ ఒక విచిత్రమైన సందిగ్ధంలో పడింది. వరుస ప్లాపులు.. అంచనాలు తప్పిన లెక్కలు. ఇప్పుడు వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు రామ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. రామ్ కెరీర్‌ను ఒకసారి గమనిస్తే.. అటు క్లాస్ సినిమాలతో పాటు, మాస్ సినిమాలతోనూ సత్తా చాటుకున్నారు. ఇక కరోనా కు ముందు వచ్చిన ఇస్మార్ట్ శంకర్ రామ్ కెరీర్‌లో బి÷-గగెస్ట్ మైల్‌స్టోన్‌గా నిలిచింది. పూరీ జగన్నాథ్ మార్క్ మేనరిజమ్స్‌తో రామ్ ఊరమాస్ అవతారంలో అదరగొట్టాడు. కానీ ఆ తర్వాత వచ్చిన రెడ్, ది వారియర్, స్కంద, చివరకు డబుల్ ఇస్మార్ట్ కూడా ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోయాయి. రీసెంట్ మూవీ ఆంధ్రా కింగ్ కథ పరంగా బాగుందని ప్రశంసలు దక్కించుకున్నా, కమర్షియల్‌గా రామ్‌కు కావాల్సిన పెద్ద బ్రేక్ ఇవ్వలేకపోయింది. దీంతో రామ్ తన కెరీర్ పట్ల పూర్తిస్థాయి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఒక హీరో వరుస ప్లాపుల్లో ఉంటే కొత్త దర్శకుల కోసం వెతుకుతారు. కానీ రామ్ ఆలోచన డిఫరెంట్‌గా ఉంది. తన బలాలు ఏంటి? బలహీనతలు ఏంటి? అనేది ఒక నటుడిగా తనకన్నా బాగా ఇంకెవరికి తెలుస్తుంది అనుకున్నాడట. అందుకే తన తదుపరి సినిమాకు తానే కథను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. మొదట కథ ఇచ్చి వేరే దర్శకుడితో చేయిద్దాం అనుకున్నా, చివరి నిమిషంలో మనసు మార్చుకుని మెగాఫోన్ పట్టాలని డిసైడ్ అయ్యాడట. సినిమాల ఎంపికలోనూ, మేకింగ్ ప్రాసెస్‌లోనూ రామ్ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. ఇప్పుడు అదే అనుభవంతో తన సొంత బ్యానర్ స్రవంతి మూవీస్ లో ఈ భారీ ప్రాజెక్టును తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో అడవి శేష్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ వంటి యంగ్ హీరోస్ తమ సొంత కథలతో సక్సెస్ అవుతున్నారు. ఇప్పుడు రామ్ కూడా అదే బాటలో ప్రయాణించి తన ఫేట్‌ను మార్చుకోవాలని చూస్తున్నారు.






# విశ్వంభరలో త్రిష లుక్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఎపిక్ 'విశ్వంభర' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఆమె క్యారెక్టర్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పోస్టర్‌లో త్రిష ట్రెడిషనల్ లుక్‌లో డివైన్ ఔరాతో కనిపిస్తూ ఆకట్టుకుంది. అయితే ఇది కేవలం గ్లామర్ పాత్ర మాత్రమే కాదని, కథలో కీలక పాత్ర పోషించబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, త్రిష పోషిస్తున్న 'అవని' పాత్ర సినిమా కథలో కీలక మలుపులు తీసుకువచ్చే ప్రధాన అంశంగా ఉండనుంది. ముఖ్యంగా ఈ పాత్ర చుట్టూనే సినిమా నెరేషన్ తిరిగే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు త్రిష చేసిన పాత్రలతో పోలిస్తే, ఈ పాత్రలో ఎక్కువ ఎమోషనల్ వెయిట్, డెప్త్ ఉండబోతుందని తెలుస్తోంది. కేవలం స్క్రీన్ ప్రెజెన్స్‌కే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే డ్రైవింగ్ ఫోర్స్‌గా అవని పాత్ర ఉండటం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత కొన్నేళ్లుగా సెలెక్టివ్ ప్రాజెక్ట్స్‌తో ముందుకు సాగుతున్న త్రిషకు 'విశ్వంభర' ఒక స్టాం÷-రగ్ కంబ్యాక్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మెగాస్టార్ చిరంజీవి-త్రిష కాంబినేషన్ కూడా ఈ సినిమాకు మరో ప్రధాన హైలైట్.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com